

ఒంగోలు కేశవస్వామిపేటలోని కాశీవిశ్వేశ్వర ఆలయంలో జ్వాలాతోరణానికి హాజరైన భక్తులు

శంభో శంకర...





సముద్ర స్నానాలు చేసేందుకు తరలివచ్చిన భక్తులతో కోలాహలంగా ఉన్న కొత్తపట్నం పల్లెపాలెం తీరం (ఇన్‌సెట్‌లో) త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వరుడు



సాగరానికి హారతి ఇస్తున్న మహిళలు

జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తి భావం ఉప్పొంగింది. ఓంకార నాదం మార్మోగింది. కార్తీక పౌర్ణమిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామునుంచే శైవక్షేత్రాలు, శివాలయాల వద్ద బారులు తీరారు. పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. పుణ్యస్నానాలు ఆచరించేందుకు జిల్లాలోని తీరప్రాంతాలకు ప్రజలు పోటెత్తారు. దీంతో కొత్తపట్నం పల్లెపాలెం, మడనూరు, ఈతముక్కల, పాకల వద్ద కోలాహలం నెలకొంది. ప్రముఖ శైవక్షేత్రాలైన భైరవకోన, త్రిపురాంతకం, జమ్ములపాలెంలోని 1,116 శివలింగాల వేదిక, రామతీర్థంలు భక్తులతో కిటకిటలాడాయి.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు కల్చరల్



జమ్ములపాలెంలోని 1,116 శివలింగాల వేదికలో పూజలు చేస్తున్న భక్తులు

నీటి సంఘాల ఎన్నికల కోలాహలం



- కసరత్తు ముమ్మరం
- జిల్లాలో 342 డబ్ల్యూయూఏలు, పది డిస్ట్రిబ్యూటరీ కమిటీలు
- గ్రామ, మండలస్థాయిలో కీలకం
- రైతుల్లోనూ గుర్తింపు
- ఓటర్ల జాబితాలు సిద్ధం
- అధికారుల నియామకం, శిక్షణ పూర్తి



నీటి సంఘాల ఎన్నికలపై మార్కాపురం డివిజన్ స్థాయి శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్వో ఓబులేసు

ఒంగోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నీటిసంఘాల ఎన్నికల కోలాహలం ప్రారంభమైంది. క్షేత్రస్థాయిలోని రైతుల్లో ఈ పదవులకు మంచి గుర్తింపు ఉండటంతో అధికార పార్టీలోని గ్రామ, మండలస్థాయి నాయకులు దృష్టి సారించారు. పలుప్రాంతాల్లో పోటీ కూడా కనిపిస్తోంది. మూడు దశలుగా ఈ ఎన్నికలు జరుగుతాయి. చిన్న, మధ్యతరహా నీటి వనరులు, భారీ ప్రాజెక్టులకు విడివిడిగా కమిటీలు ఉంటాయి. జిల్లాలో మొత్తం క్షేత్రస్థాయిలో 342 సాగునీటి వినియోగదారుల సంఘాలు (డబ్ల్యూయూఏలు) ఉండగా అందులో 240 చిన్ననీటి వనరులైన చెరువుల స్థాయిలో, 14 మధ్యతరహా నీటి వనరుల పరిధిలో, మిగిలిన 88 సంఘాలు ఎన్ఎస్‌పీ పరిధిలో ఉన్నాయి. ఎన్ఎస్‌పీలో పది మంది డిస్ట్రిబ్యూటరీ చైర్మన్లను ఎన్నుకుంటారు. మధ్యతరహా ఇరిగేషన్ కింద ఉన్న కంభం చెరువు, వీబీ ఆనకట్ట, మోపాడు రిజర్వాయర్‌లకు కమిటీలు ఏర్పాటు చేస్తారు. వీటిని ఆ పరిధిలోని డబ్ల్యూయూఏల ద్వారా ఎన్నుకుంటారు.

నెల నుంచి కొనసాగుతున్న ప్రక్రియ

జిల్లాలో నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన ప్రాథమిక ప్రక్రియ దాదాపు నెలరోజులపైనే సాగుతోంది. ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. జిల్లాలో మొత్తం లక్షా 10వేల మంది రైతులు నీటిసంఘాల పరిధిలో సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చిన్న నీటి వనరుల విభాగంలోని డబ్ల్యూయూఏలను ఆరు ప్రాదేశికాలు (టీసీలు)గా, మధ్యతరహా, భారీ వనరుల పరిధిలోని డబ్ల్యూయూఏలను 12 ప్రాదేశికాలుగా విభజించారు. ఏ టీసీ పరిధిలో ఎంత మంది రైతులు ఓటర్లుగా ఉన్నారన్న లెక్క తేల్చి జాబితాలను సిద్ధం చేశారు. ఆవిధంగా ఆ టీసీ పరిధిలో ఓటర్లుగా ఉన్న రైతుల నుంచి సభ్యుడిని ఎన్నుకుంటారు. అలా ఎన్నికైన టీసీ సభ్యులలో ఒకరిని సదరు డబ్ల్యూయూఏ చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. మేజర్ ఇరిగేషన్‌లో ఉన్న డబ్ల్యూయూఏల చైర్మన్ల నుంచి సంబంధిత ప్రాంత డీసీ చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. మీడియం ఇరిగేషన్‌లోని ప్రాజెక్టు కమిటీని ఆ పరిధిలోని డబ్ల్యూయూల చైర్మన్ల నుంచి ఎన్నుకుంటారు. తదనుగుణంగా టీసీలు,

మిగతా 6వ పేజీలో





సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణతేజ

మౌలిక సదుపాయాలకు పెద్దపీట

- గ్రామాలలో ఎటువంటి సమస్య ఉన్నా నా దృష్టికి తెస్తే పరిష్కరిస్తా
- సమన్వయంతో పనిచేసి అభివృద్ధి సాధించాలి
- పంచాయతీరాజ్ డైరెక్టర్ కృష్ణతేజ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయాలని పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ కృష్ణతేజ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన ఆయన మద్దిపాడు, సింగరాయకొండ, టంగుటూరు, ఒంగోలు రూరల్ మండలాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం స్థానిక పాత జడ్పీ సమావేశపు హాలులో జడ్పీ, జిల్లా పంచాయతీ అధికారులు, ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ఉండేలా చూసుకోవాలన్నారు. ఆయా శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ఏమైనా లోటుపాట్లు ఉంటే పరిశీలించాలన్నారు. గ్రామాల్లో సీడబ్ల్యూసీల నిర్వహణపై జిల్లా పంచాయతీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ముందుగా అధికారులు, ఉద్యోగులను అడిగి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాల్లో సీడబ్ల్యూసీల నిర్వహణకు నిధుల కొరత ఉందని కృష్ణతేజ దృష్టికి తెచ్చారు. దీనిపై

మిగతా 6వ పేజీలో



పెదయిర్లపాడు ఇలాకాలో ఉన్న ప్రభుత్వ భూములను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న రిలయన్స్ ప్రతినిధులు

రిలయన్స్ బయోగ్యాస్‌కు భూమి పరిశీలన

- పెదఇర్లపాడు రెవెన్యూలో 475.57ఎకరాలు
- అనువుగా ఉంటుందని సంస్థ ప్రతినిధుల భావన

పీసీపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రిలయన్స్ సంస్థ రూ.130 కోట్లతో ఏర్పాటు చేయనున్న బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి అవసరమైన భూమిని ఆసంస్థ ప్రతినిధి బృందం శుక్రవారం పరిశీలించింది. మండలంలోని పెదఇర్లపాడు రెవెన్యూలోని సర్వే నెంబరు 652లో 475.57ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అది నిమ్న ప్రాంతంలో ఉంది. రిలయన్స్ సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ కె.శివరామకృష్ణ తహసీల్దార్ సీహెచ్ ఉషతో కలిసి ఆ భూమిని పరిశీలించారు. అక్కడ ప్లాంట్ ఏర్పాటుకు అనువుగా ఉంటుందన్న భావనకు వచ్చినట్లు సమాచారం. డిసెంబరు 28న ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో రిలయన్స్ ప్రతినిధులు భూసేకరణతోపాటు ఇతర పనులను వేగవంతం చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.



ప్రాజెక్టుకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

సంగమేశ్వరం ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్

- డీఈని అడిగి వివరాలు తెలుసుకున్న అన్సారియా

పొన్నలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నిపాడు వద్ద అర్ధంతరంగా ఆగిపోయిన సంగమేశ్వరం ప్రాజెక్టును కలెక్టర్ తమీమ్ అన్సారియా శుక్రవారం పరిశీలించారు. ప్రాజెక్ట్ పూర్తి వివరాలను డీఈ కరీముల్లాను అడిగి తెలుసుకున్నారు. నీటి నిల్వ, ప్రవాహం, కుడి, ఎడమ కాల్వలు, ముంపుప్రాంతం తదితర అంశాలను ఆయన క్షుణ్ణంగా వివరించారు. ఈసందర్భంగా ప్రాజెక్టు ప్రయోజనాలను పలువురు రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆమె వెంట తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీవో సుజాత, టీడీపీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, నాయకులు మండవ ప్రసాద్, కర్నా కోటిరెడ్డి, మండవ మురళి, తానికొండ మహేంద్ర తదితరులు ఉన్నారు.

టీడీపీకే ఒడా చైర్మన్

పరిశీలనలో పాపారావు, లక్ష్మి, ఎరిక్షన్ పేర్లు

వివరాలు 6వ పేజీలో

జువ్వలగుంట చెరువుకు గండి

- వృథాగాపోయిన వర్షపు నీరు

సింగరాయకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని జువ్వలగుంట చెరువుకు శుక్రవారం తెల్లవారు జామున భారీ గండిపడింది. దీంతో చెరువులోకి చేరిన నీరంతా వృథాగా బయటకు పోయింది. సమాచారం అందుకున్న తహసీల్దార్ టి.రవి, ఇరిగేషన్ అధికారులు చెరువు వద్దకు చేరుకొని గండిని పరిశీలించారు. నీటి ఉధృతి తగ్గిన వెంటనే దాన్ని పూడుస్తామని రైతులకు ఇరిగేషన్ అధికారులు భరోసా కల్పించారు.



చెరువుకు పడిన గండి నుంచి బయటకు వెళ్తున్న నీరు

ఇసుక యార్డులకు ఏజెన్సీలు ఎంపిక

- కొన్నింటికి లాటరీ పద్ధతిలో ఖరారు

ఒంగోలు క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆరు ఇసుక యార్డులకు ఏజెన్సీలను ఎంపిక చేసినట్లు జిల్లా ఇసుక కమిటీ మెంబర్ కన్వీనర్, మైనింగ్ అధికారి రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు యార్డులకు 13 ఏజెన్సీల నుంచి దరఖాస్తులు అందాయన్నారు. ఒంగోలుకు ఆరు, ఎర్రగొండపాలెంనకు 3, కనిగిరి, గిద్దలూరు, దర్శి, మార్కాపురంలకు ఒక్కొక్కటి చొప్పున వచ్చాయన్నారు. ఒంగోలు, వైపాలెం యార్డులకోసం వచ్చిన దరఖాస్తులను లాటరీ పద్ధతిన ఎంపిక చేశామన్నారు. మిగిలిన నాలుగు ప్రాంతాలలో ఒక్కో దరఖాస్తు మాత్రమే రావడంతో వారికే కేటాయించారు. ఒంగోలులో టన్ను రూ.980, గిద్దలూరులో రూ.1,200, మార్కాపురంలో రూ.1,280, వైపాలెంలో రూ.1,500, కనిగిరిలో రూ.980, దర్శిలో రూ.1,230కు ఇసుకను విక్రయించాలన్నారు. యార్డులకు ఎంపికైన ఏజెన్సీలు వెంటనే ఇసుక విక్రయాలకు సిద్ధం కావాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించినట్లు రాజశేఖర్ చెప్పారు.

అభాగ్యురాలిగానే..

- పోలీసు కార్యాలయం వద్ద ఆత్మాహుతి యత్నం చేసిన యువతి మృతి
- నేడు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంత్యక్రియలు
- ప్రియుడు మత్తయ్యను అరెస్టు చేయాలని డిమాండ్

వివరాలు 6వ పేజీలో

దొంగలు దొరికారు!

పలు చోరీ కేసుల్లో 8మంది అరెస్టు

- అందులో ఐదుగురు మోటార్ సైకిళ్లను మాయం చేసే ముఠా
- రూ.12 లక్షల విలువైన 17 బైక్‌లు స్వాధీనం
- ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు, గంజాయి విక్రయించే మరో ముగ్గురు కూడా..
- వివరాలను వెల్లడించిన ఎస్పీ దామోదర్



దొంగల వద్ద స్వాధీనం చేసుకున్న గంజాయి, రాగి తీగను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

6

తూమాడు సర్పంచ్, కార్యదర్శిలపై ఫిర్యాదు

జరుగుమల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేసిన మండలంలోని తూమాడు సర్పంచ్ వి.విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి డి.మౌనికలపై చర్యలు తీసుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ కనపర్తి శ్రీనివాసరెడ్డి డీపీవోను కోరారు. ఈమేరకు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. సర్పంచ్, కార్యదర్శి ఇద్దరూ కలిసి అవినీతికి పాల్పడ్డారని శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. పంచాయతీ ఆమోదం లేకుండా నిధులు ఖర్చు చేశారని, వ్యక్తిగతంగా కూడా కొంత డ్రా చేసుకున్నారని ఆయన డీపీవో దృష్టికి తీసుకెళ్లారు. ఆమేరకు ఆడిట్ అధికారులు గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

బ్యాంక్ ఖాతాలో నగదు మాయంపై కేసు

నాగులుప్పలపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారుడికి తెలియకుండా తన బ్యాంక్ ఖాతాలోని నగదు చెల్లింపు జరగడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ బి.శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు, అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన పోకూరి శ్రీనివాసరావుకు స్థానికంగా ఉన్న కెనరాబ్యాంక్‌లో ఖాతా ఉంది. తన ఖాతాలో ఉండాల్సిన నగదులో నుంచి రూ.2.40లక్షలు తన ప్రమేయం లేకుండా చెల్లింపులు జరిగినట్లు గుర్తించారు. దాంతో బాధితుడు శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

33మంది కానిస్టేబుళ్లు బదిలీ

ఒంగోలు(క్రైం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 33 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ ఎస్పీ ఏఆర్.దామోదర్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. వివిధ పోలీస్‌స్టేషన్‌లలో కానిస్టేబుళ్ళుగా పనిచేస్తున్న వారికి మోమోలు ఇచ్చి బదిలీ చేశారు.

అభాగ్యురాలిగానే...

పోలీసు కార్యాలయం వద్ద పెట్రోలు పోసుకున్న యువతి మృతి

నేడు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంత్యక్రియలు

ప్రియుడు మత్తయ్యను అరెస్టు చేయాలని డిమాండ్

ఒంగోలు క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట ఈనెల 11న పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన కర్నాటకకు చెందిన యశోదచౌహాన్(25) రిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. మధ్యాహ్నం ఒంగోలు తాలూకా సీఐ అజయ్‌కుమార్, తహసీల్దార్ వాసు అక్కడకు చేరుకుని శవపంచనామా నిర్వహించారు. యశోద ఆమె బంధువులు మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు నిరాకరించారు. దీంతో ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో శనివారం స్థానిక కమ్మపాలెం శ్మశానవాటికలో అంత్యక్రియలు చేయాలని నిర్ణయించారు. ప్రేమ పేరుతో సహజీవనం చేసి కనిపించకుండా పోయి యువతి ఆత్మహత్యకు కారకుడైన మత్తయ్యను వెంటనే అరెస్టు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

నీటి సంఘాల కోలాహలం

(5వ పేజీ తరువాయి)

డబ్ల్యూయుఏలు, డీసీల ప్రాజెక్టు కమిటీల పరిధిలను క్లియర్ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డబ్ల్యూయూఏల ఎన్నికల నిర్వహణకు తహసీల్దార్ లేదా ఉన్నత స్థాయిలోని గెజిటెడ్ అధికారి, డీసీల ఎన్నికలకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి అధికారులను, మీడియం ఇరిగేషన్‌లోని మూడు ప్రాజెక్టుల కమిటీలకు ముగ్గురు ఆర్డీవోలను ఎన్నికల అధికారులుగా నియమించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అధికారులు, సిబ్బందికి డివిజన్‌ల వారీ శిక్షణ ఏర్పాటుచేయగా ఒంగోలు, కనిగిరి డివిజన్ల శిక్షణ రెండు రోజుల క్రితం పూర్తయ్యింది. మార్కాపురం డివిజన్ స్థాయి శిక్షణ శుక్రవారం నిర్వహించారు. ఆయా ప్రాదేశికాలు, ఓటర్ల జాబితాలను మండలస్థాయిలో తహసీల్దార్‌లు ఈనెల 13న ప్రకటించగా ప్రస్తుతం ఓటర్ల జాబితాలో సవరణలు ఉంటే అప్పీలు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈనెల 18న తుది జాబితాను ప్రకటించి 20న ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ ఇచ్చేలా యంత్రాంగం ఏర్పాట్లు చేశారు. అలా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతూ నోటిఫికేషన్‌కు గడువు సమీపిస్తుండటంతో గ్రామాలలో చర్చ ప్రారంభమైంది. ఆయా సంఘాల చైర్మన్ పదవుల కోసం గ్రామ, మండల స్థాయి టీడీపీ నేతలు పోటీపడుతున్నట్లు సమాచారం. ఈ కమిటీల ద్వారానే భవిష్యత్‌లో ఆయా నీటివనరుల అభివృద్ధి, నిర్వహణ ఉండనుండటంతో ఈ పోటీ కనిపిస్తోంది.

సదుపాయాలకు పెద్దపీట

(5వ పేజీ తరువాయి)

స్పందించిన ఆయన ఆ పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకొని సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. ఉద్యోగులు పలు రకాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా.. పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవి, జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ పాల్గొన్నారు.

పలు చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

- మోటార్ సైకిళ్లను చోరీ చేసే ఐదుగురు ముఠా అదుపులో
- రూ.12 లక్షల విలువైన 17 బైక్‌లు స్వాధీనం
- ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు.. గంజాయి విక్రయాలు చేసే మరో ముగ్గురు కూడా...
- వివరాలను వెల్లడించిన ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు చోరీలకు పాల్పడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద సుమారు రూ. 12లక్షల విలువైన సొత్తును, కేజీన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. శుక్రవారం ఒంగోలులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ వెల్లడించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ముఠా..

జిల్లాలోని పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రాగి తీగ దొంగిలించి విక్రయించడంతో పాటు గంజాయిని తెచ్చి విక్రయాలు చేస్తున్న ముగ్గురిని త్రిపురాంతకం పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 16 కిలోల రాగితీగ, కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తాళ్ళూరు మండలం సోమవరప్పాడుకు చెందిన పోలా జాన్సన్ అలియాస్ జానీ, దర్శికి చెందిన కుంచాల లింగేష్, నెల్లూరు జిల్లా లింగసముద్రంనకు చెందిన గురునాథంలాజర్‌లు కలిసి దర్శి, ముండ్లమూరు, కురిచేడు ప్రాంతాలలో రైతులకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లు పగులకొట్టి రాగి తీగ దొంగిలించారు. రాగి తీగను విక్రయించగా వచ్చిన నగదుతో సరదాలు చేస్తూ వినుకొండ రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసేవారు. కురిచేడు రైల్వేస్టేషన్‌కు వచ్చి అక్కడ విక్రయించే ప్రయత్నం చేస్తుండగా త్రిపురాంతకం సీఐ జి.అసన్ తన సిబ్బందితో పట్టుకున్నట్లు ఎస్పీ దామోదర్ తెలిపారు. శుక్రవారం ఉదయం 11.30గంటలకు ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నామని, వారిని విచారించగా ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి తీగ చోరీలకు పాల్పడినట్లు వారు తెలిపారని వెల్లడించారు.

17 మోటార్‌సైకిళ్లు స్వాధీనం

దర్శి పరిసర ప్రాంతాల్లో మోటార్‌సైకిళ్లను చోరీ చేసే ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ దామోదర్ తెలిపారు. వారి వద్ద రూ.12లక్షల విలువైన 17 మోటార్‌సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. శుక్రవారం దర్శి సీఐ వై.రామారావు, ఎస్ఐ మురళి తమ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా నలుగురు అనుమానితులు రెండు మోటార్‌సైకిళ్లపై వెళుతుండగా అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపడింది. దీంతో వారి వద్ద ఉన్న రెండు మోటార్ సైకిళ్లతో పాటు వారు చోరీ చేసిన మరో 15 వాహనాలను మెకానిక్ గోపి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. దర్శి మండలం గంగపాలెంనకు చెందిన అంకాల శ్రీను, కప్పల పవన్, కప్పల భవానీశంకర్, బండారు శ్రీహరి, దర్శి మండలం దేవవరంనకు చెందిన గంజ గోపిని శుక్రవారం మధ్యాహ్నం అరెస్టు చేసినట్లు చెప్పారు. దర్శి, కనిగిరి, పొదిలి ప్రాంతాలతో పాటుగా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో కూడా వీరు మోటార్‌సైకిళ్ల చోరీ చేశారని ఎస్పీ వివరించారు.



మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

పోలీసులకు రివార్డులు

మోటార్‌సైకిళ్ల చోరీ కేసులో 17 వాహనాలను రికవరీ చేసిన దర్శి సీఐ వై.రామారావు, ఎస్ఐ మురళి, ఏఎస్ఐ రాంబాబు, హెడ్‌కానిస్టేబుల్ శివశంకర్, కానిస్టేబుల్ మహేష్, గిరిలను ఎస్పీ దామోదర్ అభినందించారు. అదేవిధంగా త్రిపురాంతకం పోలీసులు ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలను పట్టుకున్నందుకు సీఐ అసన్‌తో పాటు సిబ్బందని అభినందించి రివార్డులు అందజేశారు. ఈ సమావేశంలో దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించాలి

అధికారులకు కలెక్టర్ అన్సారియా ఆదేశం

పర్చూరివారిపాలెంలో లేఅవుట్ పరిశీలన

సమస్యలను చెప్పిన లబ్ధిదారులు



హౌసింగ్ లబ్ధిదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

పొన్నలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పక్కా ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిపెట్టి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అన్సారియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె మండలంలోని పర్చూరివారిపాలెంలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌ను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో అక్కడే సమావేశం నిర్వహించారు. ఇళ్ల పూర్తి చేయకపోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇస్తున్న యూనిట్ వ్యయానికి తోడు డ్వాక్రా మహిళలకు రుణాలు ఇప్పించి ఇళ్ల పూర్తి చేయించాలని వెలుగు ఏపీఎంను ఆదేశించారు. నిర్మాణ సామగ్రిని తెచ్చే వాహనాలు లేఅవుట్‌లోకి వచ్చే వీలులేకుండా పోయిందని లబ్ధిదారులు తెలిపారు. దీంతో కలెక్టర్ పీఆర్ ఏఈ కోటేశ్వరరావును పిలిచి రోడ్డు నిర్మాణానికి అంచనాలు తయారు చేసి పంపాలని ఆదేశించారు. హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన ఇళ్ల నిర్మాణ గడువు వచ్చేనెలతో ముగుస్తున్నందున లబ్ధిదారులు త్వరగా పూర్తిచేసుకోవాలన్నారు. కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, హౌసింగ్ డీఈఈ సత్యనారాయణ, తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీవో సుజాత, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ రంగాన్ని జేబు సంస్థగా మార్చిన జగన్

బిల్లుపై చర్చలో ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సంస్థలను వైసీపీ ప్రభుత్వంలో జగన్‌రెడ్డి జేబు సంస్థగా మార్చుకొని ఆ నిధులను ఇతర అవసరాలకోసం వాడుకున్నారని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శుక్రవారం అసెంబ్లీలో విద్యుత్ బిల్లుపై ఆయన మాట్లాడారు. నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విద్యుత్ సవరణ బిల్లును ప్రవేశ పెట్టారని ఆయనకు ఎన్డీఏ ప్రభుత్వం పక్షాన అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగం తీవ్ర సంక్షోభానికి గురయ్యిందన్నారు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో దాదాపు 20 మిలియన్‌ల లోటు విద్యుత్ ఉందని, కరంటు కోతతో ప్రజలు సతమతం అవుతున్న తరుణంలో చంద్రబాబు సమర్థవంతంగా 2014-19 మధ్య నాణ్యమైన నిరంతర విద్యుత్‌ను అందించారని గుర్తు చేశారు. అలాగే కరంటు చార్జీలను భవిష్యత్‌లో పెంచబోమని ఇచ్చిన మాటను నిలబెట్టామన్నారు. రాష్ట్రంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పరంగా విద్యుత్ రంగంలో సమూలమైన మార్పునకు తెలుగుదేశం ప్రభుత్వం నాంది పలికిందని వివరించారు. 2019-24 మధ్యకాలంలో జగన్మోహన్ రెడ్డి హయాంలో విద్యుత్ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. అనాలోచిత నిర్ణయాలు, అవినీతి ఆలోచనలతో తక్కువ ధరకు కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలను, పీపీఎలు రద్దు చేయడం వల్ల వేల కోట్ల రూపాయలు ఆర్థిక భారం విద్యుత్ వినియోగదారులపై వైసీపీ ప్రభుత్వం మోపిందని ఏలూరి దుయ్యబట్టారు. 8 సార్లు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారన్నారు. పీపీఏలను రద్దు చేయటం వల్ల విద్యుత్ రంగంలో పెట్టుబడిదారులు భారత దేశం నుంచి పారిపోయే స్థితికి జగన్మోహన్‌రెడ్డి సర్కార్ తీసుకు వచ్చిందని ఆరోపించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని 2037 నాటికి పూర్తిగా గ్రీన్ పవర్‌కి షిఫ్ట్ కావాలని ఆయన ఆకాంక్షించారు.



అసెంబ్లీలో విద్యుత్ బిల్లుపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

ఒడా చైర్మన్ టీడీపీకే

తేల్చిచెప్పిన లోకేష్

పరిశీలనలో పాపారావు, లక్ష్మి, ఎరిక్షన్ పేర్లు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒడా) చైర్మన్ పదవి టీడీపీకే దక్కనుంది. ఆ మేరకు రాష్ట్ర మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ తేల్చిచెప్పారు. తదనుగుణంగా జిల్లాలో టీడీపీకి చెందిన దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే రెండు విడతలుగా నామినేటెడ్ పదవులను టీడీపీ కూటమి ప్రభుత్వం భర్తీచేసింది. రెండో విడతగా భర్తీ చేసిన పదవుల్లో అనేక అర్బన్ డెవలప్‌మెంట్ పదవులను విడుదల చేశారు. అయితే ఒడా చైర్మన్ పదవిని భర్తీ చేయకపోవడానికి కారణం లేకపోలేదు. జిల్లాలోని టీడీపీ నేతలు ఇటీవల సమావేశం అయినప్పుడు ఆ పదవిని జనసేనకు కేటాయించాలని ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్ ప్రతిపాదించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో జనసేనకు కేటాయించిన పదవులపై ఒక అంగీకారానికి వచ్చినందున జిల్లాలో కీలకమైన ఒడా చైర్మన్ పదవిని టీడీపీకే ఉంచుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఆ మేరకు జిల్లా నేతలు విషయం ప్రస్తావించగానే లోకేష్ స్పందిస్తూ ఆ పదవిని టీడీపీ వారికే ఇవ్వాలని, మీరు తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని సూటిగా చెప్పినట్లు సమాచారం. నేడో, రేపో ఆ పదవికి చైర్మన్‌ను ఎంపిక చేసే ఉద్దేశంతో కొన్ని పేర్లు పరిశీలిస్తున్నారు. దర్శి మాజీ ఎమ్మెల్యే పాపారావుతోపాటు గత ఎన్నికల్లో ఓడి ఇన్‌చార్జులుగా ఉన్న గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్ బాబు పేర్లను పరిశీలిస్తున్నారు. ప్రధానంగా నారపుశెట్టి పాపారావుకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

వైసీపీ అధికారంలో ఉండగా దర్శి నగర పంచాయతీ గెలుపులో స్థానికంగా నారపుశెట్టి కుటుంబీకులకు ఉన్న ఆదరణ కలిసి రావడం, తొలి నుంచి పాపారావు పార్టీలోనే కొనసాగుతుండటాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిసింది.

వైభవంగా సామూహిక సాగరహారతి

- ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ మహేంద్రనాథ్

చీరాల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వాడరేవు సముద్రతీరంలో ఉన్న అంజనేయస్వామి విగ్రహం ఎదురుగా సముద్ర తీరంలో కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి సామూహిక సాగరహారతి కార్యక్రమం వైభవంగా జరిగింది. కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్ర నాధ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సామూహిక సాగరహారతి కార్యక్రమం వాడరేవులో తొలిసారిగా జరగటంతో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా పండితులు కారంచేటి నగేష్‌కుమార్, వెంకటేష్‌లు తీరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివుని స్పటిక లింగాన్ని పంచామృతాలతో అభిషేకించారు. మంత్ర పుష్పం జపించారు. అనంతరం సామూహిక సాగరహారతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు.



అద్దంకి పట్టణంలోని పాతశివాలయం వద్ద జ్వాలాతోరణం

కనుల పండువగా జ్వాలా తోరణం

అద్దంకి : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని అద్దంకి పట్టణంలోని పాతశివాలయంలో శుక్రవారం రాత్రి జ్వాలా తోరణం కనుల పండువగా నిర్వహించారు. దేవాలయంవద్ద జ్వాలాతోరణం ఏర్పాటు చేసి ఉత్సవ విగ్రహాలతో భక్తులు జ్వాలాతోరణం నుంచి తిరిగారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జ్వాలాతోరణాన్ని తిలకించారు.

లారీ ఢీ.. వృద్ధుడి దుర్మరణం

మార్టూరు, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): హైవే దాటుతున్న దార్ల పెద్ద వెంకటేశ్వర్లు (73) అనే వృద్ధుడ్ని గుంటూరు వైపు వెళుతున్న టమోటా లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా ఫ్లైవోవరుపైజరిగింది. మృతుడిది కిషోర్ నగర్‌గా గుర్తించారు. మృతుడి కుమారుడు చిన్న వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ బాషా తెలిపారు.

పోసానిపై ఫిర్యాదు

అద్దంకి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్, టీవీ5 న్యూస్ చానల్ అధినేత బీఆర్ నాయుడుపై అసభ్యకర పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేసిన పోసాని కృష్ణమురళీపై చర్యలు తీసుకోవాలని టీడీపీ, జనసేన నేతలు శుక్రవారం అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టీడీపీ, జనసేన నేతలు నాగినేని రామకృష్ణ, కాకాని అశోక్, మన్నం త్రిమూర్తులు,పెంట్యాల రామాంజనేయులు, దామా హనుమంతరావు, వలి, రాజశేఖర్, సాయి తదితరులు శుక్రవారం సీఐ కృష్ణయ్యను కలిసి ఫిర్యాదు చేశారు.



సీఐ కృష్ణయ్యకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ, జనసేన నేతలు

అవీఇవీ

సంతనూతలపాడులో అంతర్ జిల్లాల సీనియర్ కబడ్డీ పోటీలు

- వచ్చే నెల 5నుంచి 8వరకు నిర్వహణ
- హాజరుకానున్న స్త్రీ, పురుషుల జట్లు
- పోస్టర్లను ఆవిష్కరించిన ఎస్పీ దామోదర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ దామోదర్, అసోసియేషన్ నాయకులు

ఒంగోలు(రూరల్), నవంబరు15(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని సూదనగుంట కోటయ్యచౌదరి జడ్పీ హైస్కూలులో డిసెంబర్ 5 నుంచి 8వ తేదీ వరకు అంతర్ జిల్లాల సీనియర్ స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియోషన్ జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఎస్పీ దామోదర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ ఈ పోటీలు సూదనగుంట ఫౌండేషన్ ఆధ్వర్యంలో సూదనగుంట కోటయ్యచౌదరి, ఆదిలక్ష్మి మెమోరియల్ 71వ అంతర్ జిల్లాల స్త్రీ, పురుష కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 9గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురు జరుగుతాయని, రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల నుంచి 13 స్త్రీ, 13 పురుష జట్లు పాల్గొంటాయన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతిభ చాటిని క్రీడాకారులను రాష్ట్రస్థాయికి, ప్రీమియం లీగ్‌పోటీలకు ఎంపిక చేస్తారని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో అసోసియోషన్ జిల్లా చైర్మన్ ఎస్.చంద్రమోహనరెడ్డి, ట్రెజరర్ డి.రమేష్ బాబు, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు అన్నం వేణుగోపాల్, స్పాన్సర్ సూదనగుంట కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీపీసీఎల్ పెట్రోల్ పైపులతో రైతులకు నష్టం

- ఎమ్మెల్యే బీఎన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పేర్నమిట్ట చెరువులో ఏర్పాటు చేస్తున్న బీపీసీఎల్ పెట్రోల్ పైపులతో రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదమని ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ గోపాలక్రిష్ణను కలిసిన ఎమ్మెల్యే బీఎన్ వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు. పేర్నమిట్ట చెరువుపై ఆధారపడి 194 ఎకరాల సాగు ఉందన్నారు. రాబోయే రోజుల్లో సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. పెట్రోల్ పైపులు పేర్నమిట్ట చెరువు మీదుగా ఇతర ప్రాంతాలకు వేస్తున్నారని, దీనివలల్ల రానున్న రోజుల్లో రైతులతో పాటుగా ప్రజలకు తీవ్ర సమస్యగా పరిణమించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువులో నుంచి కాకుండా ఇతర ప్రాంతాల మీదుగా పైపులైన్ వేయాలని తెలిపారు. కార్యక్రమంలో పేర్నమిట్ట చెరువు పరిరక్షణ సమితి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- పీఆర్ కమిషనర్ కృష్ణతేజ
- నూతనంగా నిర్మించిన సీసీరోడ్ల పరిశీలన



సీసీరోడ్డును పరిశీలిస్తున్న పీఆర్ కమిషనర్ కృష్ణతేజ

సింగరాయకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను పీఆర్ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. తొలుత ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెపండుగ కింద గ్రామాలకు మంజూరైన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఎంపీడీవో ప్రాంగణంలో నిరుపయోగంగా ఉన్న చెత్త సేకరణ ఆటోలను పరిశీలించి వాటి దుస్థితిపై డీపీవోతో మాట్లాడారు. మండల కాంప్లెక్స్‌లో ఉన్న ఇంకుడుగుంతను చూశారు. అనంతరం సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని టీపీనగర్, పాకల పల్లెపాలెంలో నూతనంగా నిర్మించిన సీసీరోడ్లను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో డి.జయమణి, పీఆర్ ఏఈ శ్రీహరి, పాకల సర్పంచ్ సైకం చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు నర్రా రాంబాబు, శీలం చంటి ఉన్నారు.

తిరుమల ఆలయానికి 15 ఈవీ బైక్‌లు

- బహూకరించిన పెరల్ గ్రానైట్స్ అధినేత



టీటీడీ అడిషనల్ ఈవోకి తాళాలు అందిస్తున్న నాగరాజ

చీమకుర్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారి ఆలయానికి చీమకుర్తికి చెందిన పెరల్ మినరల్స్ అండ్ మైనింగ్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ తరఫున 15 ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలను విరాళంగా అందజేశారు. సంస్థ అధినేత చలువాది నాగరాజ ఈ-బైక్‌ల తాళాలను ఆలయ ప్రాంగణం ముందు పూజలు నిర్వహించిన తదుపరి అడిషనల్ ఈవో వెంకయ్యచౌదరికి అందించారు. దాదాపు రూ.22లక్షల విలువచేసే బైక్‌లను అందించినందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో లోకనాథం, వీజీవో సురేంద్ర, డీఐ సుబ్రహ్మణ్యం, నాగరాజ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

డిసెంబరు 10న సీపీఎస్ ఉద్యోగుల చలో విజయవాడ

అమరావతి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్, జీపీఎస్ విధానాలకు వ్యతిరేకంగా మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా డిసెంబరు 10న చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టినట్టు ఏపీ సీపీఎస్‌ఈఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సతీష్, దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా విజయవాడ ధర్నా చౌక్‌లో సభ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేస్తామని మంత్రి లోకేష్ ప్రకకటించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్టు వారు పేర్కొన్నారు.

ఓం.. మహాప్రాణ దీపం..





వాడరేవు తీరంలో సాగర హారతి ఇస్తున్న అర్చకుడు

సముద్రంలో దీపాన్ని వదులుతూ..

కొత్తపట్నం తీరంలో సైకత శివలింగం రూపొందించి ప్రమిదలు వెలిగిస్తున్న భక్తురాలు



సంతనూతలపాడులోని త్రిపురాంతకస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



జమ్ములపాలెంలో పంచముఖేశ్వరుడికి పూజలు చేస్తున్న అర్చకుడు



ఒంగోలులోని సంతపేట సాయిబాబా గుడిలో కాశీవిశ్వేశ్వరస్వామి పల్లకి మోస్తున్న ఎమ్మెల్యే దామచర్ల



కొత్తపట్నం తీరంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచి జిల్లాలోని ఆలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. కార్తీక దీపాల వెలుగుతో శైవక్షేత్రాలు, శివాలయాలు దేదీప్యమానంగా వెలిగిపోయాయి. హారతులు, అర్చనలు, అభిషేకాలు, జ్వాలా తోరణాలతో దేవస్థానాలు కిటకిటలాడాయి. సూర్యోదయానికి ముందే తండోపతండాలుగా వచ్చిన భక్తులతో కడలి తీరం భక్త సంద్రంగా మారింది. మహిళలు, యువతుల సముద్ర స్నానాలతో కడలికి భక్త తోరణం కట్టినట్టుగా ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఈతముక్కల, కొత్తపట్నం, మడనూరు, పాకల ప్రాంతాల్లో తీరం భక్తులతో కిక్కిరిసిపోయింది.

- కొత్తపట్నం, (ఆంధ్రజ్యోతి)



మార్కాపురం మార్కండేశ్వర స్వామి ఆలయంలో భక్తుల క్యూ



త్రిపురాంతకేశ్వరాలయం వద్ద జ్వాలా తోరణాలు వెలిగిస్తున్న భక్తులు



దర్శిలో మహిళల పూజలు



కొత్తపట్నం సముద్ర తీరంలో భక్తుల కోలాహలం



పీడీఎస్‌యూ మార్కాపురం డివిజన్ నూతన కార్యవర్గం

విద్య కార్పొరేటీకరణ విధానాలను ప్రతిఘటించాలి

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యారంగ కాషాయీకరణ, కార్పొరేటీకరణ విధానాలను ప్రతిఘటించాలని పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు యు.గని రాజు పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ డివిజన్ జనరల్ కౌన్సిల్ సమావేశం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గనిరాజు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉన్న 950 యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న వేలాది ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయకుండా యూనివర్సిటీ విద్యను సంక్షోభంలోకి నెట్టిందన్నారు. శాస్త్రీయ విద్యాసాధన, సమసమాజ స్థాపన కోసం విద్యార్థులు పోరాడాలన్నారు. పర్యావరణవేత్త ఎం.సంజీవరాజు మాట్లాడుతూ.. విద్యార్థులు జాతీయతా భావాలను పెంపొందించుకుని సమాజం కోసం పాటుపడాలన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మందా రాజు మాట్లాడుతూ.. మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం పీడీఎస్‌యూ డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా పి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు జెడ్.విజయ్, కార్యదర్శిగా బి.జయపాల్, సహాయకార్యదర్శిగా ఎం.చిట్టిబాబు, కోశాధికారిగా డి.దుర్గాప్రసాద్, మరో 13 మంది కార్యవర్గసభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు షాహిద్, నాగరాజు, రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

అంతర్జాతీయంగా పొగాకు మార్కెట్‌లో ఒడిదొడుకులు

వేలం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్



పొదిలి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం అంతర్జాతీయంగా పొగాకు మార్కెట్‌లో ఒడిదొడుకులు ఉన్నాయని, అందుకు ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి పెట్టాలని పొదిలి వేలం నిర్వహనాధికారి గిరిరాజ్‌కుమార్ ఆంధ్రజ్యోతితో అన్నారు. గత మూడు, నాలుగేళ్లుగా పొగాకు ధరలు రైతులను ఆకాశమేహద్దుగా నిలిపాయన్నారు. దీంతో రైతుల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది. సాగుచేస్తే ఏమౌతుందిలే అనే ఆలోచనలోకి రైతులు వెళ్లిపోయారు. ఇదంతా దృష్టిలో పెట్టుకొని రైతులు ఊహించని విధంగా ధరలు పొలం, బ్యారన్‌లు కౌలు పెంచి పొగాకు సాగు చేస్తున్నారన్నారు. అంతర్జాతీయంగా పొగాకు ధరల్లో నిలకడ ఉండదని ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని, వాటిలో లాభసాటిగా ఉంటాయని చెబుతున్నారు. అయితే పొగాకుకు ప్రత్యామ్నాయంగా ధనియాలు, కొర్రలు తదితర పంటలు లాభసాటిగా ఉంటాయన్నారు. మార్కెట్‌లో ధనియాలకు మంచి ధరలు ఉండటం వల్ల పొగాకు ప్రత్యామ్నాయంగా సాగు చేసుకోవచ్చన్నారు. కొర్రపంట రెండునెలల్లో దిగుబడి వచ్చే రకాలు ఉన్నాయని, వాటిని ఎంచుకోవడం వల్ల ఖర్చులు తగ్గుండతోపాటు మంచి దిగుబడులు, ధరలు లభిస్తాయన్నారు. కొర్రను రబీపంటగా జనవరి వరకు కూడా సాగు చేసుకోవచ్చని, మొక్కజొన్న హైబ్రీడ్ రకాన్ని ఎంచుకొని సాగుచేస్తే పంట 100 రోజుల్లో చేతికి వస్తుందని చెప్పారు.



రోడ్డుపై నీరు.. మారని అధికారుల తీరు!



చెరువు కట్ట తెగి రోడ్డుపైకొస్తున్న నీరు

అధికారుల అలసత్వంతో కొద్దిపాటి వర్షానికే నాగులుప్పలపాడు మండలం చదలవాడ గ్రామంలోని రామన్న చెరువులోకి చేరిన వర్షపు నీరు పక్కనున్న 216 జాతీయ రహదారిపైకి ప్రవహిస్తోంది. గత నెలలో కూడా రామన్న చెరువు కట్ట తెగి వరద నీరు జాతీయ రహదారిపై వారం రోజులు ప్రవహించింది. కలెక్టర్, ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులు పరిశీలించి చెరువు కట్టకు శాశ్వత పరిష్కారం చేస్తామని చెప్పాక కూడా సమస్య తీరలేదు. చెరువు కట్టలు పటిష్టం చేయకపోవడంతో ప్రతి ఏడాది వర్షాకాలంలో అనేకమార్లు కట్ట తెగి రహదారిపై పెద్దఎత్తున వరద నీరు చేరి రోజుల తరబడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

- నాగులుప్పలపాడు, (ఆంధ్రజ్యోతి)



స్వయంబు నిశ్చయంబుర...



ఇటీవల కురిసిన వర్షాలకు నగరంలోని పలు రహదారులు జలమయమయ్యాయి. శివారు కాలనీల్లోని రహదారులు మరింత అస్తవ్యస్తంగా మారాయి. కొప్పోలు రోడ్‌లోని ఓ ప్రైవేటు స్కూలు ఉండే రోడ్డుమార్గంలో బురదమయంగా మారడంతో విద్యార్థులు స్కూలుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు తమ సమస్యను తామే స్వయంగా పరిష్కరించుకున్నారు. తాత్కాలికంగా ఇటుకరాళ్లు, మట్టి పోసి నడక మార్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. సమస్య పరిష్కారం కోసం అధికారులపై ఆధారపడకుండా తామే స్వయంగా పరిష్కరించుకోవడం పట్ల పలువురు అభినందించారు.

- ఒంగోలు కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)


కొండపిలోని శ్రీరామలింగేశ్వర ఆలయంలో విద్యుత్‌శాఖ ఎస్‌ఈ కుటుంబసభ్యులకు స్వాగతం


పాకలలోని రామలింగేశ్వరస్వామి


జమ్ములపాలెంలో కార్తీక దీపారాధనలో మహిళా భక్తులు


హరిహరక్షేత్రం జ్వాలాతోరణం వెలిగిస్తున్న శిద్దా కుటుంబసభ్యులు

ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

- నయన మనోహరంగా జ్వాలా తోరణం
- ఆలయాల్లో భక్తుల పూజలు


ఉప్పుగుండూరు శివాలయంలో..


ఒంగోలులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో..




రామతీర్థం మోక్షరామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తుల క్యూ, పూజలందుకుంటున్న మూలవిరాట్

ఒంగోలు(కల్చరల్), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీకపౌర్ణమి వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఒంగోలు నగరంలో కేశవస్వామిపేట శ్రీగంగా పార్వతీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, అంజయ్యరోడ్డులోని శ్రీపంచముఖ శివాలయం, రంగారాయుడు చెరువు దగ్గర ఉన్న శ్రీఅరుణాచలేశ్వర స్వామి దేవస్థానం, సంతపేట సాయిబాబా మందిరం శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం, లాయర్‌పేట సాయిబాబా మందిరం శ్రీమరకత రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, మంగమూరురోడ్డు శ్రీఅచలానంద ఆశ్రమం, సుందరనగర్ శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానం, కేశవస్వామిపేట శ్రీవిజయదుర్గా దేవస్థానం మొదలైన పలు ఆలయాలలో ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించగా పెద్దసంఖ్యలో మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. ఇక కార్తీక పౌర్ణమి సందర్భంగా రాత్రి పలు శివాలయాలలో ఏర్పాటుచేసిన జ్వాలాతోరణ మహోత్సవం భక్తుల నయన మనోహరంగా సాగింది. స్థానిక కేశవస్వామిపేట శ్రీగంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. అర్చకులు శంకరమంచి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో తోరణంగా దీపాలను వెలిగించారు. భక్తులు హరహర శంభో శంకర మహాదేవ అంటూ జ్వాలాతోరణాన్ని దాటుతూ పరవశులైనారు. ఈవో రావెళ్ల శివశంకర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. తూర్పుపాలెం శ్రీగంగాపార్వతీ సమేత రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో అర్చకులు మణికంఠ శర్మ యాజ్ఞికంలో జ్వాలాతోరణ మహోత్సవం జరిగింది. ఈవో బోడపాటి శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే దామచర్ల పూజలు

కార్తీక పౌర్ణమి సందర్భంగా స్థానిక సంతపేట సాయిబాబా మందిరంలోని శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సతీమణి నాగ సత్యలతతో కలిసి శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీగంగా పార్వతీ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి వాహనసేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మందిర కమిటీ నిర్వాహకులు అళహరి చెంచలరావు దామచర్ల దంపతులకు ఘనస్వాగతం పలుకగా ప్రముఖ వేద పండితులు మఠంపల్లి దక్షిణామూర్తి శాస్త్రి వేద ఆశీర్వచనాన్ని ఇచ్చి స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

రామతీర్థానికి పోటెత్తిన భక్తులు

చీమకుర్తి: కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని రామతీర్థం మోక్షరామలింగేశ్వరాలయానికి జిల్లా నలువైపులనుంచి భక్తులు పోటెత్తారు. ఆలయంలో వేకువజామునుంచే అభిషేకాలు, విశేషపూజలు నిర్వహించారు. మహిళలు పవిత్ర కోనేరులో పుణ్యస్నానమాచరించి ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు. యోగి వేమనరెడ్ల సేవాసమితి ఆధ్వర్యంలో వనభోజనాలను రెడ్ల సత్రంలో జరిపారు. శ్రీకృష్ణదేవరాయ కాపు సత్రంతో పాటు పలు కుల సత్రాలలో భక్తులకు అన్నదానం చేశారు. ఇక చీమకుర్తిలోని సాక్షిరామలింగేశ్వరాలయం, వీరభద్రేశ్వరాయలంతో పాటు గ్రామాల్లోని శివాలయాల్లో కార్తీకపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే హరిహరక్షేత్రంలో కార్తీకపౌర్ణమిని వైభవంగా జరిపారు. జ్వాలాతోరణం కార్యక్రమంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, సతీమణి, లక్ష్మీపద్మావతి, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు మండలంలో..

నాగులుప్పలపాడు: కార్తిక పౌర్ణమి వేడుకలను మండలంలోని ఉప్పుగుండూరులోని శివాలయం, నాగులుప్పలపాడు రామలింగేశ్వర ఆలయం, కనపర్తిలోని ఏలేశ్వర స్వామి, అమ్మనబ్రోలు చెన్నమల్లేశ్వర స్వామి, చదలవాడలోని లింగోద్భవస్వామి ఆలయాలతో పాటు గ్రామాలలోని శైవ క్షేత్రాలకు భక్తులు చేరుకొని జ్యోతులను వెలిగించారు. ప్రత్యేక పూజలను నిర్వహించారు. సముద్ర స్నానాలను ఆచరించారు. కనపర్తి తీరంతో పాటు శైవక్షేత్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: స్థానిక త్రిపురాంతకస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున 365 వత్తులతో కార్తీక దీపోత్సవం నిర్వహించారు.

జమ్మలపాలెంలో..

టంగుటూరు: కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని జమ్మలపాలెంలోని 1,116 శివలింగాల వేదికకు శుక్రవారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. శివలింగాలను స్పృశించి భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. శ్రీపంచముఖేశ్వరునికి అభిషేకాలు చేశారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. దీంతో వేదిక ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

పాకల తీరంలో..

సింగరాయకొండ: పాకల సముద్రతీరానికి భక్తులు పోటెత్తారు. జోరు వానను సైతం లెక్కచేయకుండా తరలివచ్చి సముద్రస్నానాలు ఆచరించారు. కార్తీక దీపాలను వెలిగించి పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని అతిపురాతనమైన రామలింగేశ్వరస్వామి ఆలయంలోని స్వామివారిని దర్శించుకున్నారు. పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని అయ్యప్పస్వామి దేవస్థానం, పలు శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: మండలంలోని శివాలయాలు కార్తీకశోభను సంతరించుకున్నాయి. మద్దిపాడు, కెల్లంపల్లి, రామాయపాలెం, తంగెళ్ల, చిమట, కూచిపూడిల్లోని శివాలయాలు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పృథులగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. కడవ శ్రీనివాసులు భక్త బృందంతో లక్ష్మీనరసింహస్వామి నామ సంకీర్తన ఏకాహం జరిగింది. ఈసందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కొండపిలో..


కొండపి: కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం వేకువజాము నుంచే భక్తులు శివాలయాలకు పెద్దఎత్తున తరలివచ్చి పూజలు చేశారు. కొండపి, కె.ఉప్పలపాడు, ముప్పవరం, అనకర్లపూడి, పెదకండ్లగుంట శివాలయాల్లో అభిషేకాలు చేశారు. కొండపిలోని శ్రీరామలింగేశ్వర ఆలయంలో జ్వాలాతోరణం వెలిగించారు. రాత్రికి ఉత్సవమూర్తులను ఊరేగించారు. కొండపిలోని శ్రీరామలింగేశ్వర ఆలయంలో విద్యుత్‌శాఖ ఎస్‌ఈ కట్టా వెంకటేశ్వర్లు తన కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి


మంత్రి లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్వాములు, పద్మకుమారి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్కూలు ఎడ్యుకేషన్ మినిస్టీరియల్ ఉద్యోగులు, సిబ్బందికి ఉద్యోగోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు. స్కూలు ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ అమరావతి రాష్ట్ర అధ్యక్షురాలు బి.పద్మకుమారి, గౌరవాధ్యక్షుడు అడకా స్వాములు, ప్రధానకార్యదర్శి కె.శ్రీనివాస్ శుక్రవారం సెక్రటరియేట్‌లో విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మినిస్టీరియల్ ఉద్యోగులకు అసిస్టెంట్ డైరెక్టర్ ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. ఆయా అంశాలపై మంత్రి మాట్లాడుతూ సమస్యలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రటరిని కలిసి వినతిపత్రం అందజేశారు.

సీఎంను కలిసి మాగుంట


సీఎం చంద్రబాబుకు బొకే ఇస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం ఢిల్లీలో సీఎం చంద్రబాబును కలిసి మాగుంట బొకే అందజేశారు. ఈ సందర్భంగా పలు అంశాలను చంద్రబాబు దృష్టికి ఆయన తీసుకెళ్లారు.

8 మద్యం బాటిళ్లు పట్టివేత

సింగరాయకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బింగినపల్లి ఎస్సీకాలనీలో మద్యం అక్రమంగా అమ్ముతున్న పేరాబత్తిన శ్యాంప్రసాద్‌ను శుక్రవారం ఎక్సైజ్ సీఐ మేడికొండ శివకుమారి అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద ఎనిమిది క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎక్సైజ్ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేశారు.

మోటార్‌సైక్లిస్ట్‌కు గాయాలు

నాగులుప్పలపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డుకు అడ్డుగా వచ్చిన కుక్కను ఢీకొని మోటార్‌సైక్లిస్టుకు గాయాలైన సంఘటన మద్దిరాలపాడు వద్ద జాతీయ రహదారిపై జరిగింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు, ఒంగోలు నగరం అన్నవరప్పాడు మూడో లైన్‌లో నివసిస్తున్న ఎ.శ్రీనివాసరావు శుక్రవారం మధ్యాహ్నం తన మోటార్‌సైకిల్‌పై చీరాలలో ఓ శుభకార్యంలో పాల్గొనేందుకు వెళుతున్న క్రమంలో మద్దిరాలపాడు వద్దకు కుక్కను ఢీకొనడంతో కిందపడ్డారు. దీంతో ఆయనకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108వాహనంలో ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

రేపు కాపు వనభోజన మహోత్సవం


ఏర్పాట్లపై చర్చిస్తున్న కాపు సంఘం నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 15 : కాపు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17 వ తేదీన స్థానిక దక్షిణబైపాస్ వద్ద ఉన్న డీ6 ఫంక్షన్ హాలులో కాపు కార్తీక మాస వనభోజన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవ్‌కుమార్ తెలిపారు. స్థానిక రామనగర్‌లోని సంఘ కార్యాలయంలో శుక్రవారం కార్తీక వనభోజన మహోత్సవ ఆహ్వాన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రమైన ఒంగోలుతో పాటు సమీప గ్రామాల్లోని కాపులందరూ ఈ వనమహోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు తంజావూరు శ్రీనివాసమూర్తి, ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు, కొల్లా నారాయణ, పెరూరి ఫణీంద్రకుమార్, బి.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, పోలిశెట్టి గంగాధర్, ముత్యాల నాగేశ్వరరావు, ఎం.నారాయణ పాల్గొన్నారు.

క్విస్‌లో 350మందికి వైద్యసేవలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ఒంగోలు విద్య, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం స్మార్ట్ విజన్ ఐ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని క్విస్ విద్యా సంస్థల అధినేత సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టర్ ఎస్.శ్రీగాయత్రి, ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు ప్రారంభించారు. కంటి వైద్యురాలు బి.నాగమాధురి కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు సుమారు 350 మంది కంటి వైద్యసేవలను అందించారు.

సూపర్‌బజారు అభివృద్ధికి కృషి చేయాలి

- జిల్లా సహకారశాఖ అధికారి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ది ఒంగోలు కో ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ లిమిటెడ్(సూపర్‌బజారు) అభివృద్ధికి ఉద్యోగులు కృషి చేయాలని జిల్లా సహకారశాఖ అధికారి బి.శ్రీనివాసరెడ్డి సూచించారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదురు ఉన్న సూపర్‌బజారు వద్ద జెండాను ఆవిష్కరించారు. అనంతరం సహకార రంగంలో నూతన ఆవిష్కరణలు, సాంకేతిక, సుపరిపాలన అనే అంశాలపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సహకార సంఘాలకు ఎంతో విశిష్టత ఉందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎండీ బీసీ.మాలకొండయ్య, పర్సన్‌ఇన్‌చార్జి రాజశేఖర్ పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి మృతి

ఒంగోలు(క్రైం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఒంగోలు-సూరారెడ్డిపాలెం మధ్యలో శుక్రవారం జరిగింది. సుమారు 35 ఏళ్ళ వయస్సు గల యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు ఎరుపు రంగు కట్ బనియన్, బ్లూకలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఎడమ చేతి పైన సురేఖ అని పచ్చబొట్టు ఉంది. ఎడమ చెవికి పోగు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ అరుణకుమారి పరిశీలించి కేసు నమోదు చేశారు. వివరాలు తెలిసిన వారు 9440627647 సెల్ నంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

తూర్పునాడుపాలెం ఫ్లైఓవర్ వద్ద మరొకరు..

టంగుటూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆచూకీ తెలియని 50 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన తూర్పునాడుపాలెం ఫ్లైఓవర్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. మృతుడి ఫొటోలను ఎస్ఐ నాగమల్లేశ్వరరావు విడుదల చేశారు. వివరాలు తెలిసిన వారు తెలియజేయాలని ఆయన కోరారు.

అరుణశ్రీ మృతి బాధాకరం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్‌గా, అధ్యాపకురాలిగా, గాయినిగా ఎందరో విద్యార్థులకు ఆదర్శప్రాయురాలిగా పేరుతెచ్చుకున్న సామాజిక కార్యకర్త డాక్టర్ అరుణశ్రీ అకాల మృతి బాధాకరమని మహిళాభ్యుదయ సమితి అధ్యక్షురాలు తేళ్ళ అరుణ పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని సమితి కార్యాలయంలో ఇటీవల మృతి చెందిన డాక్టర్ అరుణశ్రీ, చిఫుకుల శ్రీలక్ష్మిల సంస్మరణ సభ జరిగింది. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అరుణశ్రీ తండ్రి డాక్టర్ చావలి శాంతికుమార్, సాహితీవేత్తలు నాగభైరవ ఆదినారాయణ, సింహాద్రి జ్యోతిర్మయి, బీరం అరుణ, డాక్టర్ నూను అంకమ్మరావు, తమ్మిశెట్టి రమాదేవి, మారేపల్లి సూర్యకుమారి, శనగపల్లి హరిశంకర్, కె.శాంతిలత, సీహెచ్.కనకదుర్గ, గుంటుపల్లి శ్రీదేవి, నాగేంద్రమ్మ, మలాన్‌భాను తదితరులు పాల్గొన్నారు.


అరుణశ్రీ, శ్రీలక్ష్మికి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

టీడీపీ సభ్యత్వం తీసుకునేలా చూడాలి

- ఎమ్మెల్యే బీఎన్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, నవంబరు 15: టీడీపీ సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రతి ఒక్కరికి వివరించి నమోదు సంఖ్యను పెంచాలని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కోరారు. శుక్రవారం ఒంగోలులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశం ఆయన మాట్లాడారు. టీడీపీ సభ్యత్వం అందరూ తీసుకునేలా నాయకులు పాటు పడాలని దిశానిర్దేం చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సమన్వయకర్త కందుకూరిబాబు, టీడీపీ రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, నియోజకవర్గ పరిశీలకులు చౌట శ్రీనివాసులు, మండల అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మండవ జయంత్‌బాబు, తేళ్ల మనోజ్‌కుమార్, గొట్టిపాటి రాఘవరావు, వివరం గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్.వేములపాడులో సభ్యత్వ నమోదు

ఎమ్.వేములపాడు గ్రామంలో ఎమ్మెల్యే బీఎన్ ఆదేశాల మేరకు గ్రామ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం వరకు 950 టీడీపీ సభ్యత్వాలు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బి.రంగనాయకులు, ఎం.రామారావు, వి.వెంకట్రావు, ఎం.వెంకటేశ్వర్లు, వెంకట్రావు, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ఎస్పీ అభినందన


సమీరాను అభినందిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో పోటీలలో బంగారం పతకం సాధిచిన క్రీడాకారిణి షేక్ సమీరాను ఎస్పీ ఏఆర్.దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు. శుక్రవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో జాతీయ స్థాయిలో బంగారం పతకం సాధించిన ఒంగోలుకు చెందిన సమీరాను ఎస్పీ ప్రశంసిచారు. గత ఏడాది తైక్వాండో బ్లాక్ బెల్ట్ పోటీలలో బంగారం పతకం సాధించిన సమీరా జిల్లా ప్రతిష్ఠను జాతీయ స్థాయిలో చాటి చెప్పారని ఎస్పీ తెలిపారు. క్రీడలతోపాటుగా చదువులో కూడా రాణించాలని ఆకాంక్షిచారు.

వ్యాసరచన పోటీల విజేతకు బహుమతి

పోలీసు వారోత్సవాల్లో భాగంగా నిర్వహిచిన వ్యాసరచన పోటీలలో ప్రథమ బహుమతి సాధించిన కేజీబీవీలో చదువుతున్న విద్యార్థిని బి.వెంకటమ్మకు ఎస్పీ దామోదర్ రూ.5వేల నగదును అందజేశారు కార్యక్రమంలో కేజీబీవీ స్టాఫ్ నర్స్ బి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

సంతనూతలపాడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు జడ్పీహైస్కూల్లో డిసెంబరు 5వ తేదీ నుంచి జరగనున్న సూదనగుంట కోటయ్యచౌదరి, ఆదిలక్ష్మి మెమోరియల్ అంతర్‌జిల్లాల స్త్రీ, పురుష కబడ్డీ పోటీల ప్రారంభోత్సవానికి బీఎన్.విజయ్‌కుమార్‌ను నిర్వాహకులు ఆహ్వానించారు. శుక్రవారం ఒంగోలులో ఎమ్మెల్యే బీఎన్ కలిసి ఈ మేరకు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, వైస్‌ప్రెసిడెంట్ రంగరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, సూదనగుంట క్రిష్ణమూర్తి, మందాడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి

సింగరాయకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపడి గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. ఈ ఘటన సింగరాయకొండ-ఉలవపాడు మధ్య ఉన్న చిల్లాకాలువ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కి తరలించారు. మృతురాలి వయసు 40-50 ఏళ్లు ఉండవచ్చని వారు భావిస్తున్నారు.

108 సిబ్బంది వినతి

కొండపి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 108 సిబ్బంది కోరారు. శుక్రవారం కొండపిలో ఎంపీడీవో రామాంజనేయులు, డీటీ రవికుమార్, సీహెచ్‌సీ డాక్టర్ వరలక్ష్మికి వినతిపత్రాలు సమర్పించారు.

డ్రైనేజీలపై నిర్మాణాలను వెంటనే తొలగించాలి

- గోడలు, డివైడర్లపై పోస్టర్లు నిషేధం
- కమిషనర్ వెంకటేశ్వరరావు ఆదేశం


సూచనలు ఇస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్యం మెరుగుకోసం డ్రైనేజీ కాలువలపై నిర్మించిన సిమెంట్ కాంక్రీట్‌లు, కట్టడాలు వెంటనే తొలగించాలని కమిషనర్ వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక అద్దంకిబస్టాండ్, గుంటూరురోడ్, కర్నూలు రోడ్‌లలో సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ బిర్యానీసెంటర్ వద్ద కార్పొరేషన్‌కు చెందిన ప్రధాన డ్రైనేజీ కాలువ పూర్తిగా మూసేసి కట్టడాలు నిర్మించడంపై ఆయన సీరియస్ అయ్యారు. అలాగే కాలువల్లో పూడికతీతకు ఇబ్బందిగా ఉన్న ప్రాంతాల్లో వెంటనే తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో కొన్ని డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులు చేయకుండా అలాగే వదిలేయడంతో కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడంపై కమిషనర్ సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, పలుచోట్ల కాలువల్లో పైపులైనులు ఉండటాన్ని గుర్తించిన కమిషనర్ వాటిని మార్పు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. నగర సుందరీకరణకు అందరూ సహకరించాలని కోరారు. వ్యాపార సముదాయాల ముందు నిర్మించిన కాంక్రీట్ కట్టడాలు, ర్యాంపులు వెంటనే తొలగించాలని సంబంధిత వ్యాపారులకు ఆదేశించారు. అలాగే టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం కూడా స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి అనధికారకంగా నిర్మించిన వాటిని తొలగించాలని చెప్పారు. ఇకపై డివైడర్లు, గోడలపైనా పోస్టర్‌లు అంటిస్తే బాధ్యులకు జరిమానా విధిస్తామని, నగరంలో విగ్రహాలకు ఫ్లెక్సీలు కట్టకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంఈ చంద్రయ్య, డీఈ పద్మజ, టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ సూపర్‌వైజర్లు ప్రసాద్‌రావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను అభివృద్ధి చేయాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ


గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న కమిషనర్ కృష్ణతేజ

ఒంగోలు(రూరల్), నవంబరు15(ఆంధ్రజ్యోతి): చెత్త సంపద కేంద్రాలను అభివృద్ధి చేసుకుని గ్రామానికి ఆర్థిక వనరులు పెంచుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ వీఆర్.కృష్ణతేజ సూచించారు. ఒంగోలు మండలం యర్రజర్లలోని చెత్త సంపద కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రంలో వర్మీకంపోస్టు ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించి వచ్చిన నగదును పంచాయతీలకు జమ చేయాలన్నారు. కేంద్రం వద్ద పూలమొక్కలు, కూరగాయల మొక్కలను పెంచాలని చెప్పారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషబాబు, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు, జడ్పీ సీఈవో చిరంజీవి, ఈవోఆర్డీ ఎ.బాలచెన్నయ్య, ఏఈలు రామ్‌కుమార్, మల్లికార్జునరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కె.రామకృష్ణ, ఏపీవో వెంకట రావు, ఎంపీటీసీ జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

టంగుటూరులో పర్యటన

టంగుటూరు: పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ శుక్రవారం టంగుటూరులో పర్యటించారు. తొలుత కొండపి రోడ్డులో రైతు నల్లూరి వెంకటేశ్వర్లు ఉపాధి పథకం కింద నిర్మించుకున్న గోకులం షెడ్డును పరిశీలించారు. ఆయనతో మాట్లాడారు. గోకులం షెడ్డుకు ప్రభుత్వం ఇచ్చే నిధులు సరిపోతున్నాయా అని అడిగారు. గోకులం షెడ్ల పరిమితంగా కాకుండా ఎక్కువ మందికి మంజూరు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. వెంకటేశ్వర్లు విన్నపం మేరకు కమిషనర్ కొబ్బరికాయ కొట్టి గోకులం షెడ్డును ప్రారంభించారు.

రోడ్డు దుస్థితిపై సర్పంచ్ వినతి

కొండపి రోడ్డు దుస్థితిపై టంగుటూరు సర్పంచ్ మద్దిరాల మమత కమిషనర్‌కు అర్జీ సమర్పించారు. రోడ్డు ఏడేళ్లుగా అధ్వానంగా ఉందని, ప్రస్తుతం వాహనాలు నడిచేందుకు కూడా వీలులేకుండా పోయిందని ఆయన దృష్టికి తెచ్చారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు ఇదే రహదారిలో ఉన్నందున ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని చెప్పారు. రోడ్డు ప్రాధాన్యత, దుస్థితిని మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు కూడా కమిషనర్‌కు వివరించారు. మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని వారిద్దరూ కోరారు. కమిషనర్ వెంట ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జి.జోసఫ్‌కుమార్, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.వెంకటస్వామి, ఎంపీడీవో దేవసేనకుమారి, ఏపీవో సుభాషిణి, టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, తెలుగు రైతు నేత బెజవాడ వెంకటేశ్వర్లు ఉన్నారు.

వైసీపీ ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్తగా రవిబాబు


జగన్‌కు బొకే అందజేస్తున్న రవిబాబు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 15: వైసీపీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా చుండూరి రవిబాబు నియమితులయ్యారు. ఈమేరకు వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఇటీవల వైసీపీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో రాజ్యసభ సభ్యుడు, ఒంగోలు పార్లమెంట్ మాజీ సభ్యుడు వైవీ.సుబ్బారెడ్డికి ముఖ్యఅనుచరుడుగా ఉన్న రవిబాబును నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించడంతో ఆయన పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జిల్లా పరిశీలకులు నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీ వైవీ.సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్యంపై అవగాహన కల్పించాలి : పీడీ

ఒంగోలు నగరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల మహిళలు ఆరోగ్యకరమైన జీవనాన్ని గడిపేందుకు వారికి నీరు, పారిశుధ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ వసుంధర పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని వెలుగు టీటీడీసీ భవనంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, ఏపీఎంలు, ఏసీలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ చేతులను శుభ్రం చేసుకోవటం, పోషకాహారాన్నితీసుకోవటం, వ్యక్తిగత పరిశుభ్రత, వ్యాధుల వ్యాప్తి జరగకుండా తీసుకోవలసి జాగ్రత్తలు అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం శిక్షణ పొందుతున్న సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పొదుపు సంఘం నాయకులకు అవగాహన కల్పించాలన్నారు.

'బంగారుబాల్యం' విజయవంతం చేయాలి : ఆర్డీవో

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల పాటు జరగనున్న బంగారు బాల్యం కార్యక్రమాన్ని గ్రామాల్లో విజయవంతంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో లక్ష్మీప్రసన్న ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం రాత్రి డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా బంగారు బాల్యం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నందున మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమ నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అందువల్ల అన్ని గ్రామాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. కాగా అంతకు ముందు పలుశాఖల అధికారులతో ఆర్డీవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ కం ప్రొబేషన్ ఆఫీసర్ బి.రత్నప్రసాద్ బాలల చట్టాలపై అవగాహన కల్పించారు.

సూపర్‌స్టార్ కృష్ణకు నివాళి

ఒంగోలు(కల్చరల్), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు సూపర్‌స్టార్ కృష్ణ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం రాత్రి స్థానిక సీవీఎన్ రీడింగ్ రూములో నిర్వహించారు. సూపర్ స్టార్ కృష్ణ పరిషత్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. పరిషత్ అధ్యక్షులు జాలాది మోహన్, ధేనువకొండ సుబ్బయ్య, కుర్రా ప్రసాద్‌బాబు, షేక్ అబ్దుల్‌ఖాదర్, గంట సుబ్బారావు, ఐ.నరసింహం, చంద్రశేఖర్, పరుచూరి నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా పనిచేయాలి

టంగుటూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఉత్సాహంగా పనిచేయాలని ఎంపీడీవో దేవసేనకుమారి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన శిక్షణలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

- ప్రమాదవశాత్తు డ్రైవర్ మృతి
- కొద్ది నిమిషాల ముందే అక్కడ మరో ప్రమాదం
- రెండు కార్లు ఢీ, ప్రయాణికులకు గాయాలు


ప్రమాదంలో మృతిచెందిన లారీ డ్రైవర్

త్రిపురాంతకం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొనడంతో డ్రైవర్ మృతిచెందిన ఘటన మండలంలోని రాజు పాలెం వద్ద శుక్రవారం చోటు చేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ముందుగా జాతీయ రహదారి 544డీపై నరసరావు పేట నుంచి శ్రీశైలం వెళ్లే కారు, ముదిగుబ్బ నుండి గుంటూరు వెళ్లే కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. కార్లలోని ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 సహాయంతో వైద్యశాలకు తరలించారు. ఈ సమయంలో అక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ క్రమంలో అక్కడ ఓ లారీ ఆగి ఉంది. ఆ లారీని విజయవాడ నుండి గుత్తి వెళుతున్న మరో లారీ ఢీకొట్టింది. ఈ ప్రయాదంలో వెనుక లారీ నడుపుతున్న డ్రైవర్ తలారి శ్రీను(32) మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై శివబసవరాజు ప్రమాదస్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వై.పాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


ప్రమాదానికి గురైన కార్లు

అక్రమ మద్యం స్వాధీనం

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురిజేపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న టి.పిచ్చిరెడ్డి అనే వ్యక్తిపై ఎస్సై పి.చౌడయ్య శుక్రవారం కేసు నమోదు చేశారు. శుక్రవారం బెల్ట్‌షాపుపై దాడి చేసి 40 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. మద్యం గొలుసు దుకాణాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

15 మద్యం సీసాలు స్వాధీనం

పెద్దదోర్నాల : దోర్నాలలోని పలు వ్యాపార దుకాణాలు, హోటళ్లపై శుక్రవారం పోలీసులు విస్తృత దాడులు చేశారు. ఎస్సై మహేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో ఓ హోటల్లో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిర్వాహకుల వద్ద ఉన్న 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డిప్యూటీ డైరెక్టర్‌గా నిషాకుమారి బాధ్యతలు


నిషాకుమారికి బొకే అందజేస్తున్న సిబ్బంది

గిద్దలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : టైగర్ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్‌గా ఐఎఫ్ఎస్ అధికారిణి నిషాకుమారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నిషా కుమారిని సబ్‌డీఎఫ్‌వో శ్రీకాంత్‌రెడ్డి, సూపరింటెండెంట్ నరసయ్య, అటవీ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షులు రంగారెడ్డి, ఉపాధ్యక్షులు చాంద్‌బాషా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పొలం దారి విషయంలో ఘర్షణ

- కళ్లలో కారం కొట్టి కత్తితో దాడి

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పొలానికి వెళ్లే దారి విషయంలో ఒకరిపై మరొకరు కళ్లలో కారం కొట్టి కత్తితో దాడి చేశారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రగొండపాలెం మండలంలోని గడ్డమీదపల్లి గ్రామానికి చెందిన వన్నె బోయిన శ్రీనివాస్, సాగనబోయిన సుబ్బారావు ఇద్దరు వరసకు అన్నదమ్ములు. గ్రామానికి సమీపంలో ఇద్దరికి పొలాలు ఉన్నాయి. ఈ పొలాలకు వెళ్లే రస్తా విషయంలో పదిహేనేళ్లగా తరచు గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ దారిలో సుబ్బారావు ఎక్స్‌కవేటర్‌తో గుంతలు తీస్తున్నాడు. ఈ నేపథ్యంలో శ్రీనివాస్ ప్రశ్నించారు. ఈ క్రమంలో సుబ్బారావు ఆయన కుటుంబ సభ్యులు ఒక్కసారిగా శ్రీనివాస్‌పై దాడికి దిగి కళ్లలో కారం కొట్టి కత్తితో దాడి చేశారని క్షతగాత్రుడు తెలిపారు. గాయాలతో పడిపోయిన శ్రీనివాస్‌ను ఎర్రగొండ పాలెం ప్రాంత్రీయ వైద్యశాలకు తరలించారు. అనంతరం చికిత్స అందిస్తున్నారు. ప్రాణపాయంలేదని తలకు, చేతికి కుట్లు పడ్డాయని వైద్యులు తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ చౌడయ్యను వివరణ కోరగా తమకు సమాచారం రావాల్సి ఉందన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పుల్లలచెరువు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న సైబరు నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పుల్లలచెరువు ఎస్ఐ సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తూరు, నాయుడు పాలెం గ్రామాల్లో సైబరు నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని, మీకు లాటరీ తగిలింది, మాకు ఓటీపీ చెప్పమని సైబరు నేరగాళ్లు బ్యాంకులోని డబ్బులు కాజేస్తున్నారన్నారు. ఓటీపీల కోసం ఏ బ్యాంకు వినియోగదారులకు ఫోన్ చేయదన్నారు. వాట్సప్‌లో వచ్చే లింకులపై నొక్క వద్దని సూచించారు. గ్రామాల్లో కొత్తవ్యక్తుల అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.


మార్కాపురంలో నాగశిలలకు పూజలు చేస్తున్న మహిళలు, దీపానికి మొక్కుతున్న మహిళ, జగదాంభిక అమ్మవారు, త్రిపురాంతకంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు, తర్లపాడులో నీలకంఠేశ్వరస్వామి

శైవక్షేత్రాల్లో పున్నమి కాంతులు

- ఉదయం నుంచే ఆలయాలకు భక్తుల బారులు
- కార్తీక దీపాలు వెలిగించిన మహిళలు
- పలుచోట్ల జ్వాలా తోరణాలు ఏర్పాటు
- గిద్దలూరులో సామూహిక మహారుద్రాభిషేకం

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారు జాము నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. మార్కండేశ్వరస్వామి, జగదాంబ మాతలకు అర్చకులు వేలూరి ఆంజనేయశర్మ, రెంటచింతల వరుణ్‌తేజ శర్మలు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి నోములు నోచారు. నాగదేవతలకు పాలుపోసి పూజలు చేశారు. రాత్రి జ్వాలాతోరణం నిర్వహించారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

● త్రిపురాంతకం : కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వర స్వామి, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవార్ల ఆలయాల్లో ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి త్రిపురాంతకేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ఉసిరిచెట్టు కింద, బెకసోమేస్వర స్వామి, అపరాదేశ్వరస్వామి, రస సిద్ధి గణపతి వద్ద కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేసి త్రిపురాంతకేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనారాయణ శాస్త్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా నాయకుడు మాగుంట రాఘవరెడ్డి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తుల కోసం ఆలయ సమీపంలోని అన్ని సామాజిక వర్గాల సత్రాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

● త్రిపురాంతకం : కార్తీక పౌర్ణమి సందర్భంగా త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి జ్వాలా తోరణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆవు నెయ్యితో తయారు చేసిన ఒత్తులను తోరణంగా కట్టి వెలిగించారు. ఆకాశదీపం వెలిగించారు. పార్వతి త్రిపురాంబ సమేత త్రిపురాంతకేశ్వర స్వామిని జ్వాలా తోరణం కింద ఊరేగింపు నిర్వహించారు. బాలాత్రిపుర సుందరీదేవికి లక్షదీపార్చన నిర్వహించారు.

● కంభం : కంభం, అర్ధవీడు మండలాల్లోని శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మారుమోగాయి. మండలంలో చిన్నకంభం, తురిమెళ్ళలోని కనకసురబేశ్వరాలయం, రావిపాడులోని కోటేశ్వరస్వామి ఆలయం, వీరభద్రస్వామి దేవాలయాల్లో, పట్టణంలోని శివాలయాలలో భక్తులు పోటెత్తారు.

గిద్దలూరు : దేవాలయాలలో కార్తీక పౌర్ణమి శోభ కనిపించింది. పట్టణంలోని పాతాళ నాగేశ్వరస్వామి దేవాలయానికి శుక్రవారం తెల్లవారుజాము నుంచే అభిషేకాలు ప్రారంభం కాగా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. టీడీపీ నాయకులు బిల్లా రమేష్, వేములపాటి చంటి, చెన్నయ్య సురేష్, తదితరుల ఆధ్వర్యంలో దాతల సహకారంతో దేవస్థానానికి వచ్చిన భక్తులందరికీ అల్పాహారం, భోజన సౌకర్యం కల్పించారు. కుసుమ హరనాథ మందిరం ఆవరణలో 100 మంది ఆర్యవైశ్య దంపతులు కార్తీక పౌర్ణమి రుద్రాభిషేక కార్యక్రమంలో సామూహికంగా పాల్గొన్నారు. మందిరం అధ్యక్షులు నటుకుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో చంద్రశేఖర పూజారి సామూహికంగా రుద్రాభిషేకాలు నిర్వహించారు. అభయాంజనేయస్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. అమ్మవారిశాల, నవవస్త్ర గణపతి కమిటీ ఆధ్వర్యంలో నాగమయ్య గుడివద్ద శుక్రవారం సాయంత్రం జ్వాలా తోరణం నిర్వహించారు. అమ్మవారిశాలలో ఆకాశ దీపాన్ని ఎగురవేశారు. కెఎస్‌పల్లి, పాపులవీడు దేవస్థానాలలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

● తర్లుపాడు : మండలంలోని శివాలయాలలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక నీలకంఠేశ్వస్వామి ఆలయంలో, వీరభద్రస్వామి ఆలయంలో, వేణుగోపాలస్వామి ఆలయంలో నాగెళ్లముడుపు పార్వతివర్ధని ఆలయంలో, కేతగుడిపి శివాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఆలయ ధర్మకర్త నేరెళ్ల శివకుమార్, దేవులపల్లి పవన్‌కుమార్ జవ్వాజి విజయభాస్కర్‌రావు, ఉభయదాతలు గాదంశెట్టి శేషగిరి రావులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

పొదిలి : మండలంలోని పలు శివాలయాలతోపాటు పట్టణంలోని పార్వతీసమేత నిర్మమహేశ్వర దేవాలయంలో కార్తీకశోభతో కళకళలాడింది. శివాలయాలకు ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. ఉపవాసాలు ఉండి సాయంత్రం వేళల్లో దేవాలయ ప్రాంగణంలో మహిళలు పెద్దఎత్తున చేరుకొని కార్తీక దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా ఆయా దేవాలయాల్లో అర్చకులు ఏకాదశి రుద్రాభిషేకాలు నిర్వహించారు. వర్షం వచ్చినప్పటికీ భక్తులు లెక్కచేయకుండా స్వామి దర్శనానికి బారులు తీరారు. ఈగలపాడు శివాలయం భక్తుల తాకిడితో కిటకిటలాడింది. నిర్మమహేశ్వరస్వామి దేవాలయంలో సాయంత్రం జ్వాలాతోరణ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తుల అన్నదాన కార్యక్రమానికి టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనీల్ 13 క్వింటాళ్ళ బియ్యాన్ని అందజేశారు. అదే విధంగా దేవాలయం గోపురం దాత మాకినేని రమణయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్‌ల ఆధ్వర్యంలో అన్నదానం, జ్వాలాతోరణం కార్యక్రమ ఏర్పాట్లు చేశారు.

ఎర్రగొండపాలెం రూరల్ : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఎర్రగొండపాలెంలోని శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో మహిళ భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. రాత్రికి ఆలయంలో కర్పూర హారతి వెలిగించారు.

పెద్ద దోర్నాల : కార్తీక పౌర్ణమి సందర్భంగా స్థానిక శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం, శ్రీలక్ష్మీ నరసింహా స్వామి దేవాలయం,సీతా రామాలయం, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవాలయం, నటరాజ్ కూడలిలో,మోట్ల మల్లికార్జున స్వామి దేవాలయంలో మహిళలు, అయ్యప్ప మాలధారులు విశేషంగా పాల్గొని కార్తీక పౌర్ణమి క్రతువుల్లో పాల్గొన్నారు.


గిద్దలూరులో సామూహిక రుద్రాభిషేకం, కంభంలో శివలింగానికి అభిషేకం

గిరిజనుల సమగ్రాభివృద్ధే ప్రభుత్వాల లక్ష్యం

జన్‌జాతీయ గౌరవ దినోత్సవ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ త్రివినాగ్


లబ్ధిదారులకు ఇంటిపట్టాలు అందజేస్తున్న సబ్‌కలెక్టర్

పెద్దదోర్నాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమగ్రాభివృద్ధే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం అని మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ అన్నారు. స్థానిక ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాలలో జన్‌జాతీయ గౌరవదినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సురేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో భాగంగా దోర్నాల, పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం, మార్కాపురం, అర్ధవీడు, పెద్దారవీడు, గిద్దలూరు మండలాలకు చెందిన అన్నిశాఖల అధికారులు, చెంచు గిరిజనులు హాజరయ్యారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా ప్రధానమంత్రి ప్రసంగాన్ని ప్రదర్శించారు. అనంతరం సబ్‌కలెక్టర్ త్రివినాగ్ మాట్లాడుతూ వెనుకబాటుతనంతో ఇబ్బందులు పడుతున్న గిరిజనులను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కేంద్ర ప్రభుత్వం జన్‌ధన్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. గిరిజనుల జీవనోపాధులు పెంపొందించేందుకు 11 రకాల అంశాలను సర్వే చేశారు. అందుకు తగిన ప్రణాళికలు రూపొందించి చర్యలు కూడా చేపట్టారన్నారు. ఇంటి నిర్మాణాలకు ఆర్‌డీటీ సంస్థ ప్రభుత్వం సమన్వయంతో కసరత్తు చేస్తోందన్నారు. గిరిజన నాయకుడు స్వాతంత్ర్య సమరయోధుడు దర్తీ ఆలా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని కేంద్రప్రభుత్వం జన్‌జాతీయ దినోత్సవంగా వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల సందర్భంగా ఏకలవ్య విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గిరిజనులకు ఇంటి పట్టాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఏపీవో సురేష్‌కుమార్, డీటీ డబ్ల్యూవో జగన్నాథరావు, బీఎస్ఎన్ఎల్ డీఈ రవికుమార్, హౌసింగ్ ఈఈ పవన్‌కుమార్, డీఈవో కిరణ్ కుమార్, డీఎంహెచ్‌వో శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఈశ్వర్ భరద్వాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ భ్రమరాంబికా దేవి, ఆర్‌డీటీ ఆర్‌డీ నాగరాజు, ఆర్‌వోఎఫ్ఆర్ కో ఆర్డినేటర్ మంతన్న, ఏడు మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుమ్మరి కాలనీ సమస్యలు పరిష్కరించాలి

పెద్ద దోర్నాల : దోర్నాలలోని కుమ్మరి కాలనీ సమస్యలు సత్వరమే పరిష్కరించాలని సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ స్థానిక అధికారులను ఆదేశించారు. ఏకలవ్యలో జన్‌జాతీయ గౌరవ దినోత్సవ వేడుకల్లో పాల్గొని తిరిగి వెళ్తున్న క్రమంలో కాలనీవాసులు ఖాళీ బిందెలతో అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. నీటి సమస్య తీవ్రంగా ఉందని, మురికి నీరు ప్రవహించక దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీంతో స్పందించిన సబ్ కలెక్టర్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భ్రమరాంబికాదేవి, పంచాయతీ కార్యదర్శి శివ కోటేశ్వరరావుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలి


శిక్షణ కార్యక్రమానికి హాజరైన అధికారులు

మార్కాపురం రూరల్ నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) :: నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఎంపికైన అధికారులు సంసిద్ధం కావాలని ఎన్నికల పర్యవేక్షణ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి ఓబులేసు సూచించారు. ఈ నెల 23న ఎన్నికలు జరగనున్నాయన్నారు. స్థానిక ఎస్సీ, బీసీ, కాలనీలోని డ్వాక్రా బజారులో శుక్రవారం మార్కాపురం రెవెన్యూ డివిజన్‌లోని 13 మండలాల పరిధిలోని నీటి సంఘాల ఎన్నికల అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా ఎన్నికల నిర్వహణలో పాల్గొనున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియ విధానాన్ని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. ఈ ఎన్నికలలో ఏకగ్రీవాలకు చేసుకునే అవకాశం ఉందని ఎకగ్రీవంగా ఎన్నికైన వారికి ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఓటింగ్ విధానం స్లిప్‌ల ద్వారా, ఓటర్లు చేతులెత్తి ఎన్నుకునే ప్రక్రియ ద్వారా చేపడతారన్నారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా తగుజాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే గ్రామ సచివాలాయ వద్ద ఓటర్ల జాబితాలను ప్రదర్శించినట్లు తెలిపారు. ఎన్నికల మాస్టర్ ట్రైనర్, మార్కాపురం తహసీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించే గదులలో వసతులను పరిశీలించి కావలసిన సౌకర్యాలను సమకూర్చాలన్నారు. జిల్లాలోని ఒంగోలు, కనిగిరిలలో ఇప్పటికే ఎన్నికల అధికారులకు శిక్షణ పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రకాశం జిల్లాలోని 88 మేజర్, 14 మీడియం, 240 మైనర్ ఇరిగేషన్ నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 20న ఎన్నికల పబ్లిక్ నోటీసును విడుదల చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు


సంపత్

పుల్లలచెరువు, నవంబరు15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పుల్లలచెరువుకు చెందిన ఓ యువకుడు మిస్సింగ్ అయిన సంఘటన జరిగింది.ఎస్ఐ సంపత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పుల్లలచెరువుకు చెందిన కటారి బ్రహ్మయ్య అనే యువకుడు ఈ నెల 11 వ తేదీ నుంచి కనిపించడం లేదు.యువకుడి తండ్రి వెంకట శేషయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కార్యకర్త మృతికి నివాళి

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎర్రగొండపాలెం పట్టణ సీనియర్ కార్యకర్త లారీ సీలార్ సాహెబ్ శుక్రవారం ఆకస్మిక మృతి చెందారు. నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడురి ఏరిక్షన్ బాబు భౌతికాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. పార్టీకి విశిష్ట సేవలందించిన సీనియర్ కార్యకర్త మృతిపార్టీకి తీరని లోటని అన్నారు. కుటుంబ సభ్యులకు పార్టీ తాను అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, కామేపల్లి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు షేక్ మస్తాన్, నాయకులు పాల్గొని నివాళ్లు అర్పించారు.

బాలలహక్కుల చట్టాల అవగాహన


మాట్లాడుతున్న సైమన్ విక్టర్

కంభం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బాలబాలికల హక్కుల రక్షణ అమలు కోసం భారత రాజ్యాంగం నిర్దేశించిన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఎ.సైమన్‌విక్టర్ తెలిపారు. తద్వారా బాలబాలికల్లో వికాసానికి దోహద పడాలన్నారు. బంగారు బాల్యం వారోత్సవాలలో భాగంగా శుక్రవారం కళాశాల ప్రాంగణంలో 'మన హక్కులు తెలుసుకుందాం'పై చర్చ నిర్వహించారు. ఆర్ఐవో మాట్లాడుతూ జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు బాలబాలికలకు ఉందన్నారు. 18 ఏళ్లలోపు వారందరినీ పిల్లలుగా పరిగణించాలన్నారు. కార్యక్రమం లో అధ్యాపకులు మురళీకృష్ణ, లక్ష్మీప్రసన్న, లక్ష్మీశివమ్మ, సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లింలకు నిధులు కేటాయించడం హర్షణీయం

పెద్ద దోర్నాల,నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం హర్షణీయం అని టీడీపీ ఒంగోలు పార్లమెంటు మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ సమ్మద్ బాష పేర్కొన్నారు. బడ్జెట్టులో ముస్లిం మైనార్టీలకు సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం రూ.4376 కోట్లు కేటాయించిందన్నారు. అంతేగాక రాష్ట్ర మైనార్టీ సలహాదారులుగా ఎం.ఏ.షరీఫ్‌కు క్యాబినెట్ హోదా, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు మౌలానాముస్తాక్ అహ్మద్‌ను మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమించి ముస్లింలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

టెన్నిస్‌లో కోటయ్య గౌడ్ ప్రతిభ

గిద్దలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరుకు చెందిన టెన్నిస్ క్రీడాకారుడు కంచర్ల కోటయ్యగౌడ్ పాలకొల్లులో జరుగుతున్న ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ ర్యాకింగ్ టోర్నమెంటులో ప్రతిభ కనపరిచాడు. 65+ క్వాలిఫైయింగ్ రౌండ్స్‌లో విశాఖపట్టణంకు శశిభూషణ్‌తో కలిసి డబుల్స్ విభాగంలో 3 రౌండ్లలో గెలిచి మెయిన్‌డ్రాకు ఎంపికయ్యాడు. అయితే ఆ తరువాత జరిగిన మ్యాచ్‌లో 10-8 స్కోరు తేడాతో బెంగుళూరు క్రీడాకారులతో పోటీపడి ఓడిపోవడంతో సెమీఫైనల్స్‌కు వెళ్లే అవకాశాన్ని కోల్పోయినప్పటికీ టోర్నమెంటులో కోటయ్యగౌడ్ ప్రతిభను పలువురు అభినందించారు.

రేపే ఆనంద సోమదీక్ష

గిద్దలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని షరాఫ్ బజారులోని శ్రీఅమ్మభగవాన్ సేవ ఆలయంలో ఈ నెల 17న ఆదివారం ఉదయం 9.45 గంటలకు స్త్రీశక్తి ఆనందసోమదీక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గుల్లా పద్మావతి, డి.వరలక్ష్మి, డి.భవాని ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబంలో, సమాజంలో స్త్రీల అభ్యున్నతికి తోడ్పడే విధంగా కార్యక్రమం ఉంటుందని, కేవలం స్త్రీలకు మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు. ప్రవేశం ఉచితం అని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు కుళ్లాయిస్వామి అన్నారు. స్థానిక వేమన డిగ్రీ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభల కరపత్రాలు శుక్రవారం ఆవిష్కరించారు. ఈనెల 19న ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు పొదిలిలో నిర్వహించనున్నారని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. జీవో నెం.77 రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజి, రాష్ట్ర సభ్యులు ఆంజనేయులు, మార్కాపురం నాయకులు యూసుఫ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నాక్ ట్రైనింగ్ సెంటర్‌లో 18న జాబ్ మేళా

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 15 ఆంధ్రజ్యోతి: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మార్కాపురంలోని నాక్ ట్రైనింగ్ సెంటర్‌లో ఈనెల 18న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జె.రవితేజ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 7013950097 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టు


ధ్రువపత్రాలతో విద్యార్థులు

గిద్దలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అరుణోదయ పబ్లిక్ స్కూలు లో కరాటే బెల్టు గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. కరాటే మాస్టర్ భూతరాజు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. 30 మంది కరాటే విద్యార్థులు టెస్టులో ఉత్తీర్ణులయ్యారు. వీరికి పాఠశాల కరస్పాండెంట్ గ్రేడింగ్ బెల్టులను, సర్టిఫికేట్లను అందచేశారు.

ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలి : సీపీఎం

గిద్దలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజలపై మోపుతున్న విద్యుత్ ట్రూఅప్ చార్జీలు (సర్దుబాటు) రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా విద్యుత్ చార్జీలను పెంచబోమని ఎన్‌డీఏ నాయకులు చెప్పారన్నారు. ఇప్పుడు సర్దుబాటు చార్జీలు ప్రజలపై మోపడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ట్రుఅప్ చార్జీలు ప్రభుత్వమే భరించాలన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట శుక్రవారం సీపీఎం ప్రజాపోరు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సీపీఎం నాయకులు టి.ఆవులయ్య మాట్లాడుతూ ట్రూ అప్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉచిత ఇసుక విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టు సరిపడ నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీపీఎం నాయకులు థామస్, శ్రీనివాసులు, ఓబులేసు, వీరయ్య, పాల్గొన్నారు.

18న ఎర్రగొండపాలెంలో మెగా జాబ్ మేళా

ఎర్రగొండపాలెం రూరల్ నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి), రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఏపీఎస్ఎస్‌డీసీ వారి ఆధ్వర్యంలో ఈ నెల 18న ఎర్రగొండపాలెంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కిల్ హబ్ ద్వారా వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని స్కిల్ కో ఆర్డినేటర్ విజయకుమారి తెలిపారు. నియోజవర్గంలోని యువతి, యువకులు ఈ మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాలో పాల్గొనే యువతి, యువకులు ఆధార్ కార్డు, విద్యా అర్హత ధ్రువపత్రాలను వెంట తెచ్చుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం 6302220609, 7013182284, 9553945387 ఈ నెంబర్లను సంప్రదించాలని అన్నారు.

హరహర మహాదేవ..

- శివనామ స్మరణతో మారుమోగిన శైవ క్షేత్రాలు
- భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు

కనిగిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి పలు శివాలయాలలో మహిళలు 365 వత్తులతో ఉసిరి దీపాలను వెలిగించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు.

కనిగిరి కొండపైన శివాలయం, దిగువ శివాలయం, శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వేకువ జామునే కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. సాయిబాబా మందిరంలోని భవానిశంకర స్వామి వారికి ఉదయాన్నే మహాన్యస పూర్వక రుద్రాభిషేకం, పూజలు నిర్వహించారు. నాగశిలల వద్ద భక్తులు దీపారాధనలు చేసి అర్చనలు చేశారు. సామూహిక సాయి సత్యవ్రతాలు నిర్వహించారు. అనంతరం బాబా విగ్రహాన్ని పురవీధుల్లో ఉత్సవ ఊరేగింపు నిర్వహించగా, ప్రజలు పారువేట పోసి పూజలు చేశారు. సాయంత్రం ఆలయంలో జ్యోతిర్లింగార్చన, జ్వాలాతోరణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని చాకిరాల శివాలయంలో భక్తులు అశేషంగా పాల్గొని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకు ఆలయాల్లో మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కొండపైన విజయమార్తేండేశ్వరస్వామి ఆలయంలో మున్సిపల్ చైర్మన్ గఫార్ ప్రత్యేక పూజలు చేశారు.


కనిగిరి: కొండపైన శివాలయంలో పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్


తాళ్లూరు శివాలయంలో కార్తీక దీపాలు వెలిగించిన భక్తులు


పీసీపల్లి: మల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


కనిగిరి: బాబా ఆలయంలో వ్రతమహోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆలయాల్లో కార్తీక శోభ

పామూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా పామూరు, సీఎస్‌పురం మండలాల్లోని శైవక్షేత్రాలు శివనామ స్మరణతో మారుమోగాయి. పామూరులోగల శ్రీవల్లీభుజంగేశ్వర, దాదిరెడ్డిపల్లిలోని శ్రీపార్వతి సమేత నీలకంఠేశ్వరుడు, పడమటకట్టకిందపల్లిలోని దుర్గామల్లేశ్వరుడు, బొట్లగూడూరులోని శ్రీరామలింగేశ్వర, మోపాడులోని గొందిమల్లేశ్వరుడు దేవస్థానాల్లో మహిళాభక్తులు వేకువ జామునుంచే కార్తీక దీపాలు వెలిగించారు. స్వామివార్లకు అభిషేకాలు చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సీఎస్‌పురం మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన భైరవకోనను దేవస్థాన ఈవో వంశీకృష్ణ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలతో అలంకరించారు. మిట్టపాలెం నారాయణ స్వామి దేవస్థానంలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చు కొన్నారు. రామాపురంలో గల శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం, నర్రవాడ వెంగమాంబ దేవస్థానంలో ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ శుక్రవారం పూజలు నిర్వహించారు.

పీసీపల్లిలో.. పీసీపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సంద ర్భంగా మండలంలోని శైవక్షేత్రాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

పెదయిర్లపాడులో గల మహారుద్రపీఠం, మల్లేశ్వరస్వామి దేవాలయం, పంచలింగాలకొండకు భక్తులు భారీగా తరలి వెళ్లారు. కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో లక్షదీపోత్స వం నిర్వహించారు. అర్చకులు పలుకూరి సుబ్బారావు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

దర్శిలో.. దర్శి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో కార్తీకపౌర్ణమి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. స్థానిక అన్నపూర్ణ సమేతా కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు బారులుతీరారు. మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని పోతకమూరు, కొర్లమడుగు, పోతవరం తదితర శివాలయాల్లోనూ కార్తీక దీపాలు వెలిగించారు. మహిళలు ఉపవాసదీక్షలు చేసి సాయంత్రం దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

ముండ్లమూరులో.. ముండ్లమూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయాలు కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. పులిపాడులో శ్రీగంగా పార్వతి సమేత ఉర్లేశ్వర స్వామి, పసుపుగల్లులోని శ్రీకాశీ విశ్వేశ్వర అన్నపూర్ణాదేవి, ముండ్లమూరులోని శ్రీమల్లమాంబ మల్లికార్జునస్వామి, పెదఉల్లగల్లులోని గంగాపార్వతి అన్నపూర్ణదేవి, మారెళ్లలోని చెన్నమల్లేశ్వరస్వామి, ఈదరలోని రాజరాజ మల్లేశ్వరి అమ్మవారి ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు.

కురిచేడులో.. కురిచేడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా కురిచేడులో జ్ఞాన ప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారు జామునుంచే భక్తులు శివాలయానికి వెళ్ళి స్వామి అమ్మవార్ల దర్శనం చేసుకుని దీపాలు వెలిగించారు. సాయంత్రం పౌర్ణమి సందర్భంగా జ్వాలా తోరణం ఏర్పాటుచేశారు.

తాళ్లూరులో.. తాళ్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో అత్యంత విశిష్టమైన కార్తీకపౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి దేవాలయాలు కార్తీక వెలుగులో దేదీప్యమానంగా వెలుగొందాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. కార్తీక స్నానాలు ఆచరించిన మహిళలు ఉదయం నుంచి ఉపవాసం ఉన్నారు. మహిళలు వేకువజాము నుంచి శివాలయాలను సందర్శించి కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయాల వద్ద జ్వాలాతోరణ, వత్తులు వెలిగించారు. తాళ్లూరులోని శ్రీపార్వతీ సమేతరామలింగేశ్వరస్వామి, మాధవరంలోని నీలకంఠేశ్వరస్వామి, బొద్దికూరపాడు గంగాపార్వతీవర్ధనీ సమేత సోమేశ్వరస్వామి, లక్కవరంలోని క్రిష్ణస్వామి ఆశ్రమంవద్ద గల శివాలయం, శివరాంపురం సమీపానగల అగస్త్యేశ్వరస్వామి, తూర్పుగంగవరం వాసవీమాత ఆలయం, తాళ్లూరులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, గుంటిగంగలోని శివాలయం వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

ముఖాముఖి

శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యం

ఎం. భీమానాయక్, సీఐ, పామూరు



ప్రశ్న: సర్కిల్ పరిధిలో క్రైం రేటు ఎలా ఉంది?

జవాబు: పామూరు సర్కిల్ పరిధి అయిన పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయి. ఎవరైనా విఘాతం కల్గిస్తే ఉక్కుపాదంతో అణిచివేస్తాం.

ప్ర: సర్కిల్ పరిధిలో జూదం, గంజాయి, కోడి పందేలు జరుగుతున్నాయా?

జ: జూదం, గంజాయి, కోడి పందేల శిబిరాలపై నిఘా పెట్టాం. అలాంటి వ్యక్తులపై గట్టి నిఘా ఉంచాం.

ప్ర: సోషల్ మీడియాలో పెడుతున్న అభ్యంతకరమైన పోస్టులపై చర్యలు ఉన్నాయా?

జ: ప్రభుత్వ ఆదేశాలమేరకు సోషల్ మీడియాలో వ్యక్తుల మనోభావాలు దెబ్బతినేలా పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రధానంగా మతవిద్వేషాలకు దారితీసే పోస్టులు, చిత్రాల మార్ఫింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవు. హింసాత్మక వీడియోలు, తప్పుడు సమాచారాలు, నకిలీ ఖాతాలు సృష్టించి వేరే వారి పేర్లతో అసభ్యకరమైన పోస్టులు పెడితే ఇబ్బందులు పడతారు. ఆన్‌లైన్‌లో వేధింపులకు పాల్పడటం, ట్రోలింగులు చేయడం లాంటి పోస్టులు పెడితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

బాలల హక్కులను కాపాడాలి

పామూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులకు భంగం కలగకుండా కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తహసీల్దార్ బీవీ రమణరావు అన్నారు. బాలల దినోత్సవ వేడుకల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో స్వయం కృషి సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ కటకం సజన అధ్యక్షతన బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలలు స్వేచ్ఛగా ఆడుతు పాడుతూ జీవించే హక్కు, దోపిడీ హింస నుంచి రక్షణ పొందే హక్కును రాజ్యాంగం కల్పించిందని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జీసీడీవో పచ్చ లావణ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

పామూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పొదిలిలో ఈనెల 19న జరిగే ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు కె.ప్రభాకర్, పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. స్థానిక ఎస్వీ జూనియర్ కళాశాలలో శుక్రవారం మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. మహాసభలో ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, జిల్లా మాజీ కార్యదర్శి ఎంఎల్ నారాయణ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

పామూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పొగాకు సాగుచేసే రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి కె.రాధ అన్నారు. శుక్రవారం మండలంలోని దూబగుంటలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ ఏడాది పొగాకుకు మంచి ధర వస్తుందని నమ్మకం లేదన్నారు. ప్రత్యామ్నాయ పంటలైన అలసంద, కంది, మినుము, శనగ, మొక్కజొన్న లాంటి పంటలను సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి పి.నాగేశ్వరరావు, వీపీఏ అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

రూ.22.30 లక్షలు పలికిన చెరువు వేలం

ముండ్లమూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పసుపుగల్లు పంచాయతీ పరిధిలోని చింతలపూడిలో చెరువులో చేపలు పెంచేందుకు వేలం నిర్వహించారు. మూడు సంవత్సరాల పాటు చేపలు వేసి పెంచి పట్టుకొనేందుకు శుక్రవారం పసుపుగల్లు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వరగాని బాల సుందరరావు అధ్యక్షతన వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో ఎనిమిది మంది పాల్గొన్నారు. వేములబండకు చెందిన కంచుమాటి శ్రీనివాసరావు రూ 22.30 లక్షలకు పాటపాడి చెరువును దక్కించుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మౌలాలి మాట్లాడుతూ వేలం పాట ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి ఖర్చు పెడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దాసరి పెద అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈపంట నమోదు చేసుకోవాలి

తాళ్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రబీ పంటలకు ఈక్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయధికారి బి.ప్రసాదరావు తెలిపారు. ఈనెల 18 నుంచి ఈపంట నమోదు జరుగుతుందన్నారు. రైతాంగం తమ ఆధార, పాస్‌బుక్, మొబైల్ నంబర్లను రైతు సేవా కేంద్రాల వద్దకు తీసుకెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. ఈక్రాప్ నమోదుతో పంటకు నష్టం కల్గితే నష్టపరిహారం పొందవచ్చునని చెప్పారు.

17 బైకులు పట్టివేత


దొంగలు అపహరించిన బైకులను పట్టుకున్న పోలీసులు

దర్శి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల్లో చోరీకి గురైన 17 మోటార్‌సైకిళ్లను దర్శి పోలీసులు పట్టుకున్నారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు పోలీసులు మోటార్‌సైకిళ్ల దొంగలపై దృష్టి సారించారు. డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐ రామారావు ఆధ్వర్యంలో ఎస్సై ఎం.మురళి, పలువురు సిబ్బంది కనిగిరి, పొదిలి, గుంటూరు, పల్నాడు జిల్లాలోని పలుచోట్ల చోరీకి గురైన రూ.12 లక్షలు విలువచేసే 17 బైకులు పట్టుకొని ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. చోరీలకు పాల్పడిన దర్శి మండలానికి చెందిన ఏ శ్రీనివాసరావు, కె.పవన్, కె.భవానీశివశంకర్, బి.శ్రీహరి, జిగోపీలను అరెస్టు చేసినట్లు దర్శి ఎస్సై మురళి తెలిపారు.

దొనకొండలో డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు కృషిచేయాలి

దొనకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దొనకొండ ప్రాంతంలోని విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు దూరప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు అన్నారు. విద్యార్థుల ఇబ్బందుల దృష్ట్యా దొనకొండలో డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తనయుడు రాఘవరెడ్డికి విజ్ఞప్తి చేశారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా మండలంలోని చందవరం గ్రామంలోని ప్రసిద్ధి చెందిన శివాలయాన్ని రాఘవరెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

ఈసందర్భంగా నాగులపాటి శివకోటేశ్వరరావు, శృంగారపు నాగసుబ్బారెడ్డి, కొత్తం రఘునాదరెడ్డి, మోడి పెద్దఆంజనేయులు, కుందుర్తి లక్ష్మణ్ తదితరులు రాఘవరెడ్డిని ఘనంగా సన్మానించారు. దొనకొండలో డిగ్రీ కాలేజీ లేక విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను శివకోటేశ్వరరావు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీతో చర్చించి త్వరలో పరిష్కరించేలా చర్యలు చేపడతామని తెలిపినట్లు టీడీపీ నాయకులు తెలిపారు.

బాలల హక్కులపై అవగాహన కల్పించాలి

తాళ్లూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను తెలియజేసి స్వేచ్ఛగా ఎదిగేలా చేయ్యాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఏబీసీ హైస్కూల్‌లో బాలల వారోత్సవాలు కరస్పాండెంట్ టి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో బాలల వారోత్సవాల ప్రాధాన్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కె.కాలేషాబాబు, తెలుగు పండిత్ సుబ్బయ్య, ఎస్‌ఏ కొండలరావు, వెంకట్రావు, వలి తదితరులు పాల్గొన్నారు.

గోకుల షెడ్‌ల పరిశీలన

తాళ్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపురం, శివరాంపురం గ్రామాల్లో నిర్మితమవుతున్న గోకులషెడ్‌ల నిర్మాణ పనులను ఏపీడీ లలితకుమారి శుక్రవారం పరిశీలించారు. మండలంలో 29 గోకుల షెడ్‌లు మంజూరయ్యాయని తెలిపారు. లక్ష్యాల మేరకు షెడ్‌ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో మురళి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం

- టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు కడియాల లలిత్ సాగర్, రమేష్

తాళ్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, కడియాల రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. తాళ్లూరు మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు మందకొడిగా ఉందని, వేగవంతం చేయాలన్నారు. కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధానకార్యదర్శి లోకేష్‌లు పార్టీ సభ్యతం పొందిన వారికి రూ.5 లక్షల బీమా వర్తించే విధానాన్ని రూపొందించారన్నారు. గ్రామ స్థాయిలో ప్రతి టీడీపీ కార్యకర్త పార్టీ సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. త్వరలో జరుగనున్న నీటి సంఘం ఎన్నికలపై దృష్టి సారించాలన్నారు. అన్ని నీటి సంఘాల్లో టీడీపీ మద్దతుదారులు విజయం సాధించేలా పార్టీ శ్రేణులు పని చేయాలన్నారు. పార్టీ శ్రేణులు ఐకమత్యంగా ముందుకు సాగాలన్నారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబులరెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, నాయకులు శాగంకొండిరెడ్డి, మానం రమేష్ బాబు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, షేక్ కాలేషావలి, గొల్లపూడి వేణుబాబు, ఐ.శ్రీనివాసరెడ్డి, జి.రమణారెడ్డి, రాచకొండ వెంకట్రావు, రామకోటిరెడ్డి, హనుమారెడ్డి, గాడిపర్తి లక్ష్మీనారాయణ, కె.నరసింహారావు, గోపిరెడ్డి వెంకటేశ్వరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ

భవన నిర్మాణానికి నిధులు

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి


డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): దర్శిలో నూతన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి కూటమి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆమె ఓప్రకటన విడుదలచేశారు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి పాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం శిథిలావస్థకు చేరిందని, ఎంతోకాలంగా కార్యాలయ విధులు అద్దె భవనంలో నడుస్తున్న విషయాన్ని వివరించినట్లు ఆమె తెలిపారు. ఈవిషయమై స్పందించిన మంత్రి సత్యప్రసాద్ త్వరలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనానికి నిధుల మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. వైసీపీ అసమర్థ పాలనతో నియోజకవర్గంలో నిలిచిపోయిన ప్రాజెక్టులను ఒక్కొక్కటిగా నిర్మించేందుకు నిధులు విడుదల చేయిస్తున్నామన్నారు. ఇప్పటికే జాతీయస్థాయి డ్రైవింగ్ శిక్షణ కేంద్రం పునర్నిర్మాణానికి రూ.28.5 కోట్లు నిధుల మంజూరు చేసిన విషయం తెలిసిందేనన్నారు. రూ.2 కోట్లతో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి కొద్దిరోజుల క్రితం భూమిపూజ చేసినట్టు చెప్పారు. త్వరలో స్పోర్ట్స్ ఆడిటోరియం ఏర్పాటుకు కూడా నిధులు మంజూరవుతాయని ఆమె వివరించారు.

అసెంబ్లీ సమావేశాలు ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా నడుస్తున్నాయన్నారు. సుదీర్ఘ అనుభవం కల్గిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో సభ ఎంతో హుందాగా సాగుతుందన్నారు. గత వైసీపీ పాలనలో జరిగిన అసెంబ్లీ సమావేశాలను, ప్రస్తుతం జరుగుతున్న సమావేశాలను ప్రజలు పోల్చుకొని ప్రజారంజకంగా పాలన చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని అభినందిస్తున్నారన్నారు. వైసీపీ తరుపున గెలుపొందిన 11 మంది ఎమ్మెల్యేలు సమావేశాలకు గైర్హాజరుకావటం సిగ్గుచేటన్నారు. ప్రజాస్వామ్యం పట్ల వారికి గౌరవం లేకపోవటం వలనే మొఖం చాటేశారని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి విమర్శించారు.

'ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి'


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం శ్రేణులు

పామూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసరాల వస్తువుల ధరల నియంత్రణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకో వాలని సీపీఎం మండల కార్యదర్శి కె.మాల్యాద్రి డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ధరలపై ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక తహసీల్దార్ వద్ద జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. మరో వైపు విద్యుత్ సర్దుబాటు, ట్రూఅప్ చార్జీ భారాలు మోపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో షేక్ ఖాదర్‌బాషా, అల్లాభక్ష్, సీహెచ్ వెంకటేశ్వర్లు, వై.వీరనారాయణ, షేక్ మహబూబ్‌పీరా, కె.శంకర్, ఎస్కే రమీజ, ఖాదర్ ఉన్నీసా, మదారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులపై పెనుభారం

ముండ్లమూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ విద్యుత్ సర్‌చార్జీలతో పాటు నిత్యావసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆపార్టీ నాయకుడు వెల్లంపల్లి అంజనేయులు మాట్లాడుతూ ఎన్నికల ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కాయని ఆరోపించారు. సర్‌చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు పెంపు, నిత్యావసర సరుకుల పెరుగుదలతో సామాన్యులపై పెనుభారం మోపిందన్నారు. అనంతరం రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఏస్రవంతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బోడపాటి హనుమంతరావు, గంగినేని సత్యనారాయణ, పంటా ఏడుకొండలు, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

హనుమంతునిపాడు (కనిగిరి), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్‌చార్జీల పేరుతో ప్రజలపై భారం వేయడం తగదని సీపీఎం నాయకుడు బడుగు వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ప్రజల నడ్డి విరిచే కార్యక్రమాన్ని ప్రభుత్వాలు చేపడుతున్నాయని విమర్శించారు.

అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డీటీ కిషోర్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వినయ్, ఎన్.వెంకటేశ్వర్లు, రమేష్, రాములు, సంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న ప్రయాణికుల కష్టాలు

- తూర్పుగంగవరం-తాళ్లూరు రోడ్డుకు మోక్షం
- వైసీపీ హయాంలో ముందుకురాని కాంట్రాక్టర్లు
- కూటమి ప్రభుత్వంలో శరవేగంగా జరుగుతున్న పనులు


తూర్పుగంగవరం-తాళ్లూరు మార్గంలో జరుగుతున్న పనులు

తాళ్లూరు, నవంబరు 15: గత పదేళ్లుగా తాళ్లూరు ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న తూర్పుగంగవరం- తాళ్లూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గంలో బీటీరోడ్డు వేస్తుండటంతో ప్రయాణికుల కష్టాలు తొలగనున్నాయి. ఆర్‌అండ్‌బీ ఏఈలు స్రవంతి, రఫీల పర్యవేక్షణలో ఇటీవల తారురోడ్డు నిర్మాణపనులు చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణానికి గత ఏడాది జూలైలో రూ.4 కోట్ల 80లక్షల నిధులు మంజూరయ్యాయి. నిధులు మంజూరై టెండర్ ప్రక్రియ పూర్తయింది. కాంట్రాక్టర్ బిల్లులు రావన్న భయంతో పనులు చేపట్టలేదు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చొరవ తీసుకుని ఆశాఖ అధికారుతో మాట్లాడారు. పనులు వేగవంతంగా చేపట్టి ప్రయాణికుల కష్టాలు తొలగించాలని తెలిపారు. ఈమార్గంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున వెంటనే పనులు చేపట్టాలని తెలిపారు. దీంతో ఆర్ అండ్‌బీ అధికారులు అప్రమత్తమై పనులు ప్రారంభించారు. రోడ్డుపై పడ్డ గుంతలను కంకర్, సిమెంట్ మిక్సర్‌తో పూడ్చి తారు రోడ్డు వేస్తున్నారు. దీంతో పదేళ్లగా గుంతల రోడ్డులో రాకపోకలు సాగిస్తూ పడిన కష్టాలు తీరనున్నాయని ప్రయాణికులు పేర్కొంటున్నారు.




అమరావతి: కృష్ణానదిలో హంసవాహనంపై స్వామివార్ల తెప్పోత్సవం





దీపోత్సాహం


అమరావతి: ప్రత్యేక అలంకరణలో అమరేశ్వరుని మూలవిరాట్


అమరావతిలో నక్షత్రహారతి ఇస్తున్న అర్చకులు

- కోలాహలంగా కార్తీకపౌర్ణమి
- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- వైభవంగా కోటి దీపోత్సవం, జ్వాలాతోరణం
- సూర్యలంక తీరంలో జలవందనం జనసంభరం
- కోటప్పకొండలో త్రికోటేశ్వరస్వామికి విశేష అభిషేకాలు
- అమరావతిలో పుణ్య హారతులతో పులకించిన కృష్ణమ్మ


కోటప్పకొండలో నంది విగ్రహం వద్ద దీపారాధనలు చేస్తున్న భక్తులు


మంగళగిరి: గండబేరుండ జ్వాలా దీపాన్ని వెలిగిస్తున్న మంత్రి నారా లోకేశ్


కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో జ్వాలాతోరణం

నరసరావుపేట, అమరావతి, బాపట్ల, పెదకాకాని, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శైవక్షేత్రాలు, కృష్ణానది, సముద్ర తీర ప్రాంతాలు, గృహాలు దీపాల వెలుగులతో కాంతు లీనాయి. హరహర మహాదేవ శంభోశంకర నామస్మర ణతో ఆలయాలు, నదీ, సముద్ర తీర ప్రాంతాలు మారుమ్రోగాయి. కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతోనూ, ఉత్సాహంగా శుక్రవారం జరుపుకున్నారు. భక్తులతో జిల్లాలోని శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. కృష్ణానదీ తీరంతో పాటు బాపట్ల జిల్లా పరిధిలోని సముద్ర తీరం భక్తులతో పోటెత్తింది. పుణ్యస్నానాలాచరించిన భక్తులు కార్తీక దీపారాధనలు చేసి గౌరమ్మకు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. పౌర్ణమిని పురష్కరిం చుకుని ఆలయాల్లో రుద్రాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు తెల్ల వారు జామునే ఆలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయాల వద్ద శివలింగాకరంలో కోటి దీపోత్సం నిర్వహించారు. కోటప్పకొండ, అమరావతి, పెదకాకాని ఆలయాల్లో స్వామివార్ల దర్శనాలకు భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణాల్లో కోటి దీపోత్సవం, జ్వాలా తోరణం కార్యక్రమాలను భక్తులు తిలకించి పులకించిపోయారు.

- కోటప్పకొండలో త్రికోటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అభిషేకాల నిర్వహించి కోటయ్య స్వామికి విశేష అలంకారం చేశారు. వేలాది భక్తులతో గిరి ప్రదక్షణ కోలాహలంగా సాగింది. రాత్రి నేత్రపర్వంగా జ్వాలా తోరణం జరిగింది. ఈ సందర్భంగా స్వామికి అఖండ పూజ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.
- పంచారామ పుణ్యక్షేత్రాల్లో ప్రథమ ఆరామమైన అమరారామం అమరావతికి భక్తులు పోటెత్తారు. తెల్ల వారుజామున నుంచే భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానా లు చేసి కార్తీక దీపాలను వెలిగించారు. బాణలింగానికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దంపతులు స్వామివార్లకు ప్రత్యేకపూజ లు నిర్వహించి, కృష్ణవేణికి చీర సారె సమర్పించారు. దూప, పంచ, నంది, కుంభ, నక్షత్ర, కర్పూర హారతు లను నదీమాతకు సమర్పించగా స్నానఘాట్ల నుంచి వేలాది మంది భక్తులు కనులారా వీక్షించారు. విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించిన హంస వాహనంపై బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి తెప్పో త్సవం కృష్ణానది అలలపై కన్నులపండువగా జరిగింది.
- ప్రముఖ పర్యాటక కేంద్రం సూర్యలంక జన సంద్రంతో పులికించింది. పెద్దసంఖ్యలో భక్తులు తీ రంలో దీపాలను వెలిగించి సముద్రుడికి, తారకేశ్వర స్వామి, శ్రీఆంజనేయస్వామిలకు ప్రత్యేక పూజలు చేశారు. సుమారు లక్ష మంది భక్తులు తీరంలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు తెలిపా రు. తీరంలో సాగరహారతి అట్టహాసంగా జరిగింది. తీరం ఒడ్డున ఏర్పాటు చేసిన శివలింగానికి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన న రేంద్రవర్మ దంపతులు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రత్యేక పూజ లు చేశారు. అనంతరం వేదపండితుల సమక్షంలో సముద్రుడికి సాగర హారతు లను ఇచ్చారు.
- పెదకాకాని మల్లేశ్వరస్వామి సన్నిధి కార్తీక దీపాల వెలుగులతో నిండిపోయింది. ఆలయ ప్రాంగణంలో భక్తు లు కార్తీక దీపారాధనలు చేశారు. హైకోర్టు విశాంత్ర న్యాయమూర్తి జస్టిస్ బి.శివశంకర్, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ దంపతులు స్వామివారిని దర్శించుకునిని అభిషేక సేవలో పాల్గొన్నారు.


అమరావతి: కృష్ణమ్మ ఆలలపై కార్తీకదీపాలు వదులుతున్న భక్తులు


కార్తీక పౌర్ణమి సందర్భంగా సూర్యలంక తీరానికి పోటెత్తిన భక్తులు


బాపట్ల సూర్యలంక సముద్రతీరంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు


జాతీయ రహదారి పక్కన అక్కాయిపాలెం పరిధిలో అనధికారిక లేఅవుట్‌లో ఎక్స్‌కవేటర్‌తో పనులు (ఫైల్)

నరేంద్ర వర్గం.. నిర్వేదం



- చీఫ్‌విప్ పదవి ఆశించి ధూళిపాళ్ల భంగపాటు
- విప్ ప్రతిపాదనపై ఎమ్మెల్యే నరేంద్ర విముఖత
- రెండు రోజులుగా అసెంబ్లీ సమావేశాలకు మొక్కుబడిగా హాజరు
- తమ నేతకు అన్యాయం జరిగిందని అనుయాయుల అసంతృప్తి

గుంటూరు, పొన్నూరుటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు నుంచి ఆరు సార్లు విజయం సాధించి పార్టీ కోసం అహరహం శ్రమించే తమ నేత ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు కూటమి ప్రభు త్వంలో తగిన ప్రాధాన్యం దక్కలేదని నియోజకవర్గ టీడీపీ శ్రేణులు నిర్వే దంలో ఉన్నారు. నరేంద్రకు అన్యా యం జరిగిందంటూ రెండు రోజు లుగా వివిధ సామాజిక వర్గాల నేతలు పత్రికా ప్రకటనలతో తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఫలితాలు వెలువడిన వెంటనే ఈ పర్యాయం చంద్రబాబు కేబినెట్‌లో నరేంద్రకు చోటు దక్కుతుందని, ఆ తర్వాత కీలక పదవి వస్తుందని ఆశించి భంగపడ్డారు. 2014లో ఐదో సారి గెలుపొందినప్పుడే నరేంద్రకు మంత్రి పదవి ఖాయమని భావించారు. అప్పట్లో టీడీపీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు తమకు ఇవ్వకపోయినా పర్వాలేదు.. నరేంద్రకు ఇవ్వడానికి వీల్లేదని అడ్డుపడ్డారు. సంగం డెయిరీ చైర్మన్‌గా నరేంద్ర వ్యవహరిస్తున్నందున ఆయనకు ప్రత్యేకంగా మంత్రి ఇవ్వాల్సిన అవసరం లేదనే సాకు కూడా ప్రత్యర్థి వర్గం లేవనెత్తుతున్నది. 2019 ఎన్నికల్లో ఓటమి చెందిన నరేంద్ర ఐదేళ్లుగా పార్టీకి కొమ్ముకాస్తూ అధినేత చంద్రబాబుకు అండగా ఉంటూ వచ్చారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలో ఆయనపై నిత్యం విమర్శలు చేస్తూ ఒక దశలో జగన్ నా వెంట్రుక కూడా పీకలేడని విమర్శించి 32 రోజులు జైలు పాలయ్యారు. అయినా వెరవకుండా వైసీపీ ప్రభుత్వ తీరుపై పోరాటం ఆపలేదు. ఈ పర్యాయం ఆరో సారి నరేంద్ర విజయాన్ని సాధించగా తొలుత మంత్రి వర్గంలో చోటు లభిస్తుందని ఆయన అనుయాయులు భావించారు. అయితే కుల సమీకరణల్లో భాగంగా అవకాశం దక్కలేదు. ఆ తర్వాత చీఫ్‌విప్ పదవి దాదా పు ఖాయమని ప్రచా రం జరిగింది. అయితే పల్నాడు జిల్లాకు ఒక్క మంత్రి పదవి

(మిగతా 6వ పేజీలో..)

ఆగని అక్రమ లేఅవుట్లు

- ఒకరిని చూచి మరొకరు అదే దందా
- ప్రభుత్వ ఆదాయానికి గండి.. కొనుగోలుదారులకు తిప్పలు

చీరాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చీరాల నియోజకవర్గంలో నియోజకవర్గంలో ఇప్పటి వరకు అధికార గణాంకాల ప్రకారం 91 అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు తేల్చారు. వాటిని అనధికారిక లేఅవుట్లుగా ప్రజలకు తెలిపేలా హెచ్చరిక బోర్డులు పెట్టమని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ క్రమంలో కొన్నిచోట్ల హెచ్చరిక బోర్డులు పెట్టగా కొన్ని చోట్ల పెట్టలేదు. హెచ్చరిక బోర్డులను కూడా అక్రమార్కులు తొలగిస్తున్నారు. ఇదిలా ఉంటే నియోజకవర్గ వ్యాప్తంగా అనధికారిక లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. చర్యలు చేపట్టాల్సిన అధికారులు వీటిపై కన్నెత్తి చూడటంలేదు. ఒక వైపు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంటే, మరో వైపు కొనుగోలుదారులు నష్టపోతున్నారు. పలుచోట్ల ఆయా లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తులు రోడ్డు, డ్రైయిన్లు, ఉమ్మడి అవసరాలకు స్థల కేటాయింపులు లేక లబోదిబోమంటున్నారు. అక్రమ లేఅవుట్లపై చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు చెప్పినా అవి బుట్టదాఖలవుతున్నాయి. అనధికారిక లేఅవుట్లలో గృహాలు నిర్మించుకునేందుకు అప్రూవల్ కూడా ఇవ్వబోమని అధికారులు చెప్పిన విషయాన్ని గోప్యంగా ఉంచుతూ రియల్టర్లు తమ మాటల చాతుర్యంతో విక్రయాలు చేస్తున్నారు. లేఅవుట్ వేసేవారు ముందస్తుగా వ్యవసాయ భూమిని కన్వర్షన్ చేయాల్సి ఉన్నా పట్టించుకోవడంలేదు. అధికారులకు కనిపించదు

ప్రధాన రహదారుల వెంట వెలుస్తున్న అక్రమ లేఅవుట్లు అందరికీ కనిపిస్తున్నాయి. కాని సంబంధిత అధికారులకు మాత్రం కనిపించటం లేదని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. కొందరు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ, పరోక్షంగా రాజకీయ వత్తిళ్లని నింద పక్కవారి మీద వేస్తున్న దాఖలాలున్నాయి.

నోటీసు ఇస్తాం

216 జాతీయ రహదారి వెంట అక్కాయిపాలెం పరిధిలో, వాడరేవు రోడ్డులో వేసిన రెండు లేఅవుట్లు అక్రమ లేఅవుట్లే. వారు కన్వర్షన్ రుసుము చెల్లించకుండా పనులు చేస్తున్నారు. వెంటనే నోటీసు ఇస్తాం. అక్కడ అనధికారిక లేఅవుట్ అని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తాం.

- బాషా, శేఖర్, వీఆర్వోలు, అక్కాయిపాలెం, వాడరేవు


అనధికారిక లేవుట్‌కు రోడ్డు మార్జిన్‌ను కలుపుతూ పోసిన గ్రావెల్‌ను చదును చేస్తున్న రోలర్


వాడరేవు రోడ్డులో రోడ్డు మార్జిన్‌ను కలుపుకుని వేసిన అనధికారిక లేఅవుట్

రెండు ఇసుక రేవుల గుర్తింపు

- కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉచిత ఇసుక విధానంలో భాగంగా జిల్లాలో కొత్తగా రెండు ఇసుక రేవులను గుర్తించామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఉచిత ఇసుక విధా నంపై మైన్స్‌శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరి ముఖే ష్‌కుమార్ మీనా రాష్ట్ర రాజధాని నుంచి శుక్ర వారం అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీక్షణ సమావేశం నిర్వహించారు. నదులకు అనుకుని ఉన్న గ్రామా లలోని ప్రజల అవసరాలకు ఉచితంగా ఇసుక తీ సుకెళ్ళటానికి మండలస్థాయి అధికారుల అనుమ తులివ్వాలని తెలిపారు. ఇసుక కావాల్సిన వారు సంబంధిత గ్రామసచివాలయంలో ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈప్రక్రియ పక్కాగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘనకు గురికాకుండా పర్యవేక్షణ పెరగాలన్నారు. డి సెంబరు 19న మరుగుదొడ్ల దినోత్సవం నేప థ్యంలో ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి తప్ప నిసరిగా నిర్మించుకునేలా ప్రజలను చైతన్య పర్చాలన్నారు. ఈ నెల 19 నుంచి డిసెంబరు 19వ తేది వరకు నెలరోజులపాటు మరుగుదొడ్లు, పరిశు భ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కొత్తగా మరుగుదొడ్లు మంజూరు చేయాలన్నారు. వ్యక్తిగత మరుగు దొడ్లు పరిశుభ్రంగా ఉంచుకుని వారిని గ్రామపంచాయతీ స్థాయిలో గుర్తించి బహుమతులు ప్రక టించాలన్నారు. బా పట్లజిల్లా నుంచి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక లభ్యత ఉన్న ప్రాం తాలను గుర్తించి పర్యావరణ అనుమ తులు కొరకు ప్రభు త్వానికి నివేదించామన్నారు. అనుమతులు రాగానే ఆ రేవులలో ఇసుక తవ్వకాలు ప్రారంభిస్తామన్నా రు. కొల్లూరు మండలంలోని జువ్వలపాలెం, గాజు ర్లంక ప్రాంతాలలోని ఇసుకరేవుల వద్ద నీటి ప్రవాహం ఉందన్నారు. జువ్వలపాలెం వద్ద ర్యాంప్ నిర్మాణం జరుగుతుందన్నారు. గాజుర్లంక వద్ద నీటిప్రవాహం ఉన్నందున ఇసుక తవ్వకాలు నేటికి ప్రారంభం కాలేదన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, మైన్స్ ఏడీ రాజేష్, అనంతరాజు తదితరులు పాల్గొన్నారు.


జనజాతీయ గౌరవ దినోత్సవంలో భాగంగా సమరయోధుల పటాలకు పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

గిరిజనుల అభ్యున్నతికి అన్నివిధాలా కృషి

గిరిజనుల అభ్యున్నతికి అన్నివిదాలా కృషి చేస్తామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. జనజాతీయ గౌరవ దివస్ కార్యక్రమం శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. బిర్సాముండా జయంతిలో భాగంగా గిరిజన స్వాతంత్ర్య సమరయోధులను బిర్సాముండా, అల్లూరు సీతారామరాజు, గాము గంటదొర, గాము మల్లుదొర, బొనంగి పండు పడాల్, కుడుముల పెద్దబయ్యన్న, హనుమం తప్ప, కారంతమ్మన్నదొరల చిత్రపటాలకు కలెక్టర్ పుష్పాంజలి ఘటించారు. అనంతరం గిరిజన సంఘాల నాయకులను ఘనంగా సత్కరించి స న్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ నేటి యువతరం సామాజిక స్పృహతో మెలగాలని చెప్పారు. ఎస్టీలలోని యువత భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలంటే స్వాతంత్ర్య సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆదివాసి దినోత్సవం రోజున నిర్ణయించుకున్న అంశాలను తక్ష ణమే అమలు చేయడానికి యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తుంద న్నారు. జిల్లాలో 75వేలమంది ఎస్టీ జ నాభా ఉండగా 3,712 మందికి ఆధార్ కార్డులు లేనట్లు గుర్తించామన్నారు. చీరాల మండలం బేరిపురం, బుర్లవా రిపాలెం కాల్వపై బ్రిడ్జి నిర్మించాలని గిరిజన సంఘాల నాయకులు కోర డంతో స్పందించిన కలెక్టర్ తక్ష నమే మంజూరు చేస్తున్నట్లు ప్రక టించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సాధికారితాధికారి బి.ప్రకాశరావు, గిరిజన సంఘా ల నాయకులు దేవరకొండ రాము, టి.మోహన్‌కుమార్ ధర్మా, శ్రీను, శంకరరావు, వెంకటేశ్వర్లు, ప్రతాప్‌కు మార్ తదితరులు పాల్గొ న్నారు.

రైలునుంచి జారిపడి గుర్తుతెలియని మహిళ మృతి

సింగరాయకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపడి గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. ఈ ఘటన సింగరాయకొండ-ఉలవపాడు మధ్య ఉన్న చిల్లాకాలువ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కి తరలించారు. మృతురాలి వయసు 40-50 ఏళ్ల ఉండవచ్చని వారు భావిస్తున్నారు.

తూమాడు సర్పంచ్, కార్యదర్శిలపై ఫిర్యాదు

జరుగుమల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేసిన మండలంలోని తూమాడు సర్పంచ్ వి.విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి డి.మౌనికలపై చర్యలు తీసుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ కనపర్తి శ్రీనివాసరెడ్డి డీపీవోను కోరారు. ఈమేరకు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. సర్పంచ్, కార్యదర్శి ఇద్దరూ కలిసి అవినీతికి పాల్పడ్డారని శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. పంచాయతీ ఆమోదం లేకుండా నిధులు ఖర్చు చేశారని, వ్యక్తిగతంగా కూడా కొంత డ్రా చేసుకున్నారని ఆయన డీపీవో దృష్టికి తీసుకెళ్లారు. ఆమేరకు ఆడిట్ అధికారులు గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

బ్యాంక్ ఖాతాలో నగదు మాయంపై కేసు

నాగులుప్పలపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారుడికి తెలియకుండా తన బ్యాంక్ ఖాతాలోని నగదు చెల్లింపు జరగడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ బి.శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు, అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన పోకూరి శ్రీనివాసరావుకు స్థానికంగా ఉన్న కెనరాబ్యాంక్‌లో ఖాతా ఉంది. తన ఖాతాలో ఉండాల్సిన నగదులో నుంచి రూ.2.40లక్షలు తన ప్రమేయం లేకుండా చెల్లింపులు జరిగినట్లు గుర్తించారు. దాంతో బాధితుడు శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

33మంది కానిస్టేబుళ్లు బదిలీ

ఒంగోలు(క్రైం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 33 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ ఎస్పీ ఏఆర్.దామోదర్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. వివిధ పోలీస్‌స్టేషన్‌లలో కానిస్టేబుళ్ళుగా పనిచేస్తున్న వారికి మోమోలు ఇచ్చి బదిలీ చేశారు.

అభాగ్యురాలిగానే...

పోలీసు కార్యాలయం వద్ద పెట్రోలు పోసుకున్న యువతి మృతి

నేడు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంత్యక్రియలు

ప్రియుడు మత్తయ్యను అరెస్టు చేయాలని డిమాండ్

ఒంగోలు క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట ఈనెల 11న పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన కర్ణాటకకు చెందిన యశోదచౌహాన్(25) రిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. మధ్యాహ్నం ఒంగోలు తాలూకా సీఐ అజయ్‌కుమార్, తహసీల్దార్ వాసు అక్కడకు చేరుకుని శవపంచనామా నిర్వహించారు. యశోద ఆమె బంధువులు మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు నిరాకరించారు. దీంతో ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో శనివారం స్థానిక కమ్మపాలెం శ్మశానవాటికలో అంత్యక్రియలు చేయాలని నిర్ణయించారు. ప్రేమ పేరుతో సహజీవనం చేసి కనిపించకుండా పోయి యువతి ఆత్మహత్యకు కారకుడైన మత్తయ్యను వెంటనే అరెస్టు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

అంతర్ జిల్లాల సీనియర్ కబడ్డీ పోటీలు

ఒంగోలు(రూరల్), నవంబరు15(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని సూదనగుంట కోటయ్యచౌదరి జడ్పీ హైస్కూలులో డిసెంబర్ 5 నుంచి 8వ తేదీ వరకు అంతర్ జిల్లాల సీనియర్ స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయలో ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఎస్పీ దామోదర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ ఈ పోటీలు సూదనగుంట ఫౌండేషన్ ఆధ్వర్యంలో సూదనగుంట కోటయ్య చౌదరి, ఆదిలక్ష్మి మెమోరియల్ 71వ అంతర్ జిల్లాల స్త్రీ, పురుష కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 9గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురు జరుగుతాయని, రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల నుంచి 13 స్త్రీ, 13 పురుష జట్లు పాల్గొంటాయన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి, ప్రీమియం లీగ్‌పోటీలకు ఎంపిక చేస్తారని వెల్లడించారు. అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఎస్.చంద్రమోహనరెడ్డి, ట్రెజరర్ డి.రమేష్‌బాబు పాల్గొన్నారు.

విద్యుత్ రంగాన్ని జేబు సంస్థగా మార్చిన జగన్

బిల్లుపై చర్చలో ఎమ్మెల్యే ఏలూరి


అసెంబ్లీలో విద్యుత్ బిల్లుపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సంస్థలను వైసీపీ ప్రభుత్వంలో జగన్‌రెడ్డి జేబు సంస్థగా మార్చుకొని ఆ నిధులను ఇతర అవసరాలకోసం వాడుకున్నారని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శుక్రవారం అసెంబ్లీలో విద్యుత్ బిల్లుపై ఆయన మాట్లాడారు. నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విద్యుత్ సవరణ బిల్లును ప్రవేశ పెట్టారని ఆయనకు ఎన్డీఏ ప్రభుత్వం పక్షాన అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగం తీవ్ర సంక్షోభానికి గురయ్యిందన్నారు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో దాదాపు 20 మిలియన్‌ల లోటు విద్యుత్ ఉందని, కరంటు కోతతో ప్రజలు సతమతం అవుతున్న తరుణంలో చంద్రబాబు సమర్థవంతంగా 2014-19 మధ్య నాణ్యమైన నిరంత విద్యుత్‌ను అందించారని గుర్తు చేశారు. అలాగే కరంటు చార్జీలను భవిష్యత్‌లో పెంచబోమని ఇచ్చిన మాటను నిలబెట్టామన్నారు. రాష్ట్రంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పరంగా విద్యుత్ రంగంలో సమూలమైన మార్పునకు తెలుగుదేశం ప్రభుత్వం నాంది పలికిందని వివరించారు. 2019-24 మధ్యకాలంలో జగన్మోహన్ రెడ్డి హయాంలో విద్యుత్ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. అనాలోచిత నిర్ణయాలు, అవినీతి ఆలోచనలతో తక్కువ ధరకు కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలను, పీపీఎలు రద్దు చేయడం వల్ల వేల కోట్ల రూపాయలు ఆర్థిక భారం విద్యుత్ వినియోగదారులపై వైసీపీ ప్రభుత్వం మోపిందని ఏలూరి దుయ్యబట్టారు. 8 సార్లు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారన్నారు. పీపీఏలను రద్దు చేయటం వల్ల విద్యుత్ రంగంలో పెట్టుబడిదారులు భారత దేశం నుంచి పారిపోయే స్థితికి జగన్మోహన్‌రెడ్డి సర్కార్ తీసుకు వచ్చిందని ఆరోపించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని 2037 నాటికి పూర్తిగా గ్రీన్ పవర్‌కి షిఫ్ట్ కావాలని ఆయన ఆకాంక్షించారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి


పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న నరసింహారావు

చినగంజాం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) :విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు ఎస్.నరసింహారావు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా చినగంజాం గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను శుక్రవారం ఆయన ప్రారంభించారు. తరగతి పుస్తకాలతో పాటు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉండే మహనీయుల జీవిత చరిత్రలు, జనరల్ నాలెడ్జ్ అంశాలు, కరెంట్ ఎఫైర్స్ తెలుసుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. గ్రంథపాలకుడు ఎం.మోహనలక్ష్మీనరసింహాచార్యులు, రామచంద్రానగర్ ప్రాథమిక పాఠశాల హెచ్.ఎం గుత్తి శారద, ఉపాధ్యాయులు ఆర్ఎస్‌వీ పోతురాజు, వై.రామాంజనేయులు, షేక్ నాయబ్ రసూల్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞాన సముపార్జన

అద్దంకి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం ద్వారా జ్ఞాన సముపార్జన జరుగుతుందని గ్రంథపాలకుడు చుండూరి సుగుణరావు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా రెండవరోజు శుక్రవారం అద్దంకి లోని గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. మాదక ద్రవ్యాల పై అవగాహన కల్పించారు. పుస్తక పఠనం ప్రాముఖ్యతను వివరించారు.

ప్రత్యేక ప్రణాళికలతో గ్రామాల అభివృద్ధి

బల్లికురవ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రతినిధులు ప్రత్యేక ప్రణాళికలతో గ్రామాలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ఏపీఎస్ఆర్‌డీ డిప్యూటీ డైరెక్టర్ జె. రామనాథం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు, మండల స్థాయి అధికారులకు శిక్షణ జరిగింది ఈ శిక్షణను రాష్ట్రఅధికారుల బృందం పరిశీలించింది. ఈసందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు ప్రజలతో కలిసి సభలు ఏర్పాటు చేసుకొని రాబోవు రోజుల్లో గ్రామాలలో ప్రజలకు ఉపయోగపడే పనులను గుర్తించి ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ఈ శిక్షణలో బాపట్ల ఫ్యాకల్టీ మెంబరు వెంకటేశ్వర్లు, ఒంగోలు డీటీఎం అమర్ బాబులు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె. కుసుమకుమారి, ఎంపీపీ శ్రీలక్ష్మీ, ఈవోపీఆర్డీ సుమతి పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ రామనాథం

నేడు అభివృద్ధి ప్రణాళిక తయారీపై శిక్షణ

పంగులూరు : ప్రజా ప్రణాళిక ఉద్యమంలో 2025-26 సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి ప్రణాళికల తయారీ కోసం ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులకు శనివారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.స్వరూపారాణి తెలిపారు. ఈ శిక్షణకు నిర్దేశించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు విధిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

పలు చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

- మోటార్ సైకిళ్లను చోరీ చేసే ఐదుగురు ముఠా అదుపులో
- రూ.12 లక్షల విలువైన 17 బైక్‌లు స్వాధీనం
- ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు.. గంజాయి విక్రయాలు చేసే మరో ముగ్గురు కూడా...
- వివరాలను వెల్లడించిన ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు చోరీలకు పాల్పడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద సుమారు రూ. 12లక్షల విలువైన సొత్తును, కేజీన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. శుక్రవారం ఒంగోలులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ వెల్లడించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ముఠా..

జిల్లాలోని పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రాగి తీగ దొంగిలించి విక్రయించడంతో పాటు గంజాయిని తెచ్చి విక్రయాలు చేస్తున్న ముగ్గురిని త్రిపురాంతకం పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 16 కిలోల రాగితీగ, కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తాళ్ళూరు మండలం సోమవరప్పాడుకు చెందిన పోలా జాన్సన్ అలియాస్ జానీ, దర్శికి చెందిన కుంచాల లింగేష్, నెల్లూరు జిల్లా లింగసముద్రంనకు చెందిన గురునాథంలాజర్‌లు కలిసి దర్శి, ముండ్లమూరు, కురిచేడు ప్రాంతాలలో రైతులకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లు పగులకొట్టి రాగి తీగ దొంగిలించారు. రాగి తీగను విక్రయించగా వచ్చిన నగదుతో సరదాలు చేస్తూ వినుకొండ రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసేవారు. కురిచేడు రైల్వేస్టేషన్‌కు వచ్చి అక్కడ విక్రయించే ప్రయత్నం చేస్తుండగా త్రిపురాంతకం సీఐ జి.అసన్ తన సిబ్బందితో పట్టుకున్నట్లు ఎస్పీ దామోదర్ తెలిపారు. శుక్రవారం ఉదయం 11.30గంటలకు ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నామని, వారిని విచారించగా ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి తీగ చోరీలకు పాల్పడినట్లు వారు తెలిపారని వెల్లడించారు.

17 మోటార్‌సైకిళ్లు స్వాధీనం


మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

దర్శి పరిసర ప్రాంతాల్లో మోటార్‌సైకిళ్లను చోరీ చేసే ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ దామోదర్ తెలిపారు. వారి వద్ద రూ.12లక్షల విలువైన 17 మోటార్‌సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. శుక్రవారం దర్శి సీఐ వై.రామారావు, ఎస్ఐ మురళి తమ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా నలుగురు అనుమానితులు రెండు మోటార్‌సైకిళ్లపై వెళుతుండగా అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపడింది. దీంతో వారి వద్ద ఉన్న రెండు మోటార్ సైకిళ్లతో పాటు వారు చోరీ చేసిన మరో 15 వాహనాలను మెకానిక్ గోపి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. దర్శి మండలం గంగపాలెంనకు చెందిన అంకాల శ్రీను, కప్పల పవన్, కప్పల భవానీశంకర్, బండారు శ్రీహరి, దర్శి మండలం దేవవరంనకు చెందిన గంజ గోపిని శుక్రవారం మధ్యాహ్నం అరెస్టు చేసినట్లు చెప్పారు. దర్శి, కనిగిరి, పొదిలి ప్రాంతాలతో పాటుగా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో కూడా వీరు మోటార్‌సైకిళ్ల చోరీ చేశారని ఎస్పీ వివరించారు.

పోలీసులకు రివార్డులు

మోటార్‌సైకిళ్ల చోరీ కేసులో 17 వాహనాలను రికవరీ చేసిన దర్శి సీఐ వై.రామారావు, ఎస్ఐ మురళి, ఏఎస్ఐ రాంబాబు, హెడ్‌కానిస్టేబుల్ శివశంకర్, కానిస్టేబుల్ మహేష్, గిరిలను ఎస్పీ దామోదర్ అభినందించారు. అదేవిధంగా త్రిపురాంతకం పోలీసులు ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలను పట్టుకున్నందుకు సీఐ అసన్‌తో పాటు సిబ్బందని అభినందించి రివార్డులు అందజేశారు. ఈ సమావేశంలో దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించాలి

అధికారులకు కలెక్టర్ అన్సారియా ఆదేశం

పర్చూరివారిపాలెంలో లేఅవుట్ పరిశీలన

సమస్యలను చెప్పిన లబ్ధిదారులు


హౌసింగ్ లబ్ధిదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

పొన్నలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పక్కా ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిపెట్టి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అన్సారియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె మండలంలోని పర్చూరివారిపాలెంలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌ను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో అక్కడే సమావేశం నిర్వహించారు. ఇళ్ల పూర్తి చేయకపోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇస్తున్న యూనిట్ వ్యయానికి తోడు డ్వాక్రా మహిళలకు రుణాలు ఇప్పించి ఇళ్ల పూర్తి చేయించాలని వెలుగు ఏపీఎంను ఆదేశించారు. నిర్మాణ సామగ్రిని తెచ్చే వాహనాలు లేఅవుట్‌లోకి వచ్చే వీలులేకుండా పోయిందని లబ్ధిదారులు తెలిపారు. దీంతో కలెక్టర్ పీఆర్ ఏఈ కోటేశ్వరరావును పిలిచి రోడ్డు నిర్మాణానికి అంచనాలు తయారు చేసి పంపాలని ఆదేశించారు. హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన ఇళ్ల నిర్మాణ గడువు వచ్చేనెలతో ముగుస్తున్నందున లబ్ధిదారులు త్వరగా పూర్తిచేసుకోవాలన్నారు. కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, హౌసింగ్ డీఈఈ సత్యనారాయణ, తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీవో సుజాత, అధికారులు పాల్గొన్నారు.

ఒడా చైర్మన్ టీడీపీకే

తేల్చిచెప్పిన లోకేష్

పరిశీలనలో పాపారావు, లక్ష్మి, ఎరిక్షన్ పేర్లు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒడా) చైర్మన్ పదవి టీడీపీకే దక్కనుంది. ఆ మేరకు రాష్ట్ర మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ తేల్చిచెప్పారు. తదనుగుణంగా జిల్లాలో టీడీపీకి చెందిన దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే రెండు విడతలుగా నామినేటెడ్ పదవులను టీడీపీ కూటమి ప్రభుత్వం భర్తీ చేసింది. రెండో విడతగా భర్తీ చేసిన పదవుల్లో అనేక అర్బన్ డెవలప్‌మెంట్ పదవులను విడుదల చేశారు. అయితే ఒడా చైర్మన్ పదవిని భర్తీ చేయకపోవడానికి కారణం లేకపోలేదు. జిల్లాలోని టీడీపీ నేతలు ఇటీవల సమావేశం అయినపుడు ఆ పదవిని జనసేనకు కేటాయించాలని ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్ ప్రతిపాదించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో జనసేనకు కేటాయించిన పదవులపై ఒక అంగీకారానికి వచ్చినందున జిల్లాలో కీలకమైన ఒడా చైర్మన్ పదవిని టీడీపీకే ఉంచుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఆ మేరకు జిల్లా నేతలు విషయం ప్రస్తావించగానే లోకేష్ స్పందిస్తూ ఆ పదవిని టీడీపీ వారికే ఇవ్వాలని, మీరు తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని సూటిగా చెప్పినట్లు సమాచారం. నేడో, రేపో ఆ పదవికి చైర్మన్‌ను ఎంపిక చేసే ఉద్దేశంతో కొన్ని పేర్లు పరిశీలిస్తున్నారు. దర్శి మాజీ ఎమ్మెల్యే పాపారావుతోపాటు గత ఎన్నికల్లో ఓడి ఇన్‌చార్జులుగా ఉన్న గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్ బాబు పేర్లను పరిశీలిస్తున్నారు. ప్రధానంగా నారపుశెట్టి పాపారావుకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

వైసీపీ అధికారంలో ఉండగా దర్శి నగర పంచాయతీ గెలుపులో స్థానికంగా నారపుశెట్టి కుటుంబీకులకు ఉన్న ఆదరణ కలిసి రావడం, తొలి నుంచి పాపారావు పార్టీలోనే కొనసాగుతుండటాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిసింది.

అవీఇవీ

రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన


కారంచేడులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న నేతలు

కారంచేడు(పర్చూరు), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో సక్రమంగా రోడ్లు, డ్రైనేజీలు లేక అవస్థలు పడిన ప్రజానీకానికి కూటమి ప్రభుత్వం రాకతో ఊరట కలిగింది. రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కార్యక్రమంలో భాగంగా కారంచేడులో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. దీంతో శుక్రవారం కారంచేడు ఆరవ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాలిగ శివపార్వతి, పంచాయతీ కార్యదర్శి సూర్యనారాయణ, ఎంపీటీసీ శేషారత్నం, భూలక్ష్మి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ధరల పెరుగుదలను నిరసిస్తూ సీపీఎం ఆందోళన


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

పంగులూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పెరిగిన నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలతో ప్రజలు తల్లడిల్లుతున్నారని సీపీఎం నేత రాయిణి వినోద్‌బాబు అన్నారు. ఆకాశన్నంటిన ధరలను నియంత్రించాలని ప్రభుత్వాన్ని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధరలను అదుపు చేసే చర్యలు చేపట్టాలని, రేషన్ షాపుల ద్వారా తక్కువ ధరకు నిత్యావసర సరుకులు అందజేయాలని డిమాండ్ చేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడిన వారికి సరైన వైద్యం అందించాలని, ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ చార్జీల భారం వేయరాదని, నిత్యావసర సరుకుల ధరల నియంత్రణ కోరుతూ డీటీ ఆదినారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ అధ్యక్షులు తలపనేని రామారావు, సుబ్బారావు, సభ్యులు కృష్ణకుమారి, సుబ్బరాజు, ఏలియా, ఆదుంసాహెబ్ పలువురు మహిళలు పాల్గొన్నారు.

25 మంది ఉద్యోగాలకు ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన వారితో కళాశాల ప్రతినిధులు

చీరాల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : ఇటీవల టెక్ మహీంద్రా కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 25 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావులు తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను వారు అభినందించారు. సీఎస్ఈ, ఈసీఈ, ఏఐఎంఎల్, ఐవోటీ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ విభాగాధిపతులు డాక్టర్ పి.హరిణి, డాక్టర్ డి. రాజేంద్రప్రసాద్, డాక్టర్ సి. హరికిషన్, డాక్టర్ ఎస్. ఇంద్రనీల్, డాక్టర్ కె. సుబ్బారావు, డాక్టర్ ఎం. రమేష్, ఇతర విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నరేంద్ర వర్గం.. నిర్వేదం

- చీఫ్‌విప్ పదవి ఆశించి ధూళిపాళ్ల భంగపాటు
- విప్ ప్రతిపాదనపై ఎమ్మెల్యే నరేంద్ర విముఖత
- రెండు రోజులుగా అసెంబ్లీ సమావేశాలకు మొక్కుబడిగా హాజరు
- మా నేతకు అన్యాయం జరిగిందని అనుయాయుల అసంతృప్తి

(తరువాయి...)

కూడా లేకపోవడంతో ఆ ప్రాంతానికి ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు ఆలోచన చేయడంతో నరేంద్ర పేరు వెనక్కు వెళ్ళిపోయింది. వినుకొండ నుంచి గెలుపొందిన జీవీ ఆంజనేయులును చీఫ్‌విప్ పదవి వరించింది. ఈ క్రమంలో నరేంద్రకు విప్ పదవి ఇస్తామని ప్రతిపాదించగా ఆయన సుముఖత వ్యక్తం చేయనట్లు తెలిసింది. కేబినెట్ హోదా స్థాయి పదవిని ఆశిస్తున్నట్లు నరేంద్ర అధిష్ఠానానికి తెలియజేసినట్లు సమాచారం. కాగా నరేంద్రకు చీఫ్‌విప్ పదవి రాలేదని తెలిసినప్పటి నుంచి పార్టీ శ్రేణులు అసంతృప్తి గళం వినిపిస్తున్నాయి. నరేంద్ర కూడా కొంత మనస్థాపానికి గురై రెండు రోజులుగా అసెంబ్లీ సమావేశాలకు మొక్కుబడిగా హాజరవుతున్నారు.

ప్రతిసారీ నిరాశే

రాష్ట్ర ప్రభుత్వ పదవుల పందేరంలో పొన్నూరు నియోజకవర్గానికి సరైన ప్రాధాన్యం లభించడంలేదని టీడీపీ శ్రేణులు అసంతృప్తి, ఆవేదనకు గురవుతున్నాయి. నియోజకవర్గాన్ని టీడీపీకి కంచుకోటగా నిలిపిన ఘనత ధూళిపాళ్ల కుటుంబానిది. ధూళిపాళ్ల వీరయ్య చౌదరి పొన్నూరు ఎమ్మెల్యేగా ఎన్నికై 1989 వరకు రెవెన్యూ శాఖ మంత్రిగా పనిచేశారు. 1994లో రోడ్డు ప్రమాదంలో వీరయ్యచౌదరి మృతి చెందగా ఆయన వారసుడిగా నరేంద్ర రాజకీయ ఆరంగేట్రం చేశారు. ఆయన వరసుగా ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికైయ్యారు. 2019 ఎన్నికలో స్వల్ప తేడాతో ఓటమి పాలైనా తిరిగి 2024లో అఖండ విజయాన్ని సాధించారు. అయితే ప్రతిసారి నరేంద్ర పేరు మంత్రి పదవి రేసులో ఉండటం భంగపడటం నరేంద్రతో పాటు ఆయన అనుయాయులకు పరిపాటిగా మారింది. వీరయ్యచౌదరి తర్వాత 35 ఏళ్లుగా నియోజకవర్గానికి అమాత్య యోగం దక్కలేదు. అంతే కాకుండా నామినేటెడ్ పదవుల్లో సైతం పొన్నూరుకు సరైన ప్రాధాన్యం లేదని కార్యకర్తలు తీవ్ర నిరాశతో ఉన్నారు.

బీపీసీఎల్ పెట్రోల్ పైపులతో రైతులకు నష్టం

- ఎమ్మెల్యే బీఎన్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పేర్నమిట్ట చెరువులో ఏర్పాటు చేస్తున్న బీపీసీఎల్ పెట్రోల్ పైపులతో రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదమని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ గోపాలక్రిష్ణను కలిసిన ఎమ్మెల్యే బీఎన్ వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు. పేర్నమిట్ట చెరువుపై ఆధారపడి 194 ఎకరాల సాగు ఉందన్నారు. రాబోయే రోజుల్లో సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. పెట్రోల్ పైపులు పేర్నమిట్ట చెరువు మీదుగా ఇతర ప్రాంతాలకు వేస్తున్నారని, దీనివలల్ల రానున్న రోజుల్లో రైతులతో పాటుగా ప్రజలకు తీవ్రసమస్యగా పరిణమించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువులో నుంచి కాకుండా ఇతర ప్రాంతాల మీదుగా పైపులైన్ వేయాలని తెలిపారు. పేర్నమిట్ట చెరువు పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ


వివరాలు అడిగి తెలుసుకుంటున్న రాష్ట్ర వైద్య బృందం

పీహెచ్‌సీలను పరిశీలించిన వైద్య బృందం

ఇంకొల్లు,నవంబరు 15,(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇంకొల్లు,దుద్దుకూరు ఆరోగ్య కేంద్రాలను డాక్టర్ రాజ్‌కిరణ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్‌సీడీ బృందం సందర్శించింది. ఇంకొల్లు గ్రామంలో జరుగుతున్న సర్వే తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటిలో అందరిని పరీక్షించి క్యాన్సర్ అనుమానిత కేసులను గుర్తించాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం క్యాన్సర్ నిర్ధారణ సర్వే నిర్వహిస్తుందని, దీనిని అందరూ ఉపయోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ అంజలి, సీహెచ్‌వో కోటేశ్వరరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


నష్టం గురించి రైతును అడిగి తెలుసుకుంటున్న వ్యవసాయ అధికారులు

పంట నష్టంపై పరిశీలన

చీరాలటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పంట నష్టాలపై అంచనా వేసేందుకు మండల వ్యవసాయ అధికారిణి సుమతి సిబ్బందితో కలిసి శుక్రవారం మండల పరిధిలోని బుర్లవారిపాలెం, పిట్టువారి పాలెం, గవినివారి పాలెం ప్రాంతాల్లో పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. మండల పరిధిలో సుమారు 1000 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా సుమారు 50 ఎకరాలకు నష్టం వాటిల్లిందని వివరించారు. ఆమె వెంట వ్యవసాయ సహాయకులు రమేష్, శ్రావ్య, ప్రసన్న, రైతులు తదితరులు ఉన్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు ఇవ్వండి

● ఆర్‌అండ్‌బీ మంత్రిని కోరిన ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : పర్చూరు నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి సీఆర్‌ఎఫ్ నిధులను మంజూరు చేయాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు కోరారు. దీనికి సంబంధించిన లేఖను శుక్రవారం మంత్రి చాంబర్‌లో కలిసి అందజేశారు. ఈసందర్భంగా పర్చూరు నియోజకవర్గంలో గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, రహదారుల అభివృద్ధికి యుద్ధ ప్రాతిపదికన నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఏలూరి తెలిపారు.


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఏలూరి


సీఐ కృష్ణయ్యకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ, జనసేన నేతలు

పోసానిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

అద్దంకి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్, టీవీ5 న్యూస్ చానల్ అధినేత బీఆర్ నాయుడుపై అసభ్యకర పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేసిన పోసాని కృష్ణమురళీపై చర్యలు తీసుకోవాలని టీడీపీ, జనసేన నేతలు శుక్రవారం అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టీడీపీ, జనసేన నేతలు నాగినేని రామకృష్ణ, కాకాని అశోక్, మన్నం త్రిమూర్తులు,పెంట్యాల రామాంజనేయులు, దామా హనుమంతరావు, వలి, రాజశేఖర్, సాయి తదితరులు శుక్రవారం సీఐ కృష్ణయ్యను కలిసి ఫిర్యాదు చేశారు.


ట్రస్టీదారుకు వెండికిరీటం,శఠగోపురం ను అందజేస్తున్న దాత ఉమాదేవి

అమ్మవారికి వెండికిరీటం బహూకరణ

యద్దనపూడి,(మార్టూరు)నవంబరు15(ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండలం గన్నవరం గ్రామంలోని శ్రీఅంకమ్మతల్లి, పోలేరమ్మ తల్లి దేవస్థానంలో శుక్రవారం అంకమ్మతల్లికి వెండికిరీటం, శఠగోపురాన్ని దాత తూమాటి ఉమాదేవి బహూకరించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా అమ్మ వారికి లక్షా 15 వేల రూపాయలు విలువకలిగిన కిలో 100 గ్రాములు బరువు గలిగిన వెండితో నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన ఉమాదేవి, భర్త రామకోటేశ్వరరావు జ్ఞాపకార్థం వారి సంతానం అమరసుధా, మేదరమెట్ల హరిత, గోగినేని ఉదయకృష్ణల సహకారంతో వస్తువులను తయారుచేయించారు. వాటిని దేవస్థానంలో ట్రస్టీదారు దూళ్లిపాళ్ల కుమారస్వామికి అందజేశారు. ఆయన వాటిని అమ్మవారికి నూతన వస్త్రాలతో పాటు అలంకరించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పుణ్యస్నానాలు

గతంతో పోలిస్తే తగ్గిన భక్తుల సంఖ్య

చీరాల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం వాడరేవు, వేటపాలెం మండలం రామాపురం, కఠారివారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం గ్రామాల సముద్ర తీరాలకు కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు.


వాడరేవులో సముద్ర స్నానాలు ఆచరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, బాలకొండమ్మ దంపతులు

వేకువజాము బ్రహ్మముహూర్తం సమయంలో భక్తుల రాక మొదలయ్యింది. సుమారు 30వేల మంది సముద్ర స్నానాలు ఆచరించి ఉంటారని అనధికారిక అంచనా.

పుణ్యస్నానాలు ఆచరించిన ఎమ్మెల్యే కొండయ్య దంపతులు

సూర్యోదయానికి మునుపే ఎమ్మెల్యే కొండయ్య, బాలకొండమ్మ దంపతులు వాడరేవు సముద్ర తీరానికి చేరుకున్నారు. సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్డీఓ చంద్రశేఖర్‌నాయుడు, డీఎస్పీ మహ్మద్ మొయిన్ ఇతర అధికారులుతో సముద్ర స్నానాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు.

వర్షాలతో తగ్గిన భక్తుల సంఖ్య

గతంతో పోలిస్తే ఈ ఏడాది సముద్ర స్నానాలకు వచ్చిన భక్తుల సంఖ్య తగ్గింది. నియోజకవర్గ పరిధిలోని అన్ని తీరప్రాంతాలలో కలిపి సుమారు 25వేల మంది భక్తులు వచ్చినట్లు అనధికారిక అంచనా.

- దీపం సమర్పయామి

సముద్ర స్నానాలకు వచ్చిన మహిళా భక్తులు దాదాపు అందరూ తీరంలో దీపారాధన చేశారు. కొందరు బృందాలుగా తమ దీపాలు వెలిగించారు.

- అయ్యప్ప, శివ, భవానీ మాలధారులు

సూర్యోదయానికి మునుపే అయ్యప్ప, శివ, భవానీ, గోవింద దీక్షధారులు సముద్ర స్నానాలు ఆచరించారు. తీరంలో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సముద్రస్నానాలు అనంతరం మహిళలు వాడరేవులోని కోదండరామ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

కార్తీక పౌర్ణమి నేపథ్యంలో భక్తులు శివాలయాలకు పోటెత్తారు. పట్టణ పరిధిలో చీరాల, పేరాల, వేటపాలెం మండలాల పరిధిలోని శివాలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వేకువజాము నుంచి తరలివచ్చారు. ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించేందుకు భక్తులు పోటీ పడ్డారు.

బ్రహ్మగుండంలో కార్తీక స్నానాలు

బల్లికురవ : మండలంలో ప్రసిద్ధిచెందిన కొణిదెన బ్రహ్మగుండం కొలనుకు మండల పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున వచ్చి కార్తీక స్నానాలను చేశారు. అక్కడే ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుంటుపల్లి, అంబడిపూడి, కొమ్మినేని


ఇంకొల్లు శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వారిపాలెం, వేమవరం, కొప్పెరపాడు, ముక్తేశ్వరం, చెన్నుపల్లి, కొండాయపాలెం, కూకట్లపల్లి, నక్కబొక్కలపాడు తదితర గ్రామాలలో ఉన్న శివాలయాలకు భక్తులు వెళ్లి పూజలలో పాల్గొన్నారు. బ్రహ్మగుండం వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎస్‌ఐ జీవీ చౌదరి సిబ్బందిని అప్రమత్తం చేసి బందోబస్తు ఏర్పాటు చేశారు. కొణిదెన గ్రామస్థులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

చినగంజాంలో..


బల్లికురవ మండలం కొణిదెన బ్రహ్మగుండం కొలనులో కార్తీక స్నానాలు చేస్తున్న భక్తులు

చినగంజాం : మండల పరిధిలోని మోటుపల్లి, బాపయ్యనగర్, పల్లెపాలెం సముద్ర రేవులలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు తరలివచ్చిన అశేష భక్తజనంతో కడలి తీరం కోలాహలంగా మారింది. వేకువజామునుంచే భక్తులు సముద్రస్నానాలు చేసేందుకు తరలివచ్చారు. మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి సముద్రతీరంలో పసుపుతో గౌరమ్మను చేసి పూజలు నిర్వహించి, కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శైవక్షేత్రాల వద్ద జ్వాలాతోరణం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇంకొల్లులో..

ఇంకొల్లు : మండలంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఉదయాన్నే అధిక సంఖ్యలో భక్తులు శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పరమశివుని దర్శించుకున్నారు.ఇంకొల్లు శివాలయంలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు.


చినగంజాం మండలం బాపయ్యనగర్ సముద్ర తీరంలో భక్తుల కోలాహలం

పర్చూరులో దీపోత్సవం

పర్చూరు : కార్తీక పౌర్ణమి సందర్భంగా గ్రామాల్లో శివాలయాలు, అమ్మవారి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. వేకువజామునే మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపోత్సవం నిర్వహించారు. పర్చూరులోని భీమేశ్వరస్వామి ఆలయం, ఉప్పుటూరులోని అమరేశ్వర స్వామివారి ఆలయం, కాశీవిశ్వేశ్వరస్వామివారి దేవాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు అత్యంత వేడుకగా జరిగాయి. ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

శ్రీ సాయిబాబా ఆలయంలో

పర్చూరులోని శ్రీ షిర్డి సాయిబాబా ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చేసిన దీపోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.


పర్చూరు శ్రీ షిర్డి సాయిబాబా ఆలయంలో కార్తీక దీపోత్సవంలో మహిళా భక్తులు

శివనామస్మరణతో కిటకిటలాడిన శివాలయాలు

మణికేశ్వరంలో మంత్రి సతీమణి ప్రత్యేక పూజలు

అద్దంకి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మణికేశ్వరంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం వేకువ జాము నుంచే భక్తులు గుండ్లకమ్మ నదిలో స్నానాలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ సతీమణి ఝాన్సీ మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానాన్ని ఆమె ప్రారంభించారు. ఈవో గుంటుపల్లి వాసుబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అద్దంకి పట్టణంలోని పాత శివాలయం, వేయి స్తంభాల గుడి, కమతేశ్వరాలయాలలో మహిళాభక్తులు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివనామస్మరణతో శివాలయాలు మారుమోగాయి.


మణికేశ్వరంలో భక్తుల కోలాహలం (ఇన్‌సెట్లో) పూజలు చేస్తున్న మంత్రి సతీమణి ఝాన్సీ


రామకూరు కొండపై శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ ఎదుట ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

పోటెత్తిన భక్తులు

పంగులూరు : మండలంలోని పలు గ్రామాలలో శివక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పంగులూరు, మల్లవరం, రేణంగివరం, ముప్పవరం, చందలూరు పరిసర గ్రామాలలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని రామకూరు కొండపై కొలువుదీరిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని జ్వాలాతోరణం చేపట్టి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

వైభవంగా సామూహిక సాగరహారతి

● ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ మహేంద్రనాథ్

చీరాల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వాడరేవు సముద్రతీరంలో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం ఎదురుగా సముద్ర తీరంలో కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి సామూహిక సాగరహారతి కార్యక్రమం వైభవంగా జరిగింది. కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్ర నాథ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సామూహిక సాగరహారతి కార్యక్రమం వాడరేవులో తొలిసారిగా జరగటంతో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా పండితులు కారంచేటి నగేష్‌కుమార్, వెంకటేషులు తీరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివుని స్పటిక లింగాన్ని పంచామృతాలతో అభిషేకించారు. మంత్ర పుష్పం జపించారు. అనంతరం సామూహిక సాగరహారతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కనుల పండువగా జ్వాలా తోరణం

అద్దంకి : కార్తీక పౌర్ణమిని పురష్కరించుకొని అద్దంకి పట్టణంలోని పాతశివాలయంలో శుక్రవారం రాత్రి జ్వాలాతోరణం కనుల పండువగా నిర్వహించారు. దేవాలయంవద్ద జ్వాలాతోరణం ఏర్పాటు చేసి ఉత్సవ విగ్రహాలతో భక్తులు జ్వాలాతోరణం నుంచి తిరిగారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జ్వాలాతోరణాన్ని తిలకించారు.


అద్దంకి పట్టణంలోని పాతశివాలయం వద్ద జ్వాలాతోరణం

మార్టూరులో పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్మాణం

మార్టూరు, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): మార్టూరులో పెద్ద అండర్‌పాస్ వద్ద పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్మాణానికి శుక్రవారం టీడీపీ నాయకులు భూమి పూజ చేశారు.జాతీయ రహదారి విస్తరణ చేసినప్పటి నుంచి సెంటర్లో పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్మాణం చేపట్టాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు. కానీ వాటి నిర్మాణంపై గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. తద్వారా సెంటర్లో వివిధ పనులు నిమిత్తం,వివిధ గ్రామాలు నుంచి వచ్చిన ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు ఎంతో ఇబ్బందులకు గురయ్యారు.అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ 10 లక్షల రూపాయలు నిధులు కేటాయించింది. దీంతో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో షేక్ రజాక్, కామినేని జనార్దన్, కాకోలు వెంకటేశ్వర్లు, జంపని సాంబశివరావు, తొండెపు ఆదినారాయణ, ముప్పా ఆంజనేయులు, ముక్తిపాటి సాయిబాబా,గొట్టిపాటి వెంకట్రావు, పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మార్టూరులో పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్మాణానికి భూమిపూజలో టీడీపీ నాయకులు


సత్యన్నారాయణ వ్రతం చేస్తున్న మహిళలు (ఇన్‌సెట్లో) ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు

వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి ఏడో వార్షికోత్సవం

పేరాల(చీరాలటౌన్),నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని పేరాల ముత్యాలమ్మ పేటలోని మహాలక్ష్మి అమ్మవారి చెట్టువద్ద భక్తులు ఏడవ వార్షికోత్సవం నిర్వహించారు. ఈక్రమంలో ఉదయం స్కంధ పురాణంలో సూచించిన విధంగా వీరవెంకట సత్యన్నారాయణ స్వామి వ్రతాన్ని 100 మంది పుణ్య దంపతులతో నిర్వహించారు. మహిళలు కలశాలతో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు.

ఏటా కార్తీకమాస పూజల్లో పాల్గొంటాం

మేము స్థానికులమే అయినా ఉద్యోగ రీత్యా హైదరాబాదులో ఉంటున్నాం. కానీ మహాలక్ష్మి అమ్మ అంటే నమ్మకం, కోరిన కోర్కెలు తీర్చే అమ్మ పూజల కోసం ఏటాఎన్ని పనులు ఉన్నా కార్తీకమాసం పూజలకోసం ఇక్కడికి వచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొంటాం.

- చంద్రశేఖర్, లావణ్య దంపతులు

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి

చీరాల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : చీరాల మున్సిపల్ పరిధిలో పారిశుధ్య పనులపై మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో శుక్రవారం పురపరిధిలో ఎక్కడా అపరిశుభ్రత లేకుండా చెత్త తొలగించటంతో పాటు నిర్ణీత ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లించే విధంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, పారిశుధ్య కార్మికులను అప్రమత్తం చేశారు. ఈ క్రమంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చెత్త తొలగించటంతో పాటు బ్లీచింగ్ చల్లారు. కాలువల్లో తీసిన పూడికను యుద్ధప్రాతిపదికన తరలించేవిధంగా చర్యలు చేపట్టారు. శివారు, లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిల్వలేకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పారిశుధ్య నిర్వహణ అత్యంత కీలకమని, అందుకు అనుగుణంగా అనుసరించాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.


వీధులు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లుతున్న కార్మికులు

లారీ ఢీకొని వృద్ధుడి దుర్మరణం

మార్టూరు, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై రోడ్డు దాటుతున్న దార్ల పెద్ద వెంకటేశ్వర్లు (73) అనే వృద్ధుడ్ని గుంటూరు వైపు వెళుతున్న టమోటా లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా ఫ్లైవోవరు పైజరిగింది. మృతుడిది కిషోర్ నగర్‌గా గుర్తించారు. మృతుడి కుమారుడు చిన్న వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ బాషా తెలిపారు.

నేటి నుంచి ఆర్టీసీ సమయపాలన మాసోత్సవాలు

అద్దంకి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సమయపాలన మాసోత్సవం శనివారం నుంచి ప్రారంభమై డిసెంబరు 15 వరకు జరుగుతాయని డీఎం రామ్మోహనరావు తెలిపారు. సమయపాలన మాసోత్సవ కార్యక్రమాలను శనివారం ఉదయం 10.30 గంటలకు నెల్లూరు డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ షమీమ్ ప్రారంభిస్తారని తెలిపారు. కార్మికులు, ప్రయాణికులు హాజరు కావాలని కోరారు.

దుంపల ట్రక్కు బోల్తా

కొత్తపేట(చీరాల), నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : కొత్తపేట సమీపంలో 216 జాతీయ రహదారిపై శుక్రవారం ఓ దుంపల ట్రాక్టరు ట్రాలీ తిరగబడింది. ఆ సమయంలో పక్కన వాహనాలు, పాదచారులు లేకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ముందు ట్రాక్టరు ఇంజన్‌ను తొలగించారు. తరువాత దుంపలు తీసి ట్రాలీని లేపారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

శింగరకొండలో లక్ష తమలపాకుల పూజ

అద్దంకి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా లక్ష తమలపాకుల పూజ శుక్రవారం వైభవంగా జరిగింది. నిత్య పూజల అనంతరం వేదపండితులు, పూజారుల ఆధ్వర్యంలో లక్ష తమలపాకులతో పూజ నిర్వహించి అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

ఘనంగా కృష్ణ వర్ధంతి

చీరాలటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సినీ నటుడు సూపర్‌స్టార్ కృష్ణ ద్వితీయ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కృష్ణమహేష్‌బాబు సేవాసమితి ఆధ్వర్యంలో అధ్యక్షులు షేక్ అబ్దుల్ సలామ్ కార్యక్రమం నిర్వహించగా అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అంబేడ్కర్ భవన్, స్థానిక మహిళా మండలీల్లో అన్నదానాలు నిర్వహించారు. అభిమానులు యోహాన్, శ్రీధర్, చుక్కా కృష్ణ, రఫీ, సూరిబాబు, ఎలీషా, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, వేణుగోపాల్ పాల్గొన్నారు.


కృష్ణ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అభిమానులు


చీరాల్లో ఆహార భద్రత అధికారుల తనిఖీలు

చీరాలటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధి హరిప్రసాద్ నగర్‌లోని పలు దుకాణాల్లో ఆహార భద్రత అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. తయారీకి వాడుతున్న ముడి సరుకుకు పరీక్షలు నిర్వహించారు. ప్రజల ఆరోగ్యంపట్ల అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో గరికపాటి ప్రభాకర్, అనిల్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.



సోమశిలలో 69.287 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమ శిల జలాశయానికి ఎగువ నుంచి శుక్రవారం 7,684 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 68.287 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,150, కండలే రుకు తెలుగుగంగ ద్వారా 3,000, ఉత్తరకాలువకు 550, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



శివం శంకరం

- వేడుకగా కార్తీక పౌర్ణమి
- భక్తజనంతో పోటెత్తిన శివకేశవ ఆలయాలు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : హరహర మహాదేవ శంభో శంకర.. ఓం నమఃశివాయ.. శివనామస్మరణలతో శైవ క్షేత్రాలు మారుమోగా యి. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా శివకేశవ ఆలయాలకు భక్తజనం పోటెత్తింది. తెల్లవారు జామునుంచే పాలభి షేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. కార్తీక దామోదరుని సత్యనారా యణ వ్రతాలు భక్తిశ్రద్ధ లతో నిర్వహించారు. కార్తీక ఉపవాస దీక్షలతో ముత్తైదువులు భారీ సంఖ్యలో కేదారేశ్వర వ్రతాలు నిర్వహిం చారు. అన్ని ప్రముఖ దివ్యక్షేత్రా లతో పాటు ఆలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు కనుల పండు వగా జరిగాయి. రామాలయాల్లో సీతారాముల కల్యాణాలు, కృష్ణమందిరం, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శ్రీవారి కల్యాణాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమా లు నిర్వ హించారు. నగరంలోని రాజ రాజే శ్వరి ఆల యంలో సామూ హిక సత్యనారాయణ వ్రతం, శబరి శ్రీరామక్షేత్రంలో సామూ హిక సత్యనారాయణ వ్రతం, సీతారాముల కల్యాణ సహస్ర దీపాలంకరణలు జరిగాయి. పెంచలకోనలో ఉదయం ఏకోత్తర సహస్ర కలశాభి షేకం, సాయంత్రం శ్రీవారి ఆలయం ముందు కృత్తిక దీపోత్సవం జరి గింది. అలాగే వేదగిరి క్షేత్రంలో లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీ అమ్మవార్లకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారు గరుడ వాహనం పై ఊరేగారు. ఇక జొన్నవాడ క్షేత్రానికి భక్తులు తరలివచ్చారు. కడలి తీరంతో పాటు నదీతీర ప్రాంతాల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, పూజలు చేశారు. కాగా, శుక్రవారం నుంచి జిల్లాలోని పుణ్యక్షేత్రాలకు దక్షిణా మ్నాయ శ్రీ శృంగేరి జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి, విధుశేఖర భారతీ మహా స్వామి విజయ యాత్ర కొనసాగిస్తూ భక్తు లను అనుగ్రహి స్తున్నారు. సీతారామ పురం మండలంలోని ప్రాచీన శైవక్షేత్రాలు ఘటిక సిద్దేశ్వరం, భైరవకోన, సీతారామ పురంలోని శివాలయా లలోనూ భక్తులు పూజలు చేశారు. భైరవకోనలోని సొన వాన జలపాతంలో తెల్లవారుజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు చేసి కార్తీక దీపాలు వెలి గించి భైరవ దుర్గాంబ భర్గలేశ్వర స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు.

- కనువిందు చేసిన గంగాహారతులు

నగరంలోని ఇరుకళల పరమేశ్వరి ఆలయం గణేష్ ఘాట్‌లో శుక్రవారం రాత్రి కార్తీక లక్ష దీపోత్సవం వైభ వంగా జరిగింది. సింహపురి కార్తీక దీపో త్సవ కమిటీ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్‌రెడ్డి సహ కారంతో ఈ కార్యక్రమం జరిగింది. ఉదయం 6 గంటలకు గోపూజతో ప్రారంభమైన వేడుకలు చిరుజల్లులు మధ్య జరిగింది. రామలింగస్వామికి పాలభిషేకాలు, అర్చనలు జరిగాయి. వేదగిరి ఫణిశర్మ ఆధ్వర్యంలో గణపతి, వరాహ, రుద్రహోమం, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు జరిగాయి. శివ కేశవ, కార్తీక దామోదర్, భూదేవి వరాహ స్వామిలకు సామూహిక కళ్యాణం నయనానందకరంగా జరిగింది. సాయంత్రం జడివాన లోనూ కార్తీక దీపా శోభాయాత్ర ప్రారంభమైంది. అనంతరం జ్వాలా దీపం, ఆకాశ దీపా లు ప్రజ్వలనలు జరిగాయి. ప్రముఖులు చంద్రదర్శనం చేసుకున్నారు. హరిద్వార్

- మిగతా 6లో



నెల్లూరు : గణేష్ ఘాట్‌లో గంగా హారతి ఇస్తున్న పురోహితులు, పాల్గొన్న భక్తులు



సంగం : సంగమేశ్వరుడి ఆలయంలో పూలాకృతి



శివాలయంలో ఆకాశ దీపం వెలిగిస్తూ..





చేజర్ల : పెన్నానదిలో స్నాన మాచరిస్తున్న భక్తులు



నెల్లూరు : రాజరాజేశ్వరి ఆలయంలో సామూహిక సత్యనారాయణవ్రతం



ఉలవపాడు : అలగాయపాలెం తీరంలో భక్తుల పూజలు



కావలి : శివాలయంలో నంది వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



బుచ్చిరెడ్డిపాలెం : జొన్నవాడలో స్వామిఅమ్మవార్ల గ్రామోత్సవం ముందు జ్వాలాతోరణం



కందుకూరు పట్టణంలో దీపాల వరుస

పనుల్లో నాణ్యత తగ్గితే చర్యలు

- ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖకుమార్



నెల్లూరు (జడ్పీ), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఈ పథకం డైరెక్టర్ షణ్ముఖకుమార్ హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో జాతీయ ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా రూ.67.29 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. వచ్చే నెల 31వ తేదీకల్లా ఈ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో ఎక్కడైనా నాణ్యత లోపిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధి హామీ, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో పనులన్నీ నాణ్యతగా జరిగే శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ గంగాభవాని, పంచాయతీ రాజ్, ఇతర శాఖల తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు నిధుల వెల్లువ

- మొన్న ఉపాధి హామీ నిధులతో 'పల్లె పండుగ'
- రూ.80 కోట్లతో అభివృద్ధికి శ్రీకారం
- తాజాగా ఆర్థిక సంఘం నుంచి రూ. 35 కోట్ల మంజూరు

నెల్లూరు (జడ్పీ), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి నిధులు వెల్లువలా వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాల అభి వృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల నిధులను స్థానిక అభివృద్ధికే వినియోగిం చేలా చర్యలు తీసుకుంది. ఇటీవల 'పల్లె పండుగ' పేరుతో సుమారు రూ.80 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టగా తాజాగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.35 కోట్లు జిల్లాకు మంజూరయ్యాయి. గత వైసీపీ హయాంలో గ్రామాల నిధులను దారి మళ్లించడంతో పల్లెలు అభివృద్ధికి దూరమయ్యా యి. 'మా నిధులు మాకు ఇవ్వండి మహాప్రభో..' అని సర్పంచులు మొత్తుకున్న అప్పటి పాలకులు పట్టించుకోలేదు. అయితే, ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో పల్లెల దశ మారుతోంది. రాజ్యాంగం ప్రకారం స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులను ఆ సంస్థల ఖాతాలలోనే జమచేసి గ్రామాలు అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారు. రెండు నెలల క్రితం పల్లె పండుగ పేరుతో గ్రామాలకు జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.80 కోట్ల మేర వినియోగించి అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యేలు శ్రీకారం చుట్టారు. ఈ పనులు జరుగుతుండగానే 15వ ఆర్థిక సంఘం నిధులను మంజూరు చేస్తూ ప్రభుత్వం తాజాగా జీవో జారీ చేసింది. జిల్లాలో జనాభా ప్రాతిపదికన 2024-25వ సంవత్సరానికి టైడ్ గ్రాంట్ ద్వారా రూ.20.78 కోట్లు, అన్ టైడ్ గ్రాంట్ ద్వారా రూ.14 కోట్లు మంజూరయ్యాయి. గ్రామ పంచాయతీలకు 70 శాతం, మండల పరిషత్‌లకు 15 శాతం, జిల్లా పరిషత్‌లకు 15 శాతం చొప్పున ఈ నిధులు వినియోగించుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మంచినీరు, పారిశుధ్యం మెరుగు, వీధి దీపాలు నిర్వహణతోపాటు రోడ్లు, కాలువలు, భవన నిర్మాణాలు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, విష జ్వరాల నివారణ తదితర వాటికి వినియోగించుకోవచ్చంటూ విధి విధానాలను ప్రభుత్వం రూపొందించింది.



నీటి పన్ను చెల్లించకుంటే ఎన్నికల్లో పోటీకి అనర్హులు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నీటి పన్ను బకాయిలు ఉన్న రైతులు సాగు నీటి సంఘాల ఎన్నికల్లో పోటీకి అనర్హులని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆనంద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జలవనరులశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే రైతులు తక్షణం నీటి పన్నుల బకాయిలు చెల్లించాలని పేర్కొన్నారు.

- నేడు పోలింగ్ అధికారులకు శిక్షణ

మండలస్థాయిలో సాగునీటి సంఘాల ఎన్నికల పోలింగ్ అధికారులు, సహాయకులకు శనివారం శిక్షణ తరగతులు ఆయా మండల కేంద్రాల్లో నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులందరూ ఈ శిక్షణకు తప్పనిసరిగా హాజరు కావాలని పేర్కొన్నారు. హాజరు కాకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సిబ్బంది కొరత.. ప్రజలకు వెత!

ప్రజలకు 24 గంటలూ సేవలు అందించాల్సిన విద్యుత్ శాఖను సిబ్బంది కొరత వేధిస్తోంది. ఉన్నత స్థాయిలో ఏర్పడే ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తున్న అధికారులు క్షేత్రస్థాయిలో ఏఈలు, లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్ తదితర పోస్టుల భర్తీ విషయంలో చేతులెత్తే స్తున్నారు. దీంతో ఉన్నవారిపై పనిభారం ఎక్కువవుతోంది. దీనివల్ల వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందడం లేదు.

- విద్యుత్ శాఖలో భారీగా ఖాళీపోస్టులు
- 114 మంది ఏఈలకు ఉన్నది 78 మంది
- 331 ఏఎల్ఎంలు, 291 పోస్టుల ఖాళీ
- పూర్తిస్థాయిలో వినియోగదారులకు అందని సేవలు



ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

నెల్లూరు, (జడ్పీ), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏఈల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు ఖాళీ పోస్టులు వందల్లో ఉంటున్నాయి. ఇందులో అసిస్టెంట్ లైన్‌మెన్ పోస్టులే అధికంగా ఉంటున్నాయి. జిల్లాలో నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్, కోవూరు, కావలి, ఆత్మకూరు డివిజన్ల నుంచి విద్యుత్ శాఖ పాలన కొనసాగుతోంది. దాదాపుగా అన్ని సర్వీసులు 14 లక్షలకుపైగా ఉండగా, 290 సబ్ స్టేషన్ల ద్వారా విద్యుత్ సరఫరా కొనసాగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయానికి 9 గంటలు, గృహాలకు 24 గంటల సరఫరాను అధికారులు చేయాల్సి ఉంది. ఇందుకు సంబంధించి 114 మంది ఏఈలు విధులను నిర్వర్తించాల్సి ఉండగా 78 మంది మాత్రమే ఉన్నారు. 36 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే అసిస్టెంట్ లైన్‌మెన్‌లు 486 మందికిగాను 155 మంది మాత్రమే ఉన్నారు. 331 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక జూనియర్ లైన్‌మెన్‌లు 332 మందికిగాను 41 మంది మాత్రమే ఉన్నారు. 291 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జేఎల్ఎం గ్రేడ్-2 571 మందికిగాను 533 మంది ఉన్నారు. 38 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

- నాణ్యమైన విద్యుత్ సరఫరా ఏలా

జిల్లాలో అన్ని కేటగిరీలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు అధికారులు ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయిలో అది అమలుకావడం లేదు. చిన్న గాలులు వీచినా, అధిక ఉష్ణోగ్రతలు ఉన్నా ఆ ప్రభావానికి పరికరాలు దెబ్బతినడం, ఫీజులు ఎగిరి పోవటం, కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడటం జరుగుతోంది. సరఫరా నిలిచిపోయినప్పుడు పరికరాలను మార్చడం, ఫీజులు వేయడం, తెగిన తీగలకు మరమ్మతులు చేయడం వంటి పనులు ఏఈల పర్యవేక్షణలో కిందిస్థాయి సిబ్బంది చేయాలి. అయితే, సిబ్బంది కొరత భారీగా ఉండటంతో నాణ్యమైన సరఫరా కలగానే మారుతోంది. సిబ్బంది కొరత ఉన్న ప్రాంతాల్లో ప్రైవేటు వారితో పనులు చేయిస్తున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వీరులేని ప్రాంతాల్లో ఉన్నసిబ్బందిపైనే పనిభారం ఎక్కువవుతోంది. ఇప్పటికైనా విద్యుత్ శాఖలో ఖాళీల భర్తీకి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు.



నెల్లూరు : రమేశ్‌రెడ్డి నగర్‌లో రోడ్డుపై నీరు

రొయ్యకు రాం రాం.. ఉప్పునకు ఉబలాటం!

- జిల్లాలో పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- పెరిగిన ధరలే ఇందుకు కారణం

6

ఒకటే వాన

ముసురు వాన జిల్లాను వీడటం లేదు. నాలుగు రోజులుగా వర్షం కురుస్తుండటంతో జనజీవనానికి ఆటంకంగా మారింది. శుక్రవారం కూడా వర్షం వాన కురవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. నెల్లూరు నగరంలో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. కాలువల్లో మురుగు కదలకపోవడంతో రోడ్డుపై ప్రవహించాయి.

'ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ'గా మనుబోలు

- ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వం
- మహిళలకే అధిక ప్రాధాన్యత

- వివరాలు 6లో

'హైటెక్కు' చార్జీ.. లోటెక్కు ప్రయాణం!

- ఆర్టీసీ తీరుపై జనం గరంగరం

ఇది ఉదయగిరి నుంచి విజయవాడ మధ్య తిరిగే హైటెక్కు బస్సు. దూర ప్రయాణం కాబట్టి ఎక్కువ మంది ఈ బస్సులోనే ప్రయాణిస్తారు. అయితే, కాలం చెల్లిన ఈ బస్సు లోపలి భాగాన్ని చూసి ఆర్టీసీ యంత్రాంగంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు బోరుమనే శబ్దం, మరోవైపు తుప్పు పట్టిన తులుపులు, కిటికీలు ఎప్పుడు ఊడిపోతాయోననే భయంతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తోంది. కనీసం సీట్లు కూడా సక్రమంగా లేవు. పుష్‌బ్యాక్ సీట్ కావడంతో పూర్తి కిందకు వాలిపోతోంది. దీంతో తాళ్లు కట్టి ఉన్నారు. మరోవైపు గమ్యం చేరేలోపు మోరాయించిన సంఘటనలు ఎక్కువే ఉన్నాయి. ఆర్డినరీ కంటే అధ్వానంగా ఉన్న ఆ బస్సులో హైటెక్ చార్జీలు వసూలు చేస్తుండటంపై ప్రయాణికులు భగ్గుమంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దూరప్రయాణాలకు కొత్త బస్సులు ఏర్పాటు చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

- వరికుంటపాడు (ఆంధ్రజ్యోతి)



కాలం చెల్లిన హైటెక్ బస్సు


సీటు పూర్తిగా వాలి పోకుండా తాడు కట్టి..



అరె.. ఏంతపేద్ద రంధ్రమో!?


తుప్పు పట్టిన అత్యవసర ద్వారం

నాటి నేతలను మరిచారా!?

నగరంలోని స్వర్ణాల చెరువు తీరాన నెక్లెస్‌రోడ్డులో శుక్రవారం రాత్రి లక్ష దీపోత్సవ కార్యక్రమం వేడుకగా సాగింది. ఇందుకు రెండువారాల నుంచే భారీ ఏర్పాట్లు చేశారు. అయితే, రోడ్డుపై ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు విగ్రహాన్ని మాత్రం నిర్వాహకులు గాలికి వదిలేశారు. కనీసం విగ్రహాన్ని శుభ్రం చేసిన దాఖలాలు లేవు. ఇదొక్కటేకాదు.. తిక్కన సోమయాజి, అమరజీవి పొట్టిశ్రీరాములు, గౌతమ బుద్ధ విగ్రహాలనూ పట్టించుకున్న దాఖలాలు లేవు. దీపోత్సవం సందర్భంగా విగ్రహాలను శుభ్రం చేసి, పూల దండలు వేయాలన్న ఆలోచన కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులకు రాకపోవడం శోచనీయం.

- నెల్లూరు (సాంస్కృతికం)



రేపు ఏసీ స్టేడియంలో వెటరన్ అథ్లెటిక్స్ ఎంపికలు

నెల్లూరు(విద్య), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీన నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వెటరన్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇ.భాస్కర్‌రెడ్డి, డి.బసవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 30 నుంచి 80 ఏళ్ల వయసు కలిగిన స్త్రీ, పురుషులకు జరిగే ఈ ఎంపికల్లో 100, 200, 400, 800, 1500, 5వేల మీటర్ల పరుగు పందెం, హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, హేమర్‌త్రో, 5కి.మీల నడక పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోటీల్లో ప్రతిభ చూపి ఎంపికైన క్రీడాకారులు కృష్ణా జిల్లా గుడివాడలో డిసెంబర్ 14, 15వ తేదీల్లో జరిగే 44వ రాష్ట్రస్థాయి వెటరన్ అథ్లెటిక్స్‌కు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు సంబంధిత తేదీలో ఉదయం 10 గంటలకు ఎంపికలకు హాజరు కావాలని తెలిపారు.


స్వర్ణాలచెరువులో శివలింగం వద్ద పడవలతో భక్తులు

శివం.. శంకరం

(5వ పేజీ తరువాయి)

నుంచి వచ్చిన పురోహితులచే కాశీ ఘాట్ తలపించేలా గంగా హారతుల కార్యక్రమం కనుల పండువగా జరిగింది. అనంతరం వేలాది మంది పాల్గొని స్వర్ణాల చెరువులో కార్తీక దీపాలు వదిలారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డిలు ఏర్పాటు చేసిన 108 పడవల శివలింగ ఆకృతి భక్తులను పులకింపచేసింది. దేవదాయ ధర్మాదాయ శాఖకు చెందిన 10 దేవాలయాల నుంచి రకరకాల రుచుల్లో ప్రసాదాలు భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో శక్తిపీఠం పీఠాధిపతురాలు రమ్యానంద భారతీదేవి, స్వర్ణభారత్ ట్రస్ట్ ఎండీ దీపావెంకట్, డీఆర్‌డీఏ చైర్మన్ సతీష్‌రెడ్డి, కార్తీక లక్ష దీపోత్సవ కమిటీ నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు రూరల్ : వేదగిరి క్షేత్రంపై గరుడ వాహనంపై వేదగిరీశుడు


సంగం : సంగమేశ్వరుడితో గిరి ప్రదర్శనకు బయలుదేరిన భక్తులు


సీతారామపురం : భైరవకోనలో త్రిముఖ దుర్గాదేవి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు


ఉదయగిరి రూరల్ : నర్రవాడలో దీపాలు వెలిగిస్తూ..



మార్పు — రొయ్యకు రాం రాం.. ఉప్పునకు ఉబలాటం!

తీరప్రాంతంలో ఉప్పు సాగు విస్తీర్ణం యేటా పెరుగుతోంది. ఆశించిన స్థాయిలో ఆక్వాసాగు లేకపోవడంతో గుంటలు ఉప్పు పండించే కయ్యలుగా మారిపోతున్నాయి. ఇందుకు డిమాండ్‌కు తగ్గట్టు ఉప్పునకు ఉన్న ధరే కారణమని సాగుదారులు చెబుతున్నారు. దీంతో ఒకప్పుడు 10 వేల ఎకరాల్లోపు ఉన్న ఉప్పు ఉత్పత్తి విస్తీర్ణం నేడు 45 వేల ఎకరాలకు చేరిపోయింది.

- జిల్లాలో పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- పెరిగిన ధరలే ఇందుకు కారణం
- కయ్యలుగా మారుతున్న గుంటలు

అల్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు ఉప్పు ఉత్పత్తిపై ఆధారపడి జీవించిన కుటుంబాలు లక్షల్లో ఉండటంతో రొయ్యల సాగు కంపెనీలు సాగుదారుల నుంచి భూములు సేకరించుకోవడంతో ఉప్పు ఉత్పత్తి విస్తీర్ణం తగ్గుముఖం పట్టింది. రెండు దశాబ్దాలపాటు రొయ్యల పెంపకంపై భారీగా పెట్టుబడులు పెట్టి కొంత మంది రైతులు వైరస్, మార్కెట్ సదుపాయం లేక భారీగా నష్టపోయారు. తీవ్ర నష్టాలను మిగిల్చిన రొయ్యల సాగు అంటేనే రైతులు బెంబేలెత్తిపోయారు. నష్టాలను భరించలేక గుంతలను కొంతమందికి లీజుకు ఇచ్చి కాలం వెళ్లదీశారు.

● పెరిగిన ధరలే కారణం

ఆక్వా రంగం కుదేలయినా ఉప్పు ఉత్పత్తి మాత్రం రైతుల్లో ఆశలు చిగురించేలా చేసింది. గతంలో క్వింటం ఉప్పు ధర కేవలం రూ.70 నుంచి 100 వరకు ఉండేది. అయితే, మూడేళ్లుగా క్వింటం రూ.450 వరకు పలికి చివరకు రూ.250 స్థిరత్వాన్ని పొందింది. గతంతో పోల్చితే ఈ ధరలు ఆశాజనకమే అని చెప్పాలి. ఈవిధంగా ధరలు రూ270 నుంచి 300 వరకు పలుకుతుండటంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. రొయ్యల గుంటలను ఉప్పు కయ్యలుగా మార్చి ఉప్పు ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు.

● తమిళనాడు తర్వాత ఆంధ్రాలోనే

ఉప్పు ఉత్పత్తి దేశంలో తమిళనాడు తరువాత ఆంధ్రప్రదేశ్‌కే ఆ స్థానం దక్కింది. ఉప్పు ఉత్పత్తితో గుజరాత్ కూడా గతంలో ప్రత్యేక స్థానం దక్కించుకుంది. అయితే, ఉప్పు భూములను ఇతర రంగాలకు వినియోగించుకునే పరిస్థితి ఏర్పడటంతో అక్కడా ఉప్పు ఉత్పత్తి తగ్గుముఖం పట్టింది. ఇప్పుడు ఆంధ్రాలో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. జిల్లాలో ప్రస్తుతం 45వేల ఎకరాలకుపైగా ఉప్పు ఉత్పత్తి జరుగుతుండగా, ఇది మరింత పెరిగే అవకాశం ఉంది.


ఉప్పు కయ్యలుగా మారిన రొయ్యల గుంటలు

పూర్వవైభోగం వస్తుంది

ఉప్పు రైతుల జీవితాల్లో వెలుగులు నిండాలని, పూర్వ వైభోగం రావాలని కోరుకుంటున్నాం. ధరలు ఆశాజనకంగా ఉంటే ఉప్పు ఉత్పత్తికి వెనుకాడం. ఎంత కష్టమైనా ఉప్పు ఉత్పత్తికే మొగ్గు చూపుతాం. రొయ్యల సాగు పెద్దగా గిట్టుబాటు కాకపోవడంతో గుంటలను ఉప్పు కయ్యలుగా మార్చుకున్నాం.

- పురిణి ఏడుకొండలు, తూర్పు గోగులపల్లి



భరోసా కల్పించే దిక్కు లేదు

ఉప్పు రైతులకు భరోసా కల్పించే దిక్కు లేకుండా పోయింది. దీంతో మూడు దశాబ్దాలుగా ఉప్పు ఉత్పత్తి రంగం పుంజుకోలేదు. ఇటీవల పెరిగిన ధరలు మళ్లీ తగ్గుతున్నాయి. కానీ గత ధరలతో పోల్చితే ఇప్పుడు ఒక రకంగా మేలనే చెప్పాలి. రొయ్యల సాగుతో నష్టాల్లో పడిపోయిన మేము ఉప్పునే నమ్ముకొని జీవించే పరిస్థితికి వచ్చాం. మౌలిక వసతులు కల్పించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటే ఉప్పు రైతుకు వెన్నుదన్నుగా ఉంటుంది.

- గోళ్ల ఆదాం, తూర్పు గోగులపల్లి




ఉప్పు ఉత్పత్తికి అనుకూలంగా గుంటల భూములు

అయ్యప్ప ఆలయంలో ధ్వజారోహణం

- భక్తిశ్రద్ధలతో పడిపూజ

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరం వేదాయపాలెంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రారంభమైన మండల పూజలో భాగంగా మొదటి రోజు శుక్రవారం ధ్వజారోహణం, పడిపూజ భక్తిశ్రద్ధలతో జరిగింది. పడి పూజా కార్యక్రమానికి పిడూరు కిషోర్‌రెడ్డి, శరణ్యమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప దేవస్థానం అధ్యక్షుడు గూడల శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కత్తి మోహన్‌రావు, కేజీ శంకర్, రమణయ్యలు, అయ్యప్ప భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ధ్వజారోహణం చేస్తున్న పండితులు



42 సవర్ల బంగారు ఆభరణాల చోరీ

నెల్లూరు(క్రైం), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని 42 సవర్ల బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన ఘటన గుర్రాల మడుగు సంఘంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నగరంలోని కొత్తూరు అంబాపురంలోని పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న విజయకుమారి గుర్రాలమడుగు సంఘంలో నివాసం ఉంటున్నారు. ఆమెకు పక్కపక్కనే రెండు ఇళ్లు ఉండగా రెండింటిని వాడుకుంటున్నారు. ఈ క్రమంలో ఒక ఇంట్లో గుర్తుతెలియని దుండగులు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాను పగులగొట్టి అందులో ఉన్న బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించిన ఆమె ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని నగలు కన్పించలేదు. దీంతో బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కె సాంబశివరావు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'రాళ్లపాడు'కు చేరిన సోమశిల జలాలు

లింగసముద్రం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సోమశిల ప్రాజెక్టు జలాలు రాళ్లపాడు ప్రాజెక్టులోకి చేరాయి. గురువారం సాయంత్రం నుండి కొండాపురం మండలంలోని మర్రిగుంట చెరువు నుండి 3కి.మీ దూరంలో రాళ్లపాడు ప్రాజెక్టు ఎగువన ఉన్న మన్నేరులో కలిసి అక్కడి నుండి ప్రాజెక్టులోకి వస్తున్నాయి. ప్రాజెక్టులో 17 అడుగుల నీటిమట్టం ఉండగా ప్రస్తుతం 17.3 అడుగుల నీటిమట్టానికి చేరినట్లు డ్యాం అధికారులు తెలిపారు.

'ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ'గా మనుబోలు

- ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వం
- మహిళలకే అధిక ప్రాధాన్యత

మనుబోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మనుబోలు పంచాయతీ ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ పథకానికి ఎంపికైంది. 'ఉమెన్ ఫ్రెండ్లీ'నా అదేంటి!?. ఇంతకుముందు ఎప్పుడూ వినలేదు కదా. అన్న అనుమానం మీకు రావొచ్చు. దశాబ్ద కాలం క్రితం కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఈ కొత్త పథకాన్ని ప్రవేశపెట్టి, అమలులో చేస్తోంది. ఇప్పటివరకు ఉత్తర భారత రాష్ట్రాల్లో మాత్రమే ఈ పథకాన్ని అమలు చేసేవారు. ఈ ఏడాది నుంచి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో జిల్లాకో పంచాయతీని ఈ పథకం కిందకు ఎంపిక చేసింది. ఇందులో భాగంగానే జిల్లాలో మనుబోలు పంచాయతీని ఎంపిక చేయగా, త్వరలో కేంద్ర బృందం మనుబోలును సందర్శించనుంది.

● ప్రయోజనాలు..

మహిళలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తే ఆర్థిక పురోగతిలో ముందుంటారని ఊహించిన కేంద్ర ప్రభుత్వం ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా మనుబోలు పంచాయతీకి పలు ప్రయోజనాలు కలగనున్నాయి. పంచాయతీలో మహిళల భాగస్వామ్యం 50 శాతంపైగా ఉండాలి. సర్పంచు మొదలు అధికారుల వరకు చాలా మంది మహిళలే ఉండాలి. జనాభాలోనూ 50 శాతం పైనే మహిళలు ఉండాలి. అలాగే సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు అమలు చేస్తున్న 9 అంశాల్లో మనుబోలు పంచాయతీకే ప్రాధాన్యత ఇస్తారు.

పంచాయతీ గణాంకాలు	
పురుషులు	: 4758
మహిళలు	: 5080
ఇళ్లు	: 3217
పంచాయతీ జనాభా	: 9838
అక్షరాస్యత శాతం	: 67.15
స్వయం సహాయక సంఘాలు	: 174
పొదుపు మహిళల సంఖ్య	: 1752


మనుబోలు గ్రామ వ్యూ

● ఉపయోగాలు ఇవి..

మహిళలకు విద్య, వైద్యం, స్వయం ఉపాధి అమలు ప్రాధాన్యత ఇస్తారు. ఇళ్ల నుంచి చెత్త సేకరణ, ఘన వ్యర్థాల నిర్వహణ, జల్‌జీవన్ మిషన్ సమర్థ వినియోగం, అంగన్ వాడీ కేంద్రాలకు విధిగా పిల్లలను పంపడం, ఉపాధి హామీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవడం, ఆర్థిక సం ఘం నిధులు గ్రామాభివృద్ధికి నిర్వహించుకోవడం, శిశుమర ణాలతోపాటు బాల్యవివాహాల నియంత్రణకు చర్యలు వంటి ఉపయోగాలు ఈ పథకం ద్వారా మనుబోలుకు లభిస్తాయి.

చాలా లాభాలు ఉన్నాయి

ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ పథకం వల్ల చాలా లాభాలు ఉంటాయి. ఇందుకు సంబందించి మార్గదర్శకాలు వచ్చాయి. అయితే కేంద్రబృందం వస్తేగాని ఎలాంటి ప్రయోజనాలు ఇవ్వనున్నారో తెలుస్తుంది. పంచాయతీకి అదనంగా పథకాలు మంజూరు చేసే అవకాశాలు ఉండవచ్చు. త్వరలోనే పూర్తి వివరాలు తెలుపుతాం.

- శ్రీధర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి



న్యూస్ బాక్స్

టీడీపీ సభ్యత్వ నమోదు

వలేటివారిపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చుండిలో శుక్రవారం నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కామినేని అశోక్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు కామినేని అశోక్, మేకల అశోక్, పాలెబోయిన శ్రీనివాసులు, కామినేని రాజేష్ పాల్గొన్నారు.

శనగ సాగుపై అవగాహన

వలేటివారిపాలెం, నవంబరు 15: ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం నిర్దేశించిన సాంకేతిక సలహాలతో రైతులు శనగపంటను సాగు చేయాలని కందుకూరు వ్యవసాయ సహాయ సంచాలకురాలు అనసూయ తెలిపారు. శాఖవరంలో శుక్రవారం రైతులకు మేలైన వ్యవసాయ సాగు పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఓ హేమంత్ భరత్‌కుమార్, గౌతమి పాల్గొన్నారు.

తీరంలో పటిష్ట బందోబస్తు

కావలి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తుమ్మలపెంట, కొత్తసత్రం సముద్రతీరంలో మెరైన్ సీఐ దాసరి ప్రసాద్, ఎస్‌ఐ కిషోర్ బాబు, రూరల్ ఎస్‌ఐ తిరుమలరెడ్డి పర్యవేక్షణలో శుక్రవారం పటిష్ట బందోబస్తు నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా సముద్రస్నానానికి, పూజలకు వచ్చే భక్తులకు ప్రమాదాలు జరుగకుండా అప్రమత్తం చేశారు. కార్యక్రమంలో మెరైన్ ఏఎస్‌ఐ లక్ష్మీనారాయణ, రూరల్ పోలీసులు ఉన్నారు.

దాతల ఔదార్యం

కొండాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొమ్మి పంచాయతీ రామానుజపురం దివ్యాంగురాలు పరుచూరు భూలక్ష్మమ్మకు హ్యాపీ సేవా సంస్థ సభ్యులు శుక్రవారం రూ.5వేలు, 25 కేజీల బియ్యంతో పాటు నూతన దుస్తులు అందజేశారు. వింజమూరు ఎంపీడీవో కె.శ్రీనివాసులు రెడ్డి కుమారుడు గౌతమ్ నిహాన్ పుట్టినరోజు సందర్భంగా హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షుడు ఘణీ బాషాను ఎంపీడీఓ సంప్రదించారు. ఆయన సూచనల మేరకు దాత శ్రీనివాసులు రెడ్డి దంపతులతో పాటు కుమారుడు గౌతమ్ నిహాన్‌లు భూలక్ష్మమ్మకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సర్వే పరిశీలన

ఆత్మకూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ శుక్రవారం కరటంపాడు పంచాయతీ సాతానుపల్లిలో జరుగున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సర్వే సిబ్బందితో మాట్లాడారు. అక్షరాస్యత సర్వే, ప్రభుత్వం పథకాల నగదు జమ చేసేందుకు ఎన్‌పీసీఐ ద్వారా బ్యాంకు లింకింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

వారోత్సవాల ప్రారంభం

వింజమూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సహకారశాఖ కార్యాలయంలో శుక్రవారం 71వ సహకార వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావలి డివిజన్ అధికారి యలమందయ్య విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ సహకార వారోత్సవాలు ఈనెల 20వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉదయగిరి డివిజన్ అధికారి శ్రీనివాసులు, సీహెచ్.రమేష్‌బాబు, వింజమూరు బ్రాంచ్ మేనేజర్ ఏ.రామనారాయణ, సురేందర్‌రెడ్డి, సీఈవో మేకల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వంద ఉత్తీర్ణత సాధించాలి

వలేటివారిపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాదిలో కూడా 10వ తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని కందుకూరు డిప్యూటీ డీఈఓ జానకిరామ్ తెలిపారు. శాఖవరం హైస్కూల్‌ను శుక్రవారం డిప్యూటీ డీఈఓ జానకిరాం తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 మల్లికార్జునరావు, ప్రధానోపాధ్యాయులు చిన్నయ్య పాల్గొన్నారు.

నేలకొరిగిన వరిపైరు పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఉదయగిరి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు మండలంలోని గంగిరెడ్డిపల్లిలో నేలకొరిగిన వరి పైరును మండల వ్యవసాయాధికారి అంజనేయులనాయక్ పరిశీలించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'వదలని వాన.. నేలకొరిగిన వరి' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆయన గ్రామానికి చేరుకొని నేలకొరిగిన వరి పైరును పరిశీలించి రైతులకు సలహాలు ఇచ్చారు. ఉదయగిరి సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను గ్రామ వ్యవసాయ సహాయకులు సేకరించి నివేదిక అందజేస్తారన్నారు. పరిహారం కోసం ఆ నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో రాజశేఖరరెడ్డి, వీఏఏలు పాల్గొన్నారు.

- భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి
- దీపాలు వెలిగించిన మహిళలు
- కిటకిటలాడిన ఆలయాలు



వరికుంటపాడులో పూజలు



అల్లూరు : పడిపూజ నిర్వహిస్తున్న భక్తులు



ఆత్మకూరు: కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీక మాసంలో.. పరమేశ్వరుడి సన్నిధిలో..

కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం కావలి, కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని గ్రామాల ప్రజలు వేకువజామునుంచే నదులు, సముద్రంలో స్నానాలు చేసి పరమశివుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తుల సందడితో ఆలయాల్లో కార్తీకశోభ సంతరించుకుంది.



సంగం: హోమంలో పూర్ణాహుతి వేస్తున్న పీఠాధిపతి, భక్తులు

కావలి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతూరు శివాలయంలో వేలమంది భక్తులు పాల్గొని శివదర్శనం చేసుకుని పూజలు నిర్వహించారు. వెంగళరావునగర్ శివాలయం, ముసునూరు శివాలయం, హనుమత్‌క్షేత్రం, సాయిక్షేత్రంలో భక్తులు దీపాలు వెలిగించారు.

- కావలి రూరల్, నవంబరు 15: తుమ్మలపెంట, కొత్తసత్రం శివాలయాలు భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.
- వలేటివారిపాలెం: మండలకేంద్రంతో పాటు కళ్లవళ్ల, పోకూరు, కొండసముద్రం, రోళ్ల పాడు భక్తులు శివాలయాలకు వెళ్లి దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఉపవాసాలు ఉండి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు పులిహోర ప్రసాదం పెట్టారు. దాతలు అన్నదానం చేశారు.
- అల్లూరు: స్థానిక శివాలయం, నార్తుమోపూరు, ఇస్కపల్లి శివాలయాల్లో భక్తులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అల్లూరుపేట సాయినాథుని ఆలయంలో అయ్యప్పస్వామికి పడి పూజ కార్యక్రమాన్ని చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన సంతర్పణం గావించారు.
- చేజర్ల: కోటితీర్థం కోటీశ్వరాలయం తెల్లవారుజాము నుండే భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుండి వచ్చిన భక్తులు సమీపంలోని పెన్నానదిలో స్నానమాచరించి కార్తీక దీపాలు వెలింగిచారు. అనంతరం కామాక్షిదేవి సమేత కోటీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. చిత్తలూరు వీరభద్రస్వామికి, చేజర్ల, కాకివాయి, టికేపాడు ఆలయాల్లో వేడుకలను నిర్వహించారు. చిత్తలూరులో భక్తులకు అన్నదానం చేశారు.
- ఆత్మకూరు: స్థానిక వెంకటేశ్వరస్వామి, కన్యకాపరమేశ్వరి, అలఘునాథస్వామి, కాశినాయనాశ్రమంలోని ఆలయాల్లో సాయంత్రం మహిళలు దీపాలు వెలిగించారు. .
- అనంతసాగరం: సోమశిల సోమేశ్వరుని ఆలయంలో భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆత్మకూరు సాంబ శివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కంచి పరమేశ్వర్‌రెడ్డి భక్తులకు అన్న దానం ఏర్పాటు చేశారు. ఆయనకు ఆలయ ధర్మకర్త ఉప్పల విజయ్‌కుమార్, అర్చకులు రామకృష్ణశర్మకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కుడుముల సుదాకర్‌రెడ్డి, జంజం నారాయణ పాల్గొన్నారు.

లలిత రుద్ర యజ్ఞ పూర్ణాహుతి

సంగం: స్థానిక తిరుమనకొండ రాజరాజేశ్వరి దేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి జ్ఞానపీఠంలో పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో లోకకల్యాణం, విశ్వశాంతి, ధర్మ సంస్థాపనార్థం 44రోజులు భక్తిశ్రద్ధలతో ఈ మహాయజ్ఞం నిర్వహించారు. చివరిరోజు అభిషేకాలు, ప్రత్యేక పూజలు, కార్తీక కోటి దీపోత్సవం వెలిగించి హోమంలో పూర్ణాహుతి వేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, తహసీల్దారు సోమ్లా నాయక్, బీమేశ్వరాలయం చైర్మన్ రఘురామయ్య పాల్గొన్నారు. స్థానిక సంగమేశ్వరాలయంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. మధ్యాహ్నం సంగమేశ్వరస్వామిని పులివాహనంపై ఉంచి గిరిప్రదర్శన నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో పుష్ప జ్యోతిర్లింగాహారం ఏర్పాటు చేసి కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. సంగమేశ్వరుడిని విద్యుత్ ఎస్‌ఈ విజయన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కార్తీక దీపం వెలిగించారు. ఆలయ పూజారి గోపాలకృష్ణమూర్తి ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఏఈ మన్మధరావు, సిబ్బంది ఉన్నారు.

- ఏఎస్ పేట: రాజవోలు కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామికి పూజలకు కొండా శ్రీనివాసరెడ్డి దంపతులు, తిక్కవరపు శ్యాంప్రసాద్ దంపతులు దూపదీప నైవేద్యాలకు కావలసిన ఏర్పాట్లు చేసి నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చిట్టమూరి వెంకటరెడ్డి తెలిపారు.
- లింగసముద్రం: వాకమళ్లవారిపాలెం శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పూజల్లో లింగసముద్రం, జంపాలవారిపాలెం, పెంట్రాల, వాకమళ్లవారి పాలెం మహిళలు దీపాలు వెలిగించారు.
- బిట్రగుంట: కోవూరుపల్లి పోలేరమ్మకు భవానీ మాలధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నేత నాటకరాణి భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూలంగిసేవలో ఉభయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో గురుస్వాములు ఆద్దెయ్యగురుస్వామి, సూర్యనారాయణ గురుస్వామి, దుర్గేశ్వరగురుస్వామి ఉన్నారు.
- కందుకూరు: స్కంధపురి సోమేశ్వరాలయం, జనార్దన స్వామి, అయ్యప్ప ఆలయాలతో పాటు గ్రామదేవత అంకమ్మ తల్లి ఆలయాల్లో భక్తులు కుటుంబసమేతంగా పూజలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించి ఉపవాసాలు ఉన్నారు. అంకమ్మ ఆలయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. రాత్రికి అంకమ్మ ఆలయంలో దీపాలు వెలిగించారు.
- వింజమూరు: స్థానిక పోస్టాఫీసు వీధిలోని అయ్యప్పస్వామి ఆలయంలో శివుడికి అన్నాభిషేకం నిర్వహించారు. శివపార్వతులకు ఉత్సవం నిర్వహించి ఆకాశదీపాన్ని వెలిగించారు. అయ్యప్ప స్వామికి పుష్పాభిషేకం నిర్వహించారు. స్థానిక శివాలయంలో భక్తులు దీపాలు వెలిగించారు.
- సీతారామపురం: ఘటిక సిద్దేశ్వరం, భైరవకోన, సీతారామపురంలోని శివాలయాల్లో పూజలు నిర్వహించారు. భైరవకోనలోని సొనవాన జలపాతంలో తెల్లవారుజాము నుంచే భక్తులు స్నానాలు చేసి, కార్తీక దీపాలు వెలిగించి భైరవ దుర్గాంబ భర్గులేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. అర్చకులు శివుడికి ప్రత్యేక రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. భక్తులు స్వామి వారికి ఇష్టమైన బిల్వపత్రాలు, నాగలింగపు పూలతో పూజల్లో పాల్గొన్నారు.
- వరికుంటపాడు: వరికుంటపాడు, కాకొల్లువారిపల్లి, కాంచెరువు, గణేశ్వరాపురం, పెద్దిరెడ్డిపల్లి ఆలయాల్లో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు గోత్రనామాలతో పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామివార్లకు గ్రామోత్సవం చేపట్టారు.
- దుత్తలూరు (ఉదయగిరి రూరల్): నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయంలో లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణలతో కల్యాణోత్సవాన్ని చేపట్టారు. అనంతరం పల్లకీసేవ, శమివృక్షం కింద పార్వతీపరమేశ్వరులకు పూజలు చేపట్టారు. దొడ్డకొండపై వెంగమాంబకు అఖండ దీపోత్సవం నిర్వహించారు. దుత్తలూరు కొండపై ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేపట్టారు. గడ్డంవారిపల్లి అడవిపేరంటాలమ్మ ఆలయం, గండిపాళెం శ్రీసిద్ధేశ్వర స్వామి, కాశినాయనగడ్డ, అప్పసముద్రం, లింగాలదొనక్షేత్రం, జీ.అయ్యవారిపల్లి, ఆర్లపడియ శివాలయాల్లో స్వామివార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అలంకరణలు చేపట్టారు. పలుచోట్ల అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘనంగా ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి జన్మదినం

- ఏరియా వైద్యశాలలో మెగా రక్తదాన శిబిరం
- గ్రామాల్లో వేడుకల నిర్వహణ



కావలిలో రక్తదానం చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కావలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కావలిలో ఘనంగా నిర్వహించారు. ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ, టీడీపీ పట్టణశాఖ ఆధ్వర్యంలో ఏరియా వైద్యశాలలో మెగా రక్తదాన శిబిరంను నిర్వహించారు. నేతలు, కార్యకర్తలు, అభిమానులు 102మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అలాగే ఐకాన్ సెల్ఫీ పాయింట్ వద్ద జన్మదిన కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో నేతలు గుత్తికొండ క్రిషోర్, జ్యోతి బాబూరావు, దగుమాటి మాల్యాద్రి రెడ్డి, మధుబాబు నాయుడు, పోట్లూరు శ్రీనివాసులు, బొట్లగుంట శ్రీహరినాయుడు, తటవర్తి రమేష్, తటవర్తి వాసు, తిరువీధి ప్రసాద్, నాయుడు రాంప్రసాద్ ఏరియా వైద్యశాల ఆర్‌ఎంవో ప్రమీల, బెజవాడ రవికుమార్, చవల రామకృష్ణ యేటూరు శివ, ఉన్నారు. పట్టణంలోని 10వ వార్డులో మేడికొండ సుకుమార్, యల్లంటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. తలమంచి రవి, పూనూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జవంగుల మల్లికార్జున్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

జనసేన నేత సిద్దూ ఆధ్వర్యంలో బుడంగుంట, కరెంట్‌ఆఫీస్ ప్రాంతం, చెంచుగాని పాలెం ఎస్టీ కాలనీల పేదలకు సరుకులు పంపిణీ చేశారు.



బిట్రగుంట: దుప్పట్లు పంపిణీ చేస్తున్న నేతలు



అల్లూరు: కేక్ కట్ చేస్తున్న నాయకులు

- బిట్రగుంట: స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. అనంతరం బోగిరి ప్రభాకర్ అందజేసిన భోజన ప్యాకెట్లను విశ్వనాథ రావు పేట పంచాయతీ రామస్వామి పాలెం గిరిజన కాలనీవాసులకు పంపిణీ చేశారు. ముంగమూరు భవానీ ఎడ్యు కేషనల్ సొసైటీలోని పేదలకు కడనూతల కావ్యా యువదళం సభ్యుల ఆధ్వర్యంలో మాలేపాటి భోజన పొట్లాలను పంపిణీ చేశారు. బోగోలు టీడీపీ ఇన్‌చార్జి చిలకపాటి వెంకటేశ్వర్లు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో బీజేపీ మండల కన్వీనర్ ఎస్ఎస్ యాదవ్, టీడీపీ నేతలు యర్రం వెంకటేశ్వర్లురెడ్డి, గనిపినేని నాగరాజు, పార్వతి ఉన్నారు.

అల్లూరు: ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణచైతన్య, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, మేడా శ్రీనివాసులు రెడ్డి, యరటపల్లి శేఖర్‌రెడ్డి, పరంధామరెడ్డి, బిట్రగుంట చైతన్య, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, ఎండేటి హరికృష్ణ, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పట్ల వైసీపీ నిర్లక్ష్యం : కాకర్ల

వింజమూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యం వహించి, కక్షపూరిత ధోరణిలో వ్యవహరించిందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో శుక్రవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ వైసీపీ విద్యా వ్యవస్థలో అనేక మార్పులు చేసి, జీవో 117ను తీసుకుని వచ్చి విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిందన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను అభ్యర్థించారు. లోకేష్ స్పందిస్తూ గత ప్రభుత్వంపై వ్యతిరేక గళాన్ని వినిపించి, వారి హక్కుల కోసం పోరాడి మార్పునకు నాంది పలికింది ఉపాధ్యాయులేనని, వారికి ఈ ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తుందన్నారు.

కాకర్లకు అభినందనలు

ఉదయగిరి రూరల్, నవంబరు 15: ఉపాధ్యాయుల సమస్యలను శాసనసభలో ప్రస్తావించి, వాటి పరిష్కారం కోసం విద్యాశాఖ మంత్రి లోకేష్‌బాబు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు ఏపీ టీఏఫ్ నాయకులు షేక్ ఎండీ ఖాజా, ఓంకారం శ్రీనివాసరాజు ప్రకటనలో అభినందనలు తెలిపారు.

21 మంచి నీటి ప్లాంట్లు మంజూరు: కలెక్టరు ఆనంద్

మర్రిపాడు, నవంబరు (ఆంధ్రజ్యోతి) 15: నియోజకవర్గానికి 21చోట్ల మంచినీటి ప్లాంట్లను మంజూరు చేస్తున్నట్లు కలెక్టరు ఓ.ఆనంద్‌రావు తెలిపారు. ఖాన్‌సాహెబ్ పేటలోని దర్గా ఆవరణంలో నూతనంగా ఏర్పాటు చేసిన మంచినీటి ప్లాంట్‌ను శుక్రవారం కేంద్ర రక్షణ శాఖమంత్రి సలహాదారులు గుండ్ర సతీష్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కందుకూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువుల దుకాణాలు, విత్తనాల డీలర్ల దుకాణాలను శుక్రవారం మండల వ్యవసాయాధికారి వి.రాముతో కలిసి కావలి ఏడీఏ సీహెచ్ నాగరాజు పరిశీలించారు. ప్రైవేటు ఎరువుల వ్యాపారులు ఎంఆర్‌పీలకు మించి రైతుల వద్ద వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలక్ట్రానిక్ మిషన్ల ద్వారా ఎరువుల నిల్వ వివరాలు, గోదాముల నిల్వ ఉన్న ఎరువులను పరిశీలించారు. స్టాకులలో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం వారు విత్తన దుకాణాలను తనిఖీలు చేసి లైసెన్సు ఉన్న కంపెనీల విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు.

పుస్తక పఠనంతో ఉన్నత ఆలోచనలు

సంగం, నవంబరు 15: సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న వారంతా పుస్తక పఠనంతోనే ఉన్నత ఆలోచనలు వచ్చి ఉన్నత స్థాయికి చేరారని నేతాజీ జూనియర్ కాలేజి కరస్పాండెంట్ మదార్ బాషా తెలిపారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంల్లో పుస్తక ప్రదర్శన ప్రారంభించి పుస్తకాలను పరిశీలించారు. పుస్తక పఠనం వల్ల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అవకాశం ఉన్నప్పుడు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లైబ్రియన్ రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

- కావలి: పుస్తకం పఠనం అలవాటు చేసుకుంటే ప్రపంచ జ్ఞానాన్ని పెంచుకోవచ్చని న్యాయస్థానాల ఏపీపీ మృదుల తెలిపారు. స్థానిక వెంగళరావునగర్ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సునీత, లోక్ అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.
- అనంతసాగరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రత్యేక ర్యాలీ నిర్వహించి పాముఖ్యతను వివరించారు. అనంతరం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రంధపాలకుడు నారాయణరావు, శాంతిని కేతన్ స్కూల్ డెరక్టర్ గోలి ప్రభాకర్ పాల్గొన్నారు.
- ఏఎస్ పేట: స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ అధికారి శ్రీనివాసరాజు, సర్పంచ్ భర్త షేక్ జిలాని బాషా కలిసి గ్రంథాలయ జిల్లా వారోత్సవాల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి వినాయత్ పాల్గొన్నారు.



సంగం: గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు, పాఠకులు

మందకృష్ణ మాదిగ పర్యటన జయప్రదం చేయడం

కలిగిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఈ నెల 24న నెల్లూరు మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి హాజరు అవుతారని సంఘం మండలాధ్యక్షుడు నందిపోగు వెంగళరావు తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో శుక్రవారం సంఘం సభ్యులతో జరిగిన సమావేశంలో ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి బిక్షాలు హాజరయ్యారు. మందకృష్ణ మాదిగ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పందిటి అంబేద్కర్, కొప్పర్తి కొండయ్య, గోచిపాతల వెంకటేశ్వర్లు, బొర్రా వెంగళరావు, గోచిపాతల ఆనందరావు, స్వర్ణకొండయ్య పాల్గొన్నారు.

రేపటి నుంచి అన్నప్రసాద వితరణ

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎనర్రవాడలో ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆదివారం నుంచి జనవరి ఒకటో తేదీ వరకు శ్రీలక్ష్మీవెంగమాంబ సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు కార్యదర్శి మేడేపల్లి మాల్యాద్రి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 60 దాటిన వృద్ధులు, ఒంటరి మహిళలు, పురుషులు, మాల ధరించిన భక్తులు, దివ్యాంగులకు వితరణ ఉంటుందన్నారు.

వధూవరులకు మేకపాటి ఆశీర్వాదం

ఆత్మకూరు, నవంబరు 15: టీడీపీ పట్టణ అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల చంద్రారెడ్డి కుమార్తె వివాహం ఇటీవల జరిగింది. ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఆత్మకూరులోని తుమ్మల చంద్రారెడ్డి స్వగృహానికి వచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు పాల్గొన్నారు.

అవసరం మేరకు ఎరువులు అందజేస్తాం

- విజయలక్ష్మీ, ఏవో బిట్రగుంట



బిట్రగుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల రైతులకు వ్యవసాయానికి ఏది అవసరమో వాటిని గుర్తించి వారి అభిప్రాయ ప్రకారం మేరకు మాత్రమే అందజేస్తామని మండల వ్యవసాయ అధికారి విజయలక్ష్మీ తెలిపారు.

? ఇటీవల కురిసిన వర్షాలకు నారుమడులు దెబ్బతిన్నాయా.

! మండలంలో 6వేల ఎకరాలకు సరిపడా 3వందల ఎకరాల్లో నార్లు పోసి ఉన్నాయి. ఏవీ దెబ్బతినలేదు.

? ఎన్ని ఎకరాల్లో రైతులు నార్లు పోసే అవకాశం ఉంది

! జక్కేపల్లి గూడూరు, బిట్రగుంట, నాగులవరం, ముంమూరు పంచాయతీలో నార్లు పోసి ఉన్నారు. మిగిలిన పంచాయతీలో 16 వేల ఎకరాలకు నార్లు పోయాల్సి ఉంది.

? యూరియా అందజేశారా.

! ప్రస్తుతం 100 టన్నుల యూరియా నాలుగు పంచాయతీలకు అందచేశాం. మిగిలిన పంచాయతీల రైతులు అడిగితే అందజేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

? పంటలు నష్టపోతే ఏ చర్యలు తీసుకుంటారు

! ప్రతిరైతు ఈ క్రాప్, పంట బీమా చేయించుకోవాలని పలుమార్లు తెలియజేశాం. ఎవరైనా ఉంటే నమోదు చేయించుకోండి.

మార్గదర్శకులు గణపతిరావు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

కావలి టౌన్, నవంబరు 15: కమ్యూనిస్ట్ ఉద్యమ మార్గదర్శకులు కామ్రేడ్ చిమట గణపతిరావు అని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పట్టణ ఎస్‌బీఐ సమీపంలోని కల్యాణ మండపంలో చిమట గణపతిరావు సంతాప సభ నిర్వహించారు. పూర్వ ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీనివాసమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య వక్తలుగా ఆయనతో పాటు టీడీపీ పొలిట్ బ్యూరో మెంబర్ గురజాల మాల్యాద్రి పాల్గొన్నారు. ముందుగా గణపతిరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య ప్రజాశక్తి జర్నలిజం కాలేజ్ మాజీ ప్రిన్సిపాల్ ఉన్నం వెంకటేశ్వర్లు, మాదాల వెంకటేశ్వర్లు, గోగుల శ్రీనివాసులు, తాళ్లూరు మాల్యాద్రి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

సంగం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శుక్రవారం ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈవోఆర్డీ ప్రసాదు అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతమ్మ, జడ్పీటీసీ లక్ష్మీ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

1న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కందుకూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ ఆవిర్భవించి 50ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబరు 1న కందుకూరులో కావలి, కందుకూరు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆహ్వాన సంఘం ప్రతినిధులు ఆర్.హరిబాబు, బ్రహ్మయ్యలు తెలిపారు. శుక్రవారం స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమ్మేళ లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు యల్ . రాజశేఖర్ తదితరులు ఉన్నారు.